బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు: 140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 206 | గురువారం | 27-06-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## కెసిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్‌కు చెందిన కొందరు ఎంఎల్‌ఎలు ఆ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి ,మర్రి జనార్ధన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సి తాతా మధుతో పాటు మాజీ ఎంఎల్‌ఎలు, పలు కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు, జిల్లా నాయకులు కెసిఆర్‌ను కలిశారు.




## సింగరేణి బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ

# జూలై 5న 'కోల్ బెల్ట్' బంద్

15 రోజుల పాటు సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, నిరహార దీక్షలు, జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడి

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా కేంద్రంతో రాష్ట్రం పోరాడాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు

ప్రైవేటు సంస్థలు దోపిడీ చేస్తాయి : సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా

ప్రజాపక్షం / హైదరాబాద్

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కొత్త బొగ్గు గనులను సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 5వ తేదీన "కోల్ బెల్ట్ బంద్"ను నిర్వహించనున్నట్లు సిపిఐ, సింగరేణి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిడబ్ల్యుయు–ఎఐటియుసి అనుబంధం) ప్రకటించాయి. సింగరేణి కార్మికుల ఉద్యమానికి మద్దతుగా కార్మికులతో కలిసి సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జూలై 5వ తేదీ నుంచి 15 రోజుల పాటు నిరసన ప్రదర్శనలు, నిరహార దీక్షలు, జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాలను తరువాయి 2లో

## ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు కెసిఆర్‌కు లేదు

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు, బిఆర్‌ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావుకు, బిఆర్ఎస్ నాయకులకు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీలో చేరుతండడంతో కెసిఆర్, కెటిఆర్, ఇతర నాయకులు తెగ బాధపడుతున్నారని, గుండెలు బాదుకుంటున్నారని, అసలు ఫిరాయింపులను నేర్పిందే బిఆర్‌ఎస్ అని ఆయన అన్నారు. ప్రభుత్వాలను కూల్చే బిజెపి మోసం చేయవచ్చని భయపడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీల ఎంఎల్‌ఎలను తరువాయి 2లో

## లోక్‌సభ స్పీకర్‌గా

# ఓమ్ బిర్లా

వరుసగా రెండవసారి అవకాశం

మూజువాణి ఓటుతో ఎన్నిక

స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన మోదీ, రాహుల్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్‌గా ఎన్‌డిఎ అభ్యర్థి ఓం బిర్లా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. మూజువాణి ఓటుతో ఆయన ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. బుధవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ జమ్ముకశ్మీర్‌కు చెందిన ఎంపితో ప్రమాణం చేయించారు. ఆ తర్వాత 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లాకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ తీర్మానం ప్రతిపాదించగా రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బలపరిచారు. ఆ తర్వాత మరికొందరు మంత్రులతోపాటు ఎన్‌డిఎకు చెందిన ఎంపిలు ఓం బిర్లా అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును శివసేన ఎంపి అరవింద్ సావంత్ ప్రతిపాదించగా మరికొందరు బలపరిచారు. అనంతరం మూజువాణి ఓటుతో 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, ఓం బిర్లా స్థానం వద్దకు వెళ్లి అభినందనలు తెలిపారు. ఆ తర్వాత ఆయనను స్పీకర్ స్థానం వద్దకు తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్‌గాంధీ కరచాలనం చేసుకున్నారు.

**బిర్లాపై మోదీ ప్రశంసలు**

స్పీకర్ ఎన్నిక అనంతరం ప్రసంగించిన ప్రధాని మోదీ ఓంబిర్లాపై ప్రశంసలు కురిపించారు. ఓం బిర్లాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు స్పీకర్‌గా ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'వరుసగా తరువాయి 2లో

## తొలిరోజే రగడ

ప్రసంగంలో 'ఎమర్జెన్సీ'పై స్పీకర్ వ్యాఖ్యలు

ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం

సభ నేటికి వాయిదా



లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికైన ఓమ్ బిర్లా సభలో తొలి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ఎమర్జెన్సీ' అంశాన్ని ప్రస్తావించారు. అత్యయిక స్థితి నాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ సభలో మౌనం పాటించారు. అయితే, స్పీకర్ ప్రసంగంపై కాంగ్రెస్ సహా విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎన్నికైన ఓం బిర్లాకు ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'పై తీసుకొచ్చిన తీర్మానాన్ని చదవి వినిపించారు. '1975, జూన్ 25 మన దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆ రోజున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. ప్రపంచంలోనే మనం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు సాధించాం. ఆ ప్రజాస్వామ్య విలువలు, చర్చలు దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ, నాటి ప్రధాని (ఇందిరాగాంధీ) నియంతృత్వాన్ని అమలు చేశారు. ప్రజాస్వామ్య సూత్రాలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణగదొక్కారు. ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారు. మీడియాపై తరువాయి 2లో

## ఉస్మానియా, గాంధీ, కాకతీయ వైద్య కళాశాలలకు

# రూ.204.8కోట్లు మంజూరు

రెండు జిఒలు జారీచేసిన ప్రభుత్వం

మంత్రి దామోదర రాజనర్సింహాతో జరిగిన చర్చలు సఫలం

సమ్మె విరమించిన జూడాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలను,స్టైఫండ్ బకాయిలను వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. జూడాలు చేసిన 8 డిమాండ్లలో ఆరు డిమాండ్లకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. జూడాల సమ్మె నేపథ్యంలోనే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో జూడాల వసతిగృహాల నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులను జారీ చేసింది. కాకతీయ వైద్య కళాశాలలో రహదారుల పునరుద్ధరణకు కూడా నిదులను విడుదల చేసింది. డిమాండ్లపైన జూడాలతో ప్రభుత్వం బుధవారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహా హామీతో జూడాలు సమ్మెను విరమించారు. గురువారం నుంచి జూడాలు విధులకు హాజరు కానున్నారు. కాగా జూడాలు ఈ నెల 24 నుంచి సమ్మె బాట పట్టారు. అత్యవసర సేవలు మినహా ఒపి ఇతర సేవలను వారు బహిష్కరించారు. జూడాల డిమాండ్లపై ప్రభుత్వం జరిపిన చర్చలువిఫలం కావడంతో సమ్మెను కొనసాగించారు. చర్చల అనంతరం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జూడాలతో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ జూడాలు ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వసతి తరువాయి 2లో

## పలు జిల్లాల్లో భారీ వర్ష సూచన

వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల రెండురోజులు పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. పలుచోట్ల బలమైన ఉపరితల గాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. మధ్య గుజరాత్ ప్రాంతాలలో కేంద్రీకృతమైన ఆవర్తనం నుంచి మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడ మీదుగా తూర్పు విదర్భ వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందన్నారు. ఆవర్తనం పశ్చిమ మధ్య దానిని ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతం వద్ద సగటు సముద్ర మట్టానికి 1.5 నుంచి 5.8 కిలో మీటర్ల మధ్య కొనసాగుతుందన్నారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, తరువాయి 8లో



## రాహుల్‌ను ప్రతిపక్షనేతగా గుర్తించిన స్పీకర్

**న్యూఢిల్లీ/అలహాబాద్ :** లోక్‌సభలో ప్రతిపక్షనేతగా రాహుల్‌గాంధీని గుర్తిస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. ప్రతిపక్షనేతగా రాహుల్‌ను ఎన్నుకున్నట్లు మంగళవారం కాంగ్రెస్ లోక్‌సభకు సచివాలయానికి సమాచారం అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన రాహుల్‌గాంధీని అధికారికంగా గుర్తిస్తూ బుధవారం నాడు లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 9వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్‌గాంధీకి పార్లమెంట్ చట్టం 1977లోని సెక్షన్ 2 కింద ప్రతిపక్షనేత వేతనం, అలవెన్స్‌లను వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, దేశంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి భారతీయుడిని గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని చెప్పారు.

**రాహుల్ వ్యక్తిగత హాజరుకు ఆదేశించిన కోర్టు**

పరువునష్టం కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్ కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. జులై 2వ తరువాయి 2లో

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని

# ఎన్‌హెచ్‌గా ప్రకటించండి

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈసందర్భంగా రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే జాతీయ రహదారులుగా ప్రకటించిన మార్గాల పనుల ప్రారంభం తదితర విషయాలను తరువాయి 2లో






## డిజైన్ ప్రకారం కట్టకనే

# కుంగిన మేడిగడ్డ

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంజనీర్ల సూచనలను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ ఒకలా, నిర్మాణం మరోలా చేయడంతోనే బ్యారేజీ కుంగిందని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని తరువాయి 2లో

# కొంప ముంచుతున్న అత్యాశ!

వందల కోట్లలో టోకరా - బిచాణా ఎత్తివేస్తున్న రోజుకో సంస్థ

ప్రజాపక్షం/హైదరాబాద్







తమ సంస్థలో డిపాజిట్లు పెడితే అందరికంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామనగానే క్యూకట్టి మరీ డిపాజిట్లు పెడుతున్నారు వినియోగదారులు. మొదటి నాలుగైదు నెలలు చెప్పిన ప్రకారం వడ్డీ సక్రమంగానే చెల్లిస్తారు. దీంతో సదరు సంస్థపై వినియోగదారుడికి మరింత నమ్మకం ఏర్పడుతుంది. దీంతో అత్యాశకు పోయిన కొందరు తమ దగ్గర ఉన్న బంగారం, భూములు, ఇల్లు అమ్మి మరీ డిపాజిట్లు చేస్తున్నారు. రూ.వందల కోట్ల డిపాజిట్లు రాగానే సంస్థలు బిచాణా ఎత్తివేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కేసులు నమోదు చేయడం నిందితులను అరెస్టు చేయడం వరకు పోలీసులు తమ విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నారు. అయితే నిందితుల నుంచి డబ్బులు రికవరీ చేయడం పోలీసులకు తలకుమించిన భారంగా మారడంతో బాధితులకు దిక్కుతోచని స్థితి.. ఇటీవల హైదరాబాద్‌లో చూసిన వందల కోట్ల రూపాయాల డిపాజిట్ల ఎగవేసిన సంస్థల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

ఆ మూడు సంస్థల్లో వేలాది మంది బాధితులు....

ఆబిడ్స్‌లోని శ్రీప్రియాంక ఎంటర్ ప్రైజెస్, బంజారాహిల్స్‌లోని విబిజె క్యాప్‌స్టాన్ బిల్డర్స్ ప్రైయివేట్ లిమిటెడ్, హబ్సిగూడలోని దీక్షా ట్రేడర్స్, ప్రాణేశ్వరి గోల్డ్ ట్రేడింగ్, తాళ్లపల్లి రోహిత్, మమత దంపతులది ఇదే తంతూ.అధిక వడ్డీల ఆశ చూపి తరువాయి 8లో

## టిపిసిసి అధ్యక్షుడిగా జీవన్‌రెడ్డి?

ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి



కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు హైదరాబాద్ నుండి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఢిల్లీకి వెళ్లారు. జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను జీవన్ రెడ్డికి సమాచారం ఇవ్వకుండా ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న అంశం ఎమ్మెల్సీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. సియం పై అసహనంతో ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేస్తానని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం లేపింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్‌లు లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లు జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు జరిపిన చర్చలు సఫలం కాలేకపోగా తరువాయి 8లో

# అట్టుడుకుతున్న కెన్యా

పన్ను పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు

పోలీసు కాల్పుల్లో 22 మంది మృతి, పలువురికి గాయాలు



**నైరోబీ:** ప్రజలు వీధుల్లోకి వచ్చి, నిరుసనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కెన్యాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే జీవన వ్యయ సంక్షోభంతో అల్లాడుతుండగా, కొత్తగా పన్నులు పెంచుతూ పార్లమెంటులో తీర్మానాన్ని ఆమోదించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు జోరందుకోగా, పార్లమెంటు భవనాన్ని ముట్టడించడానికి ప్రయత్నించిన ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 22 మంది మృతి చెందారని, పలువురు తీవ్రగా గాపడ్డారని సమాచారం. తొమ్మిది మంది మృతి చెందినట్టు మీడియాలో ఒక వర్గం పేర్కొంటుండగా, అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అయితే, పన్ను పెంపును కెన్యా పౌరులు వ్యతిరేకిస్తున్నారు. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి క్లిష్టసమయంలో, పన్నులను పెంచడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుండగా, భద్రతా బలగాలను మోహరింప చేసిన ప్రభుత్వం, శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ, అట్టుడుకుతున్న కెన్యాలో శాంతి స్థాపన అంత సులభంగా కనిపించడం లేదు. ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోకపోతే, శ్రీలంక, పాకిస్తాన్ వంటి దేశాల మాదిరి ఆర్థికంగా దివాలా తీయాల్సి వస్తుంది. పన్నులను పెంచడమే ప్రధాన ఆదాయ మార్గంగా కెన్యా అధ్యక్షుడు విలియం రూటో నిర్ణయించాడు. ఆ ప్రకారమే ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టగా, పార్లమెంటు ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. రాయిటర్స్ ప్రకారం, వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ వాహనాలు, భవనాలను కొంత మంది ధ్వంసం చేసి, నిప్పు పెట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది మంది గుంపులుగుంపులుగా వెళ్లి, అధికారులను చుట్టుముట్టడంతో, పోలీసులు లాఠీచార్చి చేస్తున్నారు. భాష్పవాయివును ప్రయోగిస్తున్నారు. తాజాగా పార్లమెంటు భవనాన్ని ముట్టడించడానికి కదలడంతో, పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కనీసం పది మంది మృతి చెంది ఉంటారని రాయిటర్స్ అనుమానం వ్యక్తం చేస్తుండగా, మృతుల సంఖ్య 20 దాటించదని స్థానిక మీడియా పేర్కొంది.

## ప్రతిపక్షనేతగా గుర్తించిన స్పీకర్

**(మొదటి పేజీ తరువాయి)**

తేదీన వ్యక్తిగతంగా తమ ముందు హాజరుకావాలని ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారంనాడు ఆదేశించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై 2018 లో రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ బిజెపి నేత విజయ్ మిశ్రా ఆయనపై పరువునష్టం కేసు వేశారు. 'భారత్ జోడో యాత్ర' గత ఫిబ్రవరి 20న అమేథీకి చేరినప్పుడు కోర్టు ముందు రాహుల్ హాజరయ్యారు. దాంతో కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కాగా, ఈ కేసు తిరిగి విచారణకు రావడంతో రాహుల్‌ను వ్యక్తిగత హాజరు నుంచి మినహాయించాలని ఆయన తరపు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా కోర్టును కోరారు. అయితే, కోర్టు ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ తదుపరి విచారణకు రాహుల్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.

## రూ.204.8కోట్లు మంజూరు

**(మొదటి పేజీ తరువాయి)**

గృహాలపై ఫిర్యాదు చేశారని, వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, తమకు మరింత భద్రత కల్పించాలని జూడాలు కోరారని వివరించారు. జూనియర్ డాక్టర్లు లేవనెత్తిన సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారని, ఆయన ఆదేశాల మేరకు ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులను సందర్శించామని, ఈ రెండు ఆసుపత్రులకు రూ.204.85 కోట్లను కేటాయించినట్టు వెల్లడించారు. ఉస్మా నియా ఆసుపత్రిలో సౌకర్యాల కోసం రూ.121.90 కోట్లు , గాంధీ ఆసుపత్రి కోసం రూ.79.50 కోట్లు మంజూరు చేశామన్నారు. కాకతీయ ఆసుపత్రికి సిసి రోడ్డు మంజూరు చేశామని స్పష్టం చేశారు. వైద్య సౌకర్యాలు మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. ఉస్మానియా ఆసుపత్రి అంశం కోర్టులో ఉన్నదని, ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనాలు నిర్మించేందుకు తాము సిద్ధమన్నారు. పేదలకు వారి వారి ప్రాంతాల్లోనే వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదల ప్రజలకు విద్య, వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఆసుపత్రుల్లో మంచి భోజనం అందించాలని ఆదేశించామన్నారు.

## నైతిక హక్కు కెసిఆర్‌కు లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

చేర్చుకుంటున్నదని ఆయనఅన్నారు. ''పార్టీ ఫిరాయింపులకు సిపిఐ వ్యతిరేకం. ఎలాంటి ఫిరాయింపులను కమ్యూనిస్టు పార్టీ ప్రోత్సహించదు. ప్రజాప్రతినిధులంతా నీతివంతులుగా ఉండాలని చెబుతుంది. పార్టీ ఫిరాయించే వారి విషయంలో చట్టం తన పని తాను చేస్తుంది'' అని కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. ఫిరాయించిన వారిపై పిటిషన్లు ఇచ్చే హక్కు కెసిఆర్‌కు లేదని, వారిని ఎన్నుకున్న ప్రజలకు మాత్రమే హక్కు ఉందన్నారు. 2018 ఎన్నికల్లో 80 మందికి పైగా బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు గెలిచినప్పటికీ ఇంకా ఇతర రాజకీయ పార్టీల నుంచి ఎంఎల్‌ఎలను చేర్చుకున్నారని, బిఆర్‌ఎస్ ఎవరినీ బతకనివ్వలేదని, బిజెపి ఎదిగేందుకు కారణమైందని, అప్పుడు బిఆర్‌ఎస్ చేసిన పాపమే ఇప్పుడు వారికి పాపమై తగిలిందని విమర్శించారు. ''ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్నది కూడా నైతికంగా తప్పే. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సాధారణ సాధారణ మెజారిటీ ఉండడం. రాష్ట్రప్రభుత్వాలను కూల్చే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఉండడంతో ఎప్పుడు ఏమౌతుందోనని భయపడుతున్నది. అందుకే కాంగ్రెస్ పార్టీ తమ పార్టీలో చేరే ఆసక్తి ఉన్న ఎంఎల్‌ఎలను చేర్చుకుని ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నది'' అని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కూడా కాంగ్రెస్‌లోకి పోతేపొండి కానీ అభివృద్ధికోసం అంటూ సుద్దులు చెప్పవద్దన్నారు.

## తొలిరోజే రగడ (మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలు విధించారు. యావత్ దేశం కారాగారంగా మారిపోయింది'' అని స్పీకర్ గుర్తుచేశారు. నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం అత్యయిక స్థితిని ఎదిరించిన వారిని తాము అభినందిస్తున్నామని ఓం బిర్లా అన్నారు. అనంతరం నాటి చీకటి రోజులకు నివాళిగా సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దామని సభ్యులను కోరారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. అయితే, స్పీకర్ మాట్లాడుతున్న సమయంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలు తమ తమ స్థానాల్లో లేచి నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

**నేటి తరం తెలుసుకోవాలి: మోదీ**

స్పీకర్ ప్రసంగంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 'ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి అప్పటి ప్రభుత్వం సాగించిన అన్యాయాలను ఆయన ఎత్తిచూపారు. దాదాపు 50 ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించారు. దాని గురించి నేటి తరం తెలుసుకోవడం చాలా ముఖ్యం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి.. ప్రజాభిప్రాయాన్ని అణచివేసి, సంస్థలు నాశనం చేసినప్పుడు సమాజం ఎలా ఉంటుందో చెప్పేందుకు నాటి రోజులే సరైన ఉదాహరణ. నియంతృత్వం ఎలా ఉంటుందో ఎమర్జెన్సీ పరిస్థితుల నుంచి తెలుసుకోవచ్చు''అని మోదీ 'ఎక్స్'ఖాతాలో రాసుకొచ్చారు.






# మానవత్వం జాడ ఎక్కడ?

పాలస్తీనా యువకుడిపై?

ఇజ్రాయెల్ దళాల కాల్పులు

తాళ్లతో వాహనానికి కట్టి.. గాయపరచి.. చిత్రహింసలు

**జెనిన్:** మానవత్వాన్ని మరచిన ఇజ్రాయెల్ దళాలు గాజా స్ట్రిప్‌లో జరుపుతున్న అకృత్యాలకు అద్దం పట్టే వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ నగరంలో, పొరుగునే ఉంటున్న తమ సమీప బంధువు ఇంటి వద్ద అలజడి వినిపించడంతో, ఏం జరుగుతున్నదో చూద్దామని బయటకు రావడమే 24 ఏళ్ల ముజాహిద్ అబాదీ నేరమైంది. అతనిపై కాల్పులకు తెగబడిన ఇజ్రాయెల్ దళాలు, ఆతర్వాత తాళ్లతో జీపుకు కట్టి, చిత్రహింసలకు గురిచేశారు. గాయపరచి, మానవ కవచంగా వాడుకున్నారు. ఆ తర్వాత తాపీగా ఆసుపత్రిలో చేర్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వచ్చిన వీడియోపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. 'దిగ్భ్రాంతికరమైన సంఘటన'గా అమెరికా అభివర్ణించింది. తొలుత అతను అనుమానిత హమాస్ ఉగ్రవాదిగా పేర్కొన్న ఇజ్రాయెల్ దళాలు, ఆతర్వాత మాట మార్చాయి. కొంత సేపటి తర్వాత మాట మార్చింది. అబాదీ తమకు ఎలాంటి ముప్పు కలిగించలేదని అంగీకరించింది. అయితే,హమాస్ మిలిటెంట్లతో జరిగిన ఎదురుకాల్పుల్లో అబాదీ గాయపడినట్టు ప్రకటించింది. అయితే, ఈ అమానుషానికి పాల్పడిన ఇజ్రాయెల్ దళాలు అబద్ధాలు ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అబాదీని మానవ కవచంగా ఉపయోగించడాన్ని పలువురు సామాజిక కార్యకర్తలు తప్పుపట్టారు. తమ పౌరులను కిడ్నాప్ చేసి, వారిని దారుణంగా హింసించి, ఆతర్వాత యుద్ధ మయంలో వారిని అడ్డుపెట్టుకుంటున్నారని హమాస్‌పై ఇజ్రాయెల్ ఎంతోకాలంగా విమర్శలు చేస్తున్నది. హమాస్ చేసినట్టు చెప్తున్న అమానవీయ చర్యలను ఇజ్రాయెల్ అనుసరించడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తాము అనుసరిస్తున్న విలువలకు విరుద్ధమైన ఘటనగా పేర్కొంది. కానీ, ఈ వాదనను ఎవరూ నమ్మడం లేదు. గాజాస్ట్రిప్‌లో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ సైన్యం జరుపుతున్న అమానవీయ దాడులకు, కొనసాగిస్తున్న అరాచకాలకు ఈ ఘటన ఒక నిదర్శనమన్న విమర్శలు ఉన్నాయి. కాగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబాదీ అసోసియేట్ ప్రెస్‌తో మాట్లాడుతూ, తాను కోలుకుంటున్నట్టు చెప్పాడు. 'నేను మా పక్కనే ఉన్న బంధువుల ఇంటి వద్ద అలికిడి గమనింపి, ఇజ్రాయెల్ సైన్యం అటువైపు వచ్చిందేమో చూడడానికి ఇంటి నుంచి బయటకు వచ్చాను. అకస్మాత్తుగా నాపై కాల్పులు జరిగాయి. ఒక బులెట్ భుజం నుంచి దూసుకెళ్లింది. భయంతో, అక్కడే ఉన్న కారు వెనుక దాక్కున్నాను. కొంతసేపటి తర్వాత మళ్లీ కాల్పులు చప్పుడు వినిపించింది. ఈసారి బులెట్ కాలిలో దిగబడింది. మా నాన్నకు ఫోన్ చేస్తే, మాట్లాడుతునే ఉండమని చెప్పాడు. కానీ, ఫోన్ సిగ్నల్స్ ఆగిపోయాయి. సైనికులు నన్ను బలవంతంగా ఈడ్చుకువెళ్లారు. బులెట్ గాయాలు తగిన చోటే బలంగా కొట్టారు. ఒక జీపు స్టీరింగ్‌కు తాళ్లతో బంధించారు' అని వివరించాడు. తన పక్కనే ఉన్న తమ బంధువు కూడా గాయపడ్డాడని, అతని జాడ తెలియదని అన్నాడు. అబాదీ తండ్రి రయీద్ మాట్లాడుతూ, అబాదీ ఫోన్ చేసి, తాను చనిపోబోతున్నట్టు చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నాడు. స్పృహ కోల్పోకుండా ఉండేందుకు మాట్లాడుతునే ఉండమని చెప్పానని, కానీ, ఆ వెంటనే ఫోన్ డిస్కనెక్ట్ అయిందని అన్నాడు. కొన్ని నిమిషాల తర్వాత, జనిన్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో పాలస్తీనాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందినట్టు వార్త రావడంతో మానసికంగా కుంగిపోయానని, అది తన కుమారుడు అబాదీకి సంబంధించిన వార్తగానే అనుమానించానని రయీద్ అన్నాడు. కానీ, అతను తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడన్న సమాచారం తెలుసుకొని ఊరట చెందానని చెప్పాడు. ఇజ్రాయెల్ సైనికులు మాత్రం, గాయపడిన అబాదీ కిందపడకుండా ఉండేందుకు కట్టేసి, వైద్య చికిత్స అందించేందుకు తీసుకెళ్లామని, దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారమవుతున్నదని అంటున్నారు. కానీ, పాలస్తీనా రెడ్ క్రీసెంట్ రెస్క్యూ సర్వీస్ ప్రతినిధి నెబల్ ఫర్సాఖ్ అసోసియేట్ ప్రెస్‌తో మాట్లాడుతూ, సైన్యం ఆ ప్రాంతాన్ని పూర్తిగా దిగ్బంధించిందని అన్నాడు. అబాదీని కట్టేసిన జీపు రెండు అంబులెన్స్‌లను దాటి వెళ్లడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నాడు. అబాదీని పారిమెడికల్‌కు తరలించే ప్రయత్నంలో భాగంగానే జీపుకు కట్టేశామని అనడం నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించాడు. అబాదీ బాధతో అల్లాడుతున్నప్పటికీ, కనీసం గంటపాటు అతనికి కనీస వైద్య సేవలు కూడా అందకుండా నిలువరించారని ఫర్సాఖ్ ఆరోపించాడు. ఈ ఘటనపై వాషింగ్టన్ డిసిలో స్టేట్ డడిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ దాడిని ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదిఏమైనా, తాజా ఘటన అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. పౌరులను కవచాలుగా ఉపయోగించడాన్ని ప్రపంచ దేశాలు తప్పుపడుతున్నాయి. ఇజ్రాయెల్ వెంటనే కాల్పుల విరమణ పాటించి, చర్చలు మొదలు పెట్టాలని కోరుతున్నాయి.

## రహస్య విచారణ

**ఎకాటెరిన్‌బర్గ్ (రష్యా):** గూఢచర్యానికి పాల్పడ్డాన్న అరోపణలు ఎదుర్కొంటున్న వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యుఎస్‌జె) రిపోర్టన్ ఇవాన్ గెర్ష్‌కొవిచ్‌ను ఇక్కడి న్యాయస్థానంలో బుధవారం రహస్యంగా విచారించారు. మీడియా ప్రతినిధులనుగానీ, ఇతరులనుగానీ కోర్టు ఆవరణలోకి అనుమతించలేదు. 2023 నుంచి మాస్కో జైల్లో బందీగాఉన్న అతనిని ఇక్కడికి తీసుకొచ్చిన తర్వాత, విచారణ కోసం కోర్టులో హాజరుపరచడం ఇదే మొదటిసారి. సోవియట్ యూనియన్ పతనం తర్వాత గూఢచర్యం ఆరోపణలపై రష్యాలో ఒక అమెరికన్ జర్నలిస్టు అరెస్టు కావడం ఇదే మొదటి సారి. ఇలావుంటే, ఇవాన్ విడుదలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బేరం పెట్టినట్టు సమాచారం. జర్మనీలో హత్యానేరానికి పాల్పడినట్టు రుజువుకావడంతో, అక్కడ జైలు శిక్షను అనుభవిస్తున్న ఎఫ్ఎస్‌బి ప్రతినిధి వాడిమ్ క్రాసికోవ్‌తోపాటు, మరికొందరిని విడుదల చేస్తే, ఇవాన్‌ను విడిచిపెడతామని పుతిన్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. కాగా, ఇవాన్ అరెస్టును డబ్ల్యుఎస్‌జె ఖండించింది. తన విధులను నిర్వరిస్తున్న ఇవాన్‌ను రాజకీయ ప్రయోజనం కోసం అరెస్టు చేశారంటూ రష్యాపై ఆరోపణలు చేసింది. ఇలావుంటే, నేరం రుజువైతే జవాన్‌కు గరిష్టంగా 20 సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

## ఇల్లు చేరిన అసాంజే

**కాన్‌బెరా (ఆస్ట్రేలియా):** వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఎట్టకేలకు ఇల్లు చేరాడు. ఇరాక్, అఫ్గానిస్థాన్ దేశాలపై అమెరికా చేసిన యుద్ధాలు, ఆ తర్వాత ఇతర దేశాలతో కలిపి ఆక్కడ ఉంచిన సంకీర్ణ దళాలకు సంబంధించిన వివిధ డాక్యుమెంట్లను వికీలీక్స్ ద్వారా బహిర్గతం చేసిన అతనిపై గూఢచర్య కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే, లండన్ చేరుకున్న అతను, అక్కడ మరో కేసులో అరెస్టయ్యాడు. అప్పటి నుంచి అతనిని అప్పగించాల్సిందిగా అమెరికా కోరుతునే ఉంది. అయితే, అమెరికాలో తనకు ప్రాణహాని పొంచి ఉందని అసాంజే అనుమానం వ్యక్తం చేయడంతో బ్రిటన్ కోర్టు అతనిని అప్పచెప్పడానికి అంగీకరించవద్దని బ్రిటన్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఇలావుంటే, అతని రక్షణకు



అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, కేసును కొట్టివేస్తామని అమెరికా హామీ ఇవ్వడంతో అసాంజే విడుదల సాధ్యమైంది. అతనిని లండన్ జైలు నుంచి ప్రత్యేక విమానంలో, అమెరికాకు చెందినప్పటికీ, ఆ దేశానికి చాలా దూరంగా ఉన్న సైపన్ అస్సాంజ్ కోర్టుకు తరలించారు. అక్కడ కోర్టు ముందు హాజరైన అసాంజే తాను తప్పు చేశానని, క్షమాభిక్ష పెట్టాలని కోరగా, న్యాయమూర్తి వెంటనే అంగీకరించారు. సాంకేతికపరమైన లాంఛనాలు పూర్తయిన తర్వాత అమెరికా అధికారులు అతనిని తన స్వస్థలమైన కాన్‌బెరాకు పంపారు. దీనితో అతని జైలు జీవితానికి తెర పడి, స్వేచ్ఛ లభించింది.

## ఓమ్ బిర్లా

**(మొదటి పేజీ తరువాయి)**

రెండోసారి స్పీకర్‌గా ఎన్నికైన మీకు (ఓం బిర్లా) లోక్‌సభ సభ్యులందరి తరపున శుభాభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా సభాపతిగా పనిచేసిన వారంతా ఎలాంటి పోటీని ఎదుర్కోలేదు. మీరు ఎన్నికలో గెలిచి చరిత్ర సృష్టించారు. స్పీకర్ పదవి ఎంత కఠినమైందో మీకు బాగా తెలుసు. చాలా మంది లోక్‌సభ సభ్యులకు మీతో పరిచయం ఉంది. సభను సరైన దిశలో నడపడంలో స్పీకర్‌ది కీలక పాత్ర. లోక్‌సభ చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహించారు. గత ఐదేళ్లలో స్పీకర్‌గా మీ పదవీకాలంలో సభ 97శాతం పనిచేసింది. పాతికేళ్లలోనే ఇది అత్యధికం కావడం విశేషం. కొవిడ్ సమయంలోనూ సభ సజావుగా సాగేలా చూశారు. సభా మర్యాదను కాపాడేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. అనేక కీలక బిల్లును ఆమోదించారు. వచ్చే ఐదేళ్లూ సభ్యులందరికీ మార్గదర్శనం చేస్తారని విశ్వాసం ఉంది. కొత్త ఎంపిలకు మీరు స్ఫూర్తిగా నిలుస్తారు. మీ మధురమైన చిరునవ్వుతో సభ ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది' అని మోదీ ప్రశంసలు కురిపించారు.

**విపక్షాల గళాన్ని అనుమతించాలి: రాహుల్**

అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. 'ఇండియా కూటమి తరఫున ఓం బిర్లాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ సభ భారతదేశ జనవాణిని వినిపించాలి. ప్రభుత్వానికి రాజకీయంగా బలం ఉండొచ్చు.. కానీ విపక్షాలు ప్రజావాణికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సభ సజావుగా నడపడంలో ప్రతిపక్షం మీకు పూర్తి సహకారం అందిస్తుంది. ప్రజావాణిని బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశమిస్తారని ఆశిస్తున్నా. విపక్షం గొంతు నొక్కడం ద్వారా సభను నడపటం అప్రజాస్వామికం అవుతుంది. మాకు మాట్లాడే అవకాశం ఇస్తారని విశ్వాసంగా ఉన్నాం'' అని రాహుల్ అన్నారు. పలువురు విపక్ష నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. స్పీకర్‌గా ఓం బిర్లా సభలో పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. సభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఎంపిల సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకోబోరని సమాజ్‌వాదీ పార్టీ అధినేత యాదవ్ ఆకాంక్షించారు. ప్రతిపక్షాల పట్ల బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని, అధికార పక్షాలతో సమానంగా అవకాశాలు కల్పిస్తారని తాను ఆశిస్తున్నానని ఆయన అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నేత సుదీప్ బంద్యోపాధ్యాయ, డిఎంకె నేత టిఆర్ బాలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సభ పనితీరు ఎల్లప్పుడూ ట్రెజరీ బెంచీల వైఖరిపై ఆధారపడి ఉంటుందని బందోపాధ్యాయ అన్నారు. 17వ లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను ప్రస్తావిస్తూ, ఇది వాంఛనీయం కాదని అన్నారు. ప్రతిపక్షాన్ని, అధికార పక్షాన్ని ఒకే విధంగా చూడాలని, దయచేసి నిష్పక్షపాతంగా ఉండండాలని బాలు విజ్ఞప్తి చేశారు.

**'సంప్రదాయాలు, విలువలు కాపాడుతాను'**

సభలో విమర్శలు, భిన్నాభిప్రాయాలు ఉండాలని, అంతేగానీ ఎలాంటి ఆటంకాలు ఏర్పరచకూడదని స్పీకర్ ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరుసగా రెండోసారి స్పీకర్‌గా ఎన్నుకోవడం పట్ల సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్‌హెచ్‌గా ప్రకటించండి

**(మొదటి పేజీ తరువాయి)**

కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్–తూప్రాన్–గజ్వేల్–జగదేవ్‌పూర్–భువనగిరిచౌటుప్పల్ (158.645 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించారని, దాని భూ సేకరణకు అయ్యే వ్యయంలో సగ భాగాన్ని తమ ప్రభుత్వమే భరిస్తోందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఈ భాగంలో తమ వంతు పనులు వేగవంతం చేశామని తెలిపారు. చౌటుప్పల్ నుంచి అమన్‌గల్ – షాద్‌నగర్– సంగారెడ్డి వరకు (181.87 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కేంద్ర మంత్రి గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి, ఈ ఏడాది ఎన్‌హెచ్ఏఐ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ (ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్) నుంచి వలిగొండ–తొర్రూర్–నెల్లికుదురు–మహబూబాబాద్–ఇల్లెందు–కొత్తగూడెం వరకు రహదారిని (ఎన్‌హెచ్930పీ) జాతీయ రహదారిగా ప్రకటించారని, ఇందులో కేవలం ఒక ప్యాకేజీ కింద 69 కి.మీ.లకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. హైదరాబాద్ వాసులు భద్రాచలం వెళ్లేందుకు 40 కి.మీ. దూరం తగ్గించే ఈ రహదారిని జైశ్రీరామ్ రోడ్గా వరంగల్ సభలో నితిన్ గడ్కరీ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ రహదారిలో మిగిలిన మూడు ప్యాకేజీలకు (165 కి.మీ) టెండర్లు పిలిచినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, పెద్దపల్లి ఎంపీ వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య రహదారి పనులు చేపట్టాలి..

హైదరాబాద్‌విజయవాడ (ఎన్‌హెచ్ 65) జాతీయ రహదారిని 2024, ఏప్రిల్లోగా ఆరు వరుసలుగా విస్తరించాలి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

ఐకానిక్ బ్రిడ్జి.. ఎలివేటెడ్ కారిడార్

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్‌సోమశిలకరివెననంద్యాల (ఎన్‌హెచ్167కే) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి 142 కి.మీ. పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని, హైదరాబాద్ కల్వకుర్తి వరకు ఉన్న (ఎన్‌హెచ్ 765కే) రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తికరివెన వరకు జాతీయ రహదారి పూర్తయ్యే లోపు హైదరాబాద్‌కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

మంథనికి జాతీయ రహదారి ప్రకటించండి..

మంథని నుంచి సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, మాజీ సభాపతి శ్రీపాదరావు గతంలో ప్రాతినిధ్యం వహించారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల చిత్రంలో మంథనికి చోటు దక్కలేదని, జగిత్యాల పెద్దపల్లిమంథనికాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

## కుంగిన మేడిగడ్డ

**(మొదటి పేజీ తరువాయి)**

డిమాండ్ చేశారు. కమిషన్‌కు అర్హత లేదని కెసిఆర్ అనడం శోచనీయమని, అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ అంశంలో వాస్తవాలు ప్రజలకు తెలియకుండా కెసిఆర్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరామ్ మాట్లాడుతూ ప్రాజెక్ట్‌కు ఖర్చు చేసిన నిధులు ప్రజల సొమ్ము అని, ఎవరి బాబు సొమ్ము కాదని, జవాబు దారిగా ఉండాల్సిందేనని కెసిఆర్ ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడం సరికాదని ఇంజినీర్లు సూచించిన్పటికీ బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రీ డిజైనింగ్‌కు ముందు తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సుజల స్రవంతి పేరుతో, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించిందని, మేడిగడ్డ నిర్మాణంపై ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని కాగ్ కూడా చెప్పిన విషయాన్ని కోదండరామ్ వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ మెటీరియల్ సక్రమంగా లేదని, నిర్వహణ కూడా సరిగ్గా లేదని డ్యామ్ సేఫ్టీ అధికారులు తమ నివేదికలో చెప్పారన్నారు.విచారణ కమిషన్లను రద్దు చేయించి, వాస్తవాలు బయటకు రాకుండా బిఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం లోపభూయిష్టంగా జరిగిందని కాగ్ కూడా స్పష్టం చేసిందన్నారు. బొగ్గు గనులను వేలం వేయడమంటే ప్రైవేటీకరణకు దారి తీస్తుందని, బొగ్గు గనులను సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జస్టిస్ ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరంలో జరిగిన అవినీతి అక్రమాలపై తాము రెండు సార్లు పూర్తి సమాచారంతో నివేదికను సమర్పించామన్నారు.

**ఉద్యమకారుల కేసులను కాదని...కెసిఆర్ ఒక్కరే ప్రయత్నించడం దుర్మార్గం**

కెసిఆర్ పదేళ్లు సిఎంగా ఉన్నప్పుడే తెలంగాణ ఉద్యమకారులందరిపైన ఉన్న కేసులను తొలగించేందుకు ప్రయత్నించకుండా , తనపైన ఉన్న రైల్వే కేసును రద్దు చేయాలనడం దుర్మార్గమని కోదండరామ్ అన్నారు. ఈ కేసులో తానూ ఉన్నానని, ఎంతో మంది పాల్గొన్నారని వివరించారు. ఈ కేసు నుంచి తన ఒక్కన్ని మినహాయిస్తే చాలు అన్నట్లుగా కెసిఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## 'కోల్ బెల్ట్ బంద్'

**(మొదటి పేజీ తరువాయి)**

చేపట్టనున్నట్లు వెల్లడించాయి. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజకుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ ఈ విషయాలను ప్రకటించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడితే మన బొగ్గు గనులు మనకు ఉంటాయని, కొత్త గనులు వస్తాయని, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తే పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో పూర్తిగా నిరాశే మిగిలిందని, పదేళ్లు పరిపాలించిన కెసిఆర్ సింగరేణిపై ఉద్యమ కాలంలో ఇచ్చిన మాటకు భిన్నంగా వ్యవహరించారని విమర్శించారు. కెసిఆర్ చేసిన పాపానికి సింగరేణి ప్రమాదంలో పడిందని, ఇప్పటికే కోయలగూడెం తదితర కొన్ని గనులను ప్రైవేటీకరించారన్నారు.

**బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా కేంద్రంతో రాష్ట్రం పోరాడాలి**

బొగ్గు గనుల వేలం విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధైర్యంగా ఉండాలని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాలని, కేంద్రంతో పోరాడాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. బొగ్గు గనుల వేలం విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అయోమయంలో ఉందని, వేలంలో పాల్గొంటే సింగరేణి వస్తాయో రావే తెలిదని, పాల్గొనకుంటే గనులు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

**గనుల విషయంలో కిషన్‌రెడ్డి అబద్దాలు...** సింగరేణి పరిరక్షణ, బొగ్గు గనుల వేలం పాట విషయంలో ఇటీవల కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి అబద్దాలు చెప్పారని, తెలంగాణ ప్రజలను మోసం చేశారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ ఇచ్చిన మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి పరిధిలోని గనుల వేలం పాటకు తెరలేపడం దుర్మార్గమన్నారు. తాజాగా కొత్త బొగ్గు గనులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పగించే ప్రధాని మోదీ కుట్ర లో మంత్రి కిషన్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారని అన్నారు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన బొగ్గు గనుల లీజు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించినందుకు కిషన్‌రెడ్డి సిగ్గుపడాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి కిషన్‌రెడ్డి బొగ్గుగనులు కేటాయింపు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఒడిషా, గుజరాత్ రాష్ట్రాలకు కేంద్రం గనులను కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు.

**ప్రైవేటు సంస్థలు దోపిడీ చేస్తాయి..**అజీజ్‌పాషా మాట్లాడుతూ బొగ్గు గనులను నిర్వహిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కార్మికుల సంక్షేమంతో పాటు వారి 34 వేల మంది పిల్లలకు విద్యాభ్యాసాన్ని అందిస్తుందని, 45 వేల మందికి సామాజిక సేవలను అందిస్తుందని, గనులను ప్రైవేటీకరిస్తే ప్రైవేటు సంస్థలు వారి లాభాల గురించి తప్ప సంక్షేమాన్ని పట్టించుకోవని తెలిపారు. పైగా గనులలో కార్మికులను దోపిడీ చేస్తారన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన చెప్పారు.

**కొత్త గనులు సింగరేణి ఇవ్వాలి...**సింగరేణి సంస్థ కోట్లాది రూపాయలను ఖర్చు చేసి బొగ్గు నిక్షేపాలను కనుగొంటే వాటిని ప్రభుత్వాలు వేలం వేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దుర్మార్గమని వాసిరెడ్డి సీతారామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో కోయలగూడెం, సత్తుపల్లి బొగ్గు గనుల వేలంపాటలో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం సింగరేణిని పాల్గొనవద్దని చెప్పి రెండు గనులు అరవిందో, అవంతి సంస్థలు దక్కించుకునే విధంగా కుట్ర చేశారని ఆయన విమర్శించారు. గతంలో వేలం వేసిన కోయలగూడెం, సత్తుపల్లి గనుల లీజును రద్దు చేయాలని, వాటితో పాటు కొత్త గనులను కూడా సింగరేణికి ఇవ్వాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గును గ్రేడ్‌ను బట్టి టన్ను బొగ్గును రూ.2500 నుంచి రూ.4000 లకు విక్రయిస్తుండగా, అదానీ సంసస్థలు రూ.19000 నుంచి రూ.21000 లకు టన్ను బొగ్గును అమ్ముతున్నారని, ఫలితంగా బొగ్గు ఆధారిత పరిశ్రమలు చేసే ఉత్పత్తుల ధరలు కూడా గణనీయంగా పెరుగతాయని ఆయన హెచ్చరించారు.

## విద్యా సంస్థల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యా సంస్థల్లో వికలాంగులకు 5% రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు, ప్రభుత్వం నుండి సహాయం పొందుతున్న ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో బెంచ్‌మార్క్ వైకల్యాం ఉన్న వారికి ఐదు శాతం తగ్గకుండ సీట్లల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్దుల సంక్షేమ శాఖ ఉత్తర్వుల్లో పేర్కోంది. అదేవిధంగా వైకల్యాలున్న వ్యక్తులకు ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశానికి ఐదు ఏళ్ల గరిష్ట వయో పరిమితి సడలింపు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

## 200 కిలోల నవసాగరం సీజ్



ప్రజాపక్షం/హైదరాబాద్: నాటుసారా తయారీలో వినియోగించే నవసాగరం ను బేగం బజారు నుంచి ఖమ్మం తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..నాటుసారా తయారీ బెల్లంతోపాటు ఉపయోగపడే నవసాగరం బేగం బాజారు నుంచి ఖమ్మంకు నిందితులు తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిఐలు బాలరాజ్, రవిలు బేగంబజార్ వద్ద దాడి చేసి పట్టుకున్నారు. ఐదు సంచుల్లో 10 కిలోల చొప్పున ఉండే 20 ప్యాకెట్లు లభించించాయి. ఈ నవసాగరం మొత్తం 200 కిలోలు ఉంటుందాని సిఐ తెలిపారు. కేసు నమో దు చేశారు.

## ఘనంగా డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం




ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్జాతీయ మాదాక ద్రావ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందార్భంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాల్ని ఘనంగా జరుపుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు, అధికారులు సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, యువత, పలు స్వచ్చందా సంస్థలతో కలిసి అన్ని జి ల్లా కేంద్రాల్లో డ్రగ్స్ వాడ వద్దాని ప్లా కార్డులతోను, బ్యానర్లతో ర్యాలీలు నిర్వహిఓచారు. సభలు, సమావేశాలు నిర్వహించి డ్రగ్స్ వాడకం, అమ్మకం, రవాణ ఎన్‌పిడిఎస్ యాక్ట్ కింద నేరంగా పరిణగనించబ డుతుందాని ప్రజలకు సమాచారం అందించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, జీవితాలు ఎలా ఉంటాయనే విషయాలపై అవగహన ఎక్సైజ్ పోలీసులు కలిపించారు. యాదాద్రి, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, జనగామ, సిరిసిల్ల, నిర్మల్‌తోపాటు ఇతర జి ల్లాల డిప్యూటి కమిషనర్లు, ఎక్సైజ్ సూపరిండెంట్లు పోలీసులు డ్రగ్స్ వ్యతిరేకంగా కారక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్ పై ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి డ్రగ్స్‌పై అవగహన కల్పిన ఎక్సైజ్ అధికారులకు, సిబ్బందికి అబ్కారీ శాఖ కమిషనర్ ఇ.శ్రీధార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్రెడ్డి అభినందించారు.

## టిటిడిసిఎల్ ఎండిగా ప్రకాష్‌రెడ్డి బాధ్యతలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్.ప్రకాష్‌రెడ్డి బుధవారం హిమాయత్ నగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన మేనేజింగ్ డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చాలను అందజేసి అధినందనలు తెలియజేశారు. గతంలో ప్రకాష్‌రెడ్డి శంషాబాద్ డిసిపిగా,జిహెచ్‌ఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మనేజ్‌మెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఐఎస్ఐ, ఐపిఎస్‌లను బదిలీలు చేయడంతో ప్రకాష్‌రెడ్డి తాజాగా బాధ్యతలు స్వీకరించారు.

## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కారించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఉద్యోగులు, పెన్షనర్స్ గ్రీవెన్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్ జి.చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ సి.చంద్ర శేఖర్‌ల నేతృత్వం లో పలువురు సభ్యులు 10 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని చిన్నారెడ్డికి సమర్పించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వంఅమలు చేస్తున్న ఈహెచ్‌ఎస్ పథకం సక్రమంగా పని చేయడంలేదని, దీంతో వృద్యాప్యం, దీర్ఘ కాలిక వ్యాధుల చికిత్సకు గాను వైద్యం కోసం లక్షల రూపాయలు వ్యయాన్ని భరించలేక పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పెన్షన్లకు గత ఏడాది జూలై నుంచి 2024 జనవరి వరకు పెండింగ్‌లో ఉన్న 4 డిఆర్‌లను విడుదల చేయడంతో పాటు జూలై 2018 తర్వాత పదవీ విరమణ పొందిన పెన్షర్లకు మెడికల్ రీయిం బర్స్‌మెంట అంత్యక్రియల చార్జీలు, పెన్షనరీ ప్రయోజనాలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లోన బిల్లులను ఈ కుబేర్ ద్వారా వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు పెన్షన్‌దార్లు పెండింగ్ ఉన్నఇతర సమస్యలకు పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారులతో ప్రత్యేకసమావేశాన్ని ఏర్పాటు చేయాలని చిన్నారెడ్డిని కోరినట్లు దామోదర్‌రెడ్డి తెలిపారు.

## స్పీకర్ అపాయింట్ మెంట్ ఇవ్వట్లేదు

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్:తమ హయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంఎల్ఎలే కెసిఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకున్నారని(బిఆర్‌ఎస్‌లో చేరారు), సిఎం రేవంత్ రెడ్డి ఇంటింటికీ తిరిగి కండువాలు కప్పు తున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము 'నిన్నటి' నుండి స్పీకర్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నామని,కానీ తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. దీంతో తమకు ఉన్న మార్గాలలో ఒకటిస్పీడ్‌పోస్టు, ఈ మెయిల్ అని, వీటి ద్వారా పార్టీ ఫిరాయించిన ఇద్దరు ఎంఎల్‌ఎలపైన అనర్హత వేటు వెయాలని ఫిర్యాదు చేసినట్టు జగదీష్ రెడ్డి వివరించారు. తమ పార్టీ బి ఫామ్‌పైన గెలిచిన ఎంఎల్ఎలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, పార్టీ ఫిర్యాయింపుల చట్టం ప్రకారం వీరి సభ్యతం రద్దు కావల్సి ఉన్నదని తెలిపారు.పార్టీ మారిన ఎంఎల్‌ఎలపైన చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయపరంగా ముందుకెళ్తామని స్పష్టం చేశారు. పార్టీ పిర్యాయింపులను ప్రోత్సహించిందే కాంగ్రెస్ పార్టీ అని, పార్టీ ఫిరాయింపులపైన పాంచ్ న్యాయ్ మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పొందపర్చిందని, ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహారిస్తోందని ఆరోపించారు. ఇటువంటి పనులు చేయకూడదని ఎంఎల్‌సి జీవన్ రెడ్డి చెబుతున్నారన్నారు. తమ పార్టీకి చెందిన ఎంఎల్ఎల ఇంటింటికీ వెళ్తున్న సిఎం రేవంత్ రెడ్డి, ఎంఎల్‌ఎ మహిపాల్ రెడ్డిని ఢిల్లీలో కలవడని గ్యారంటీ ఏముందని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# ఫిరాయింపులకు బీజం బిఆర్‌ఎస్ వేసిందే

పదేళ్లలో 59 మంది ప్రజాప్రతినిధుల చేర్చుకున్న వైనం

అప్పుడు అభివృద్ధి కోసమే చేరారని వక్కాణింపు

ఇప్పుడేమో ఫిరాయించిన వారిపై ఫిర్యాదులు ఏ పార్టీని వదలని బిఆర్‌ఎస్..

ప్రతిపక్షం లేకుండా చేసిన కెసిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎంఎల్‌ఎలు పార్టీ ఫిరాయించడం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయంశంగా మారింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక పార్టీ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులు మరోక పార్టీలోకి మారడం కొత్తేమీ కాదు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కొంత మంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి తెరమీదికి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పార్టీ ఫిరాయింపులకు బిఆర్‌ఎస్(టిఆర్‌ఎస్)బీజం వేసి, ఆజ్యం పోసిందని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. రెండు పర్యాయాలు (2014,2018) అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ తమ పదేళ్ల కాలంలో ఇతర రాజకీయపార్టీలకు చెందిన 59 మంది ప్రజాప్రతినిధులను కెసిఆర్ చేర్చుకున్నారని, ఇప్పు డు పార్టీ ఫిరాయింపులు, నైతిక విలువల గురించి మాట్లాడడం, ఫిరాయించిన ఎంఎల్‌ఎలను అనర్హులుగా ప్రకటించాలని అసెంబ్లీ స్పీకర్‌కు పిటిషన్లు ఇవ్వడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదని రాజకీయపార్టీలు, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక పోరాటాల అనంతరం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2వ తేదీ రోజునే 2014 ఎన్నికల్లో బిఎస్‌పి నుంచి గెలుపొందిన ఇద్దరు ఎంఎల్‌ఎలు ఎ.ఇంద్రకరణ్ రెడ్డి, కోనేరు కోనప్పను టిఆర్‌ఎస్‌లో చేర్చుకుని, తొలిసారి పార్టీ ఫిరాయింపులకు బీజం వేసింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్, టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి, బిఎస్‌పి, సిపిఐ నుంచి గెలిచిన 25 మంది ఎంఎల్‌ఎలు, 18 మంది ఎంఎల్‌సిలు, నలుగురు ఎంపిలు కలిపి మొత్తం 47 మందిని 2014 – 18 సంవత్సర మధ్య కాలంలో బిఆర్‌ఎస్ (గతంలో టిఆర్‌ఎస్) చేర్చుకున్నారు. అలాగే రెండో దఫా 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 12 మంది ఎంఎల్‌ఎలతో పాటు టిడిపి నుంచి గెలిచిన ఇద్దరు కలిపి మొత్తం 14 మందిని బిఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారు. ఈ పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో మొత్తం 59 మంది ప్రజాప్రతినిధులను బిఆర్ ఎస్ చేర్చుకున్నది. చివరకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కూడా వదలకుండా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను వేలాది మందిని బిఆర్‌ఎస్‌లో చేర్చుకుని, ఫిరాయింపుల పర్వాన్ని తారాస్థాయికి తీసుకెళ్ళారని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల నియోజకవర్గాలఅభివృద్ధి కోసమే వారు తమ పార్టీలో చేరుతున్నారని, అప్పుడు బిఆర్‌ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు ప్రకటించడం గమనార్హం. అసలు పార్టీ ఫిరాయించిన నాయకులతోనే బిఆర్‌ఎస్ మనుగడ సాగించిందని, తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఏకంగా మంత్రివర్గంలో తీసుకోవడమే ఇందుకు నిదర్శనమనే విమర్శలు లేకపోలేదు.ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎల పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. చట్టవిరుద్ధంగా, అనైతికంగా తమ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్ చేర్చుకుం టున్నారని బిఆర్‌ఎస్ ఆరోపిస్తుండగా, గత ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఎన్నికైన ఎంఎల్‌ఎలను బిఆర్‌ఎస్‌లో చేర్చుకుని ఫిరాయింపులనునేర్పిందే బిఆర్‌ఎస్ అని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 2018లో బిఆర్‌ఎస్ నుంచి 80 మందికి పైగా ఎంఎల్‌ఎలు గెలిచినప్పటికీ ఇంకా ఇతర పార్టీల ఎంఎల్‌ఎలను బిఆర్‌ఎస్‌లో చేర్చుకోవడాన్ని చూసి ప్రజలు ముక్కన వేలు వేసుకున్నారు. ఇబ్బడిముబ్బడిగా ప్రజా ప్రతినిధులను చేర్చుకుని ప్రతిపక్షమే లేకుండా చేసిన ఘనత కూడా బిఆర్‌ఎస్‌కే దక్కుతుందనిరాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**కొంపముంచిన బిఆర్‌ఎస్ వ్యాఖ్యలు :** 2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలుత పార్టీ ఫిరాయింపులపైన దృష్టి పెట్టలేదు. తమకు 64 స్థానాలు వచ్చాయని, ఇతర పార్టీలక చెందిన వారు తమకు అవసరం లేదని ముందుగా కాంగ్రెస్ నేతలు తెలిపారు. అయితే త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని, కాంగ్రెస్‌లో సిఎం పదవి చిచ్చు రేగుతోందని బిఆర్ ఎస్ నేతలు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బిజెపి నేతలు కూడా త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బాహటంగానే వ్యాఖ్యాలు చేశారు. కొందరు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు తమతో టచ్‌లో ఉన్నారని బిఆర్‌ఎస్ నేతలు వ్యాఖ్యానించారు.దీనిపైన కాంగ్రెస్ నేతలు కూడా ధీటుగా సమాధానమిచ్చారు. తమ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తే ఊరుకునేది లేదని సాక్షాత్తూ సిఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా ప్రభుత్వం పడిపోతుందనే వ్యాఖ్యలు ఆగలేదు. అయితే ఆ వ్యాఖ్యాల తర్వాతనే పార్టీ ఫిరాయింపులకు మొదలయ్యాయని పలువురు రాజకీయ నాయకులు చెబుతున్నారు.ఫిరాయింపులతో కాంగ్రెస్‌నుంచి 12మందిని చేర్చుకుని అసెంబ్లీలో దళిత ఎంఎల్‌ఎ అయిన మల్లు భట్టివిక్రమార్కకు, కాంగ్రెస్ ఎంఎల్‌సిలను చేర్చుకుని శాసనమండలిలో ఎంఎల్‌సి, మైనార్టీకి చెందిన షబ్బీర్ అలీకి ప్రతిపక్ష నేత హోదాను దక్కకుండా చేశారని కాంగ్రెస్ విమర్శిస్తున్నది.కాంగ్రెస్, టిడిపి ఎంఎల్‌లు బిఆర్‌ఎస్‌లోకి పార్టీ ఫిరాయించినప్పుడు వారి నియోజకవర్గాలు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసమే వారు చేరారని చెప్పిన బిఆర్‌ఎస్, ఇప్పుడు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరతున్నప్పుడు వారు కూడా అభివృద్ధి కోసమే చేరుతున్నారని ఎం దుకు భావించకూడదని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

## రాష్ట్రానికి విదేశీ మీడియా ప్రతినిధులు

4 రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన వివిధ దేశాల మీడియా ప్రతినిధులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెస్తున్న పర్యాటక, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలను సందర్శించటానికి 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. వారికి రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ప్రోటోకాల్ విభాగం అధికారులు స్వాగతంపలికారు.ఈస్ట్ ఆసియా, యూరే సియా,మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్క్మెనిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, మంగోలియా, కజకిస్థాన్ దేశాలకు చెందిన ప్రముఖ మీడియా ప్రతినిధులు 4 రోజుల పర్యటనకు వచ్చారు. పర్యటనలో భాగం గా గోల్కొండ కోట, శిల్పారామం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, స్కై రూట్ ఎయిరో స్పేస్ సెంటర్, టి హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ , రామోజీ ఫిల్మ్ సిటీలను ఈ మీడియా బృందం సందర్శనుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీ డిప్లొమసి డివిజన్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

## ఆహార ఉత్పత్తుల పేరుతో తప్పుడు మందుల విక్రయాలు

పలు చోట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు

పలువురిపై కేసులు నమోదు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆహార ఉత్పత్తులు, న్యూట్రాస్యూటికల్ పేరుతో అనుమతులు లేకుండా అమ్మకాలు , నిర్ణత ధరలకు కాకుండ అధిక ధరలకు మందు లు అమ్మకాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు డ్రగ్ కంట్రోలు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల నుంచి వరుసగా దాడులు నిర్వహిస్తు పలువురిపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రాలో మూపిపాన్ అనే అయింట్మెంట్, కామారెడ్డిలో జాండి క్యాప్సూల్ 200 గ్రా.ను, నిబంధలనుకు వ్యతిరేకంగాఅమ్మకాలు జరుపుతున్నట్లు డ్రగ్ కంట్రోల్‌అధికారులుగుర్తించారు.మరికొన్ని మందులను తప్పుడు ప్రకటనలు చేసి అమ్మకాలు జరుపుతున్న మందు లను కూడ డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు సుప్రాల్ పిల్లల అల్లోపతి ఔషదాం జ్వరానికి ప ని చేస్తుందాని తప్పుడు ప్రచారంతో అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ఇదే తీరులో శ్రీతులసి డ్రాప్స్ జ్వరానికి పని చేస్తుందని తప్పుడు ప్రచారంతో అమ్మకాలు సాగిస్తునట్లు, తులసి జింజర్ డ్రాప్స్ న్యూమోనియాకు పని చేస్తుందని తప్పుడు ప్రచారం చేసిఅమ్మకాలు సాగి స్తూ ఉండడంపై డ్రగ్ కంట్రోల చర్యలు చేపట్టింది. వీరందరిపై కేసులు నమోదు చేశారు. పలు షాప్‌లను సీజ్ చేశారు. వనపర్తి, గోపాల్పేట్ మండలం తాడిపర్తిలో ఒక క్లినిక్‌పై దాడులు నిర్వహించి అమ్మకానికి నిల్వ చేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. 52 రకాల మం దలను అనుమతులు లేకుండా నిల్వచేయడం పై కేసు నమోదు చేశారు. రూ.లక్షల మేరకు మందులను సీజ్ చేశారు. క్లినిక్‌ను సైతం సీజ్ చేశారు. సిద్దిపేట మండలంలో కాగ్రిప్ ట్యాబ్లె ట్స్ గుర్తించారు. ఈ టాబ్లెట్ల ను ఫుడ్ లైసన్స్ కిం ద తప్పుడుగా అమ్మకాలు జరుపుతున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించి అనురాధ న్యూ టిక్ ప్రైవేట్ లిమిటెపై దాడి చేశారు. కంపెనీ ప్లాట్ నెంబరు 6బి పాలెం లక్ష్మారెడ్డి డ్రగ్ లైసన్స్ కిందబుక్‌చేయకుండ అమ్మకాలు సాగిస్తు ఉండడంపై చర్యలు చేపట్టారు. ఈ దాడులు నిర్వహించిన వారిలో శేరిలింగంపల్లి డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎ.శైలజా, శామీర్ పేట్ డ్రగ్ ఇన్స్పెక్టర్ బి. ప్రవీ ణ్, మెహదీపట్నం డ్రగ్ ఇన్స్పెక్టర్ పి. సంతోష్ ఉన్నారు.

**నిబంధనలు అతిక్రమిస్తె చర్యలు: విబి కమలాసన్‌రెడ్డి**

తెలంగాణ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధ నాల మేరకు అమ్మకాలు జరపకుంటే చర్యలు తీసుకుంటామని, లైసన్స్ లేకుండా మందాల నిల్వలు చేసిన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ డిజి విబి కమలాసన్ రెడ్డి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా డ్రగ్స నిల్వలు, అమ్మకాలు చేపట్టడం నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ కు 18005996969 సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## జులై 5లోగా జాతర పనులు పూర్తి

పనులు పూర్తిచేయని అధికారులపై క్రమశిక్షణా చర్యలుంటాయి

ఆషాడ బోనాల జాతర ఏర్పాట్ల పై అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: బోనాల పండుగ సందర్భంగా అమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఆషాడ బోనాల జాతర నిర్వహణ ఏర్పాట్ల పై బేగంపేట హరిత ప్లాజాలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. జూలై 5వ తేదీ లోపు జాతర పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.బోనాల పండుగ నిర్వహణలో జిహెచ్‌ఎంసిది కీలక పాత్ర అని మంత్రి సురేఖ అన్నారు. శానిటేషన్, ఫాగింగ్, పార్కింగ్ స్థలాలు, రోడ్ల నిర్వహణ, మహిళలకు ప్రత్యేక టాయిలెట్ల ఏర్పాటు వంటి ఎన్నో కార్యక్రమాలను జిహెచ్‌ఎంసి ప్రణాళికాబద్ధంగా సమన్వయం చేసుకుంటు సాగాల్సి ఉందని అన్నారు. భక్తులు వరుసక్రమంలో దైవ దర్శనం చేసుకునేలా, వరుసలను అతిక్రమించకుండా తగిన ఎత్తులో బారికేడ్లను ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశనం చేశారు. పోలీస్ శాఖ బాంబు స్క్వాడ్ లతో నిరంతరం చెకింగ్‌లు చేస్తూ, మఫ్టీ పోలీసులతో నిరంతర నిఘాను చేపడుతూ, లా అండ్ ఆర్డర్ ను పకడ్బందీగా అమలుచేయాలని ఆదేశించారు. విద్యుత్తు సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య శాఖ అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ నిచ్చేలా దేవాలయవాల వద్ద సేవలందిస్తున్న ఇతర శాఖల సిబ్బందికి శిక్షణనివ్వాలని మంత్రి సూచించారు. వృద్ధులు, వికలాంగులకు దైవదర్శనం కల్పించేందుకు బ్యాటరీ వాహనాలను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాలు, బస్ స్టాప్ లలో పాలిచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా లాక్టేషన్ గదులను తప్పక ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణాల నుంచి వచ్చిన వారు సకల ఏర్పాట్లు చేయాలని చిన్న పిల్లలు అలసిపోకుండా వారికి బాలామృతం వంటి పోషకాహారన్ని అందిచేందుకుగాను అంగన్వాడీ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. వాలంటీర్లను భక్తులు సులభంగా గుర్తు పట్టేందుకు వీలుగా వారికి డ్రెస్ కోడ్ ను కేటాయించాలని అన్నారు.

**'తగ్గేదే లే' అన్న మంత్రి సురేఖ :** దేశరాజధాని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లోనూ, అమెరికా, కెనడా, యుకె, ఆస్ట్రేలియాల్లో జరుగుతున్న బోనాల జాతర ఉత్సవాల గురించి మంత్రి సురేఖ అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. తనతో పాటు మహిళా అధికారులు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొనే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్రీ బస్సు సౌకర్యాన్ని ప్రస్తావిస్తూ ఫ్రీ బస్సు పథకంతో మగాళ్ళకు బస్సుల్లో సీట్లే దొరకటం లేదు, ఇక విమానాలను కూడా విడిచిపెట్టరా అని నవ్వుతూ ప్రశ్నించారు. దీంతో మంత్రి సురేఖ తగ్గేదే లే అనడంతో సమావేశంలో నవ్వులు విరబూశాయి. ఈ సమావేశంలో హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి, డిజిపి రవి గుప్తా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత రావు, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ లు రామకృష్ణారావు, పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్తగూడెంలో డిప్యూటీ సిఎం భట్టి పర్యటన

* భట్టితో కలిసి పర్యటించనున్న మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నేడు గురువారం కొత్తగూడెంలో పర్యటిస్తున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తు మ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంఖుస్థాపన చేస్తారు. వర్షకాలం నేపత్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా గోదావరి వరదలపై కలెక్టరేట్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి డిప్యూటి సిఎం సమీక్షిస్తారు. ఆ తరువాత సహచర మంత్రులతో కలిసి మణుగూరు బయలుదేరి వెళ్లి మాతృవియోగం పొందిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను పరామర్శిస్తారు. అదే విధంగా ఇటీవల స్వర్గస్థులైన పద్మశ్రీ ఆవార్డు గ్రహిత సకిన రాంచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సం తాపం సానుభూతి తెలియజేస్తారు.

**భట్టి విక్రమార్క పర్యటన వివరాలు ఇవీ..**

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి నేడు గురువారం ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి కొత్తగూడెంకు ఉదయం 9.30గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు కొత్తగూడెంలోని ప్రగతిమైదాన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా ఎస్ఐటిడిఏపిఒ, ఇతర అధికారులు స్వాగతం పలుకుతారు.విద్యానగర్ డిస్టిక్ మినరల్ ఫండ్స్ రూ.4 కోట్లతో నిర్మించే సైడ్ పనులకు శంకుస్తాపన చేసి న అనంతరం పోస్టు ఆఫీసు సమీపంలో అమృత్ 2.0 నిధులు రూ.124 కోట్లతో కొత్తగూ డెం ము న్సిపాలిటీకి శాశ్వత మంచినీటి సరఫరా పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడుతారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పి.వెంకటేశ్వర్లు నివాసానికి చేరుకుంటారు.మాతృవియోగం పొందిన ఎమ్మెల్యే వెంకటేశ్వర్లును పరామర్శించిన అనంతరం, మణుగూరు నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్తారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల పర్యటన నేపథ్యం లో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తోన్నారు.

## 'అగ్నిపథ్' నిప్పులబాట పథకం

కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి : ఏఐవైఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత రక్షణ రంగాన్ని ప్రైవేటు పరం చేసే 'అగ్నిపథ్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నుండి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. అగ్నిపథ్' ను వ్యతిరేకిస్తూ ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం నిప్పులబాట పథకమని విమర్శించారు. స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు గడచినా ఆర్మీ అభ్యర్థుల పట్ల పాలకులు కనబరుస్తున్న తీరు బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సైనికుల పట్ల నిర్లక్ష్యం కనబర్చడం సరికాదన్నారు. సైనికులకు దీర్ఘకాలిక ఉపాధి కల్పించడం వల్ల వారు దేశానికి అంకిత భావంతో పని చేసే బాధ్యతను ఎంచుకుంటారని పేర్కొన్నారు. కానీ మోడీ విధానాలు సైనికుల త్యాగనిరతిని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఆర్మీలో పెన్షన్ల భారం అంటూనే కాషాయ మత చాందస విధానాలకు అనుసరించే కుటిల ప్రయత్నాలలో భాగమే ఈ అగ్నిపథ్ నియామక ప్రక్రియ అని వారు అన్నారు. అగ్నిపథ్ సైనికులకు నాలుగేళ్ల సర్వీస్ తర్వాత తమ పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామని బడా సంపన్నులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇంత కాలం ఎంతమంది సైనికులకు ఉపాధి అవకాశాలు కల్పించారో వారు వెల్లడించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2019లో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22 శాతానికి తగ్గించారని, ఈ తగ్గింపు వల్ల దేశానికి రూ.10 వేల కోట్లు, కార్పొరేట్ పన్ను తగ్గింపుతో దేశానికి లక్ష కోట్ల రూపాయల రెవన్యూ లోటు ఏర్పడిందని అన్నారు. ఇదంతా పారిశ్రామిక వేత్తలకు, ధనికులకు లాభాలు గత మూడేలల్లో 57 శాతం పెరిగిందన్నారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని, యువతకు ఉపాధి అవకాశాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలని వారు డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్ అలీ ఖాన్, అనీల్ కుమార్, బాలు, మహేష్, మురళి, కిరణ్, చెట్టుకింద శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రతిపక్షనాయకుడు కావడం శుభ పరిణామం : నిరంజన్




ప్రజాపక్షం/హైదరాబాద్ : గతంలో ఎప్పుడో విధించిన ఎమర్జెన్సీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ లో వ్యాఖ్యానించడం సరికాదని సీనియర్ కాంగ్రెస్ నాయ కులు నిరంజన్ అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుడు ఎవరో చేసిన చిన్న తప్పుకు బహిరంగ సభలో అప్పటీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ బహిరంగ క్షమాపణ చెప్పారని, అదే ఆమె గొప్పతనమన్నారు. అదే నోట్లను రద్దు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ నిర్ణయం తప్పని ఇప్పటీ వరకు ఒప్పులేదని గుర్తు చేశారు. లోకసభకు రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడు కావడం శుభ పరిణామమని, ఆయన తన పదవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. ప్రధాని ,బిజెపి నాయకులు రాహుల్ గాంధీని ఎన్ని అవమానాలకు గురి చేసినా, యువరాజు అని సంబోధించినా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రామ మందిరం పూర్తి కాకుండా నే ఆలయం ప్రారంభం చేశారని దీనిపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నిరంజన్ డిమాండ్ చేశారు. ఇప్పటీకైనా దేశ భవిషత్తు ను దృషిలో పెట్టుకుని ప్రధాన మంత్రి తన పాలనను కొనసాగించాలని లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆయనను నామ రూపం లేకుండా చేస్తారని హెచ్చరించారు.

## పోచారం, సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పార్టీ ఫిరాయించిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్‌పైన అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,శాసన సభ కార్యదర్శికి మాజీ మంత్రి జగ దీష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మేరకు స్పీడ్ పోస్ట్, ఈ మెయిల్ ద్వారా స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్టు జగదీష్ రెడ్డి తెలిపారు. స్పీకర్ తగిన చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా ముందుకు వెళ్లుతామని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
CTN No.2/2024-25, ఇ-ప్రొక్యూరమెంట్ నోటీసు తేది: 24.06.2024
పని పేరు: నిర్మల్ జిల్లాలో భైంసా మున్సిపాలిటీలో వార్డు నెం. 4 & 5లో సైడ్ డ్రెయిన్ నిర్మాణం. సుమారు అంచనా విలువ: రూ.40.00 లక్షలు, టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లు 25.06.2024 తేదీ నుండి www.eprocurement.gov.in నుండు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ మరియు సమయం: 01.07.2024న మ.3.30గం.ల వరకు, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం నుండి చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), డివిజన్, నిర్మల్.
DIPR R.O. No. : 181-DP/CL/ADVT/1/2024-25 Date: 26-06-2024

ప్రజాపక్షం
గురువారం, జూన్ 27

# అసాంజె ఇక స్వేచ్ఛాజీవి

14 సంవత్సరాలకు పైగా స్వేచ్ఛకు దూరంచేయబడిన, వేధింపులకు, నిర్బంధాలకు గురిచేయబడిన విజిల్ బ్లోయర్, వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజెకు ఎట్టకేలకు స్వేచ్ఛ లభించింది. అమెరికన్ అధికారులతో కుదిరిన రాజీ ఒప్పందం ప్రకారం ఈ సమస్య పరిష్కారమైంది. అమెరికన్ సైనిక, దౌత్య రహస్యాలను బహిర్గతం చేసినందుకు, ఆయన బ్రిటన్‌లో అనుభవించిన జైలు జీవితం 62 మాసాలకాలాన్ని ఆయనకు శిక్షగా విధించింది నార్తర్న్ మరియానా దీవుల్లో కోర్టు. ఆస్ట్రేలియన్ జాతీయుడైన అసాంజె ఆస్ట్రేలియా, జపాన్‌కు మధ్యలో పసిఫిక్ సముద్రం మధ్యలో, అమెరికన్నా ఆస్ట్రేలియాకు కొంత సమీపంలో ఉన్న ఆ దీవి కోర్టును ఎంచుకున్నారు. ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం 52 ఏళ్ల అసాంజె నేరాన్ని అంగీకరించారు. కోర్టు శిక్షవిధించింది. అసాంజెకు స్వేచ్ఛ లభించింది. స్వదేశం వెళ్లిపోయారు. అమెరికా శిక్ష విధించినట్లయింది, అసాంజెకు స్వేచ్ఛ లభించినట్లయింది. అయితే స్వేచ్ఛా ప్రపంచం అని గొప్పలు చెప్పుకునే ఐరోపా, దేశాలకు, అమెరికాకు ఇది మచ్చగా మిగిలిపోతుంది.

ఈ శతాబ్దం ప్రథమ దశాబ్దంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన వ్యక్తి జూలియన్ అసాంజె. ఆయన 2006లో ఆస్ట్రేలియాలో ఇంటర్నెట్ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి వికీలీక్స్ పేరుతో మహాసమాచార సామ్రాజ్యాన్ని నిర్మించిన మేధావి. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లపై అమెరికా యుద్ధాలకు సంబంధించి దాదాపు 5 లక్షల కమ్యూనికేషన్ పత్రాలను వికీలీక్స్ వెబ్‌సైట్ ద్వారా 2010లో విడుదల చేసి అమెరికన్ పాలకులకు వణకుపుట్టించారు. ఒక మహిళ చేత మానభంగం, మరో మహిళచే లైంగిక వేధింపు ఆరోపణలు చేయించి స్వీడన్ ప్రాసిక్యూటర్లు 2010 ఆగస్టులో అరెస్టు వారెంట్ జారీచేశారు. ఆ ఆరోపణలను ఆయన తిరస్కరించారు. తగిన సాక్ష్యాధారాలు లేక ప్రాసిక్యూటర్లు వారెంటు ఉపసంహరించుకున్నారు. సెప్టెంబర్‌లో మానభంగం కేసు తిరిగి తెరిచారు. అసాంజె స్వీడన్ వదిలి బ్రిటన్ వెళ్లిపోయారు. స్వీడన్ పోలీసులు నవంబర్‌లో అసాంజె కొరకు అంతర్జాతీయ అరెస్టు వారెంటు జారీ చేశారు. డిసెంబర్‌లో ఆయన బ్రిటిష్ పోలీసులకు లొంగిపోయారు. హైకోర్టు బెయిలు ఇచ్చింది. 2011 ఫిబ్రవరిలో బ్రిటన్‌లోని జిల్లా కోర్టు ఆయన్ను స్వీడన్‌కు అప్పగించాలని ఆదేశించింది. 2012 జూన్‌లో అసాంజె సెంట్రల్ లండన్‌లోని ఈక్వెడార్ ఎంబసీలో ప్రవేశించి ఆశ్రయం కోరారు. ఆగస్టులో ఈక్వెడార్ ఆయనకు రాజకీయ ఆశ్రయం మంజూరు చేసింది. తర్వాత బ్రిటన్ ఆయన్ను బెల్ మార్ష్ జైలులో నిర్బంధించింది. 2022 మార్చిలో బ్రిటన్ సుప్రీంకోర్టు స్వీడన్‌కు బలవంతపు తరలింపు ఉత్తర్వుకు వ్యతిరేకంగా ఆయన అప్పీలును తిరస్కరించింది. 2022 జూన్‌లో బ్రిటన్ ప్రభుత్వం అసాంజెను అమెరికా ప్రభుత్వానికి అప్పగించే ఉత్తర్వులు జారీచేసింది. ఆయన అప్పీలు చేసుకున్నారు. 2023 మే నెలలో ఆస్ట్రేలియా లేబర్ ప్రధానమంత్రి ఆంథొనీ అల్బనీస్ అసాంజె కేసు నిరుపయోగమని అమెరికాకు స్పష్టంచేసి ఆయన విడుదలను కోరారు. 2024 ఫిబ్రవరి 20న అసాంజె లాయర్‌లు అంతిమ లీగల్ పరిష్కార ప్రయత్నాలు ఆరంభించారు.

జర్నలిస్టు, ప్రచురణకర్త, విజిల్ బ్లోయర్ అయిన అసాంజెను పశ్చిమ ప్రజాస్వామ్య దేశాలు వేధించిన తీరు అసాధారణం. ఆయన విడుదల కోసం అనేక దేశాల్లోని స్వేచ్ఛా ప్రియులు పెద్ద పోరాటమే చేశారు. వికీలీక్స్ ప్రచురించిన అమెరికా రహస్య పత్రాలు, మెయిల్స్‌ను అమెరికా సైనిక విశ్లేషకురాలు చెల్సీ మ్యానింగ్ అసాంజెకు అందజేశారు. గూఢచారి చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆమెకు 35 సంవత్సరాలపాటు జైలు శిక్ష విధించబడింది. అధ్యక్షుడు బారక్ ఒబామా 2017లో ఆమె శిక్షను రద్దుచేసి స్వేచ్ఛ ప్రసాదించారు. కాని అసాంజె ఒంటరి సెల్‌లో జైలు జీవితం అనుభవించారు. ట్రంప్‌ప్రభుత్వం న్యాయశాఖ 2019లో 18 ఆరోపణలను ఆయనపై ఖరారు చేసింది. జో బైడెన్ ప్రభుత్వం అతన్ని అమెరికా కోర్టు ముందుకు రప్పించేందుకు తీవ్రప్రయత్నాలు చేసింది. చివరకు ఆస్ట్రేలియా ప్రధాని జోక్యం ఆయనకు స్వేచ్ఛ ప్రసాదించింది. అమెరికా ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లపై అన్యాయంగా, దుర్మార్గంగా యుద్ధాలకు ఒడిగట్టింది. ఆ సమయంలో అమెరికా ప్రభుత్వం— రాయబారులు, ఫీల్డ్ కమాండర్ల మధ్య జరిగిన రహస్య మెయిల్స్ గుట్టువిప్పిన విజిల్ బ్లోయర్ అసాంజె 14 ఏళ్లకుపైగా యమ యాతన అనుభవించారు. కాని అక్రమ యుద్ధాలకు ఒడిగట్టి దేశాలకు దేశాలను ధ్వంసం చేసిన అమెరికన్ పాలకులకు శిక్షలేదు!

# సామాజిక స్పృహ-శాస్త్రీయ దృక్పథం అంటే.. ఉంటే!



డా. మార్క శంకర్ నారాయణ
రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్
9908416664

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బైఐదు ఏళ్ళు గడిచినా ఇంకా ఈ దేశం కుల తత్వం, మతతత్వం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న ఈ వేళ, అధికారులు, పాలకులు అవినీతి కూపంలో పీకల లోతుదాకా ఇరుక్కొని దేశాన్ని అధోగతి పట్టిస్తున్న ఈ సమయంలో, స్వాతంత్రోద్యమంలో పైసెత్తు పాత్రలేని మనువాద ఫాసిస్ట్ పాలకుల చేతుల్లో దేశభక్తినామ కీర్తనలో దేశమే అంగడి సరుకుగా మారుతున్నఈవేళ, మూఢనమ్మకాలతో, అశాస్త్రీయ భావాలతో దేశం ఆగమవుతున్న ఈ వేళ, సమాజంలో చదువుకున్న వాళ్లలో సైతం సామాజిక స్పృహ శాస్త్రీయ దృక్పథం కరువవుతున్న ఈ వేళ సామాజిక స్పృహ అంటే ఏమిటి? సామాజిక స్పృహ లేకపోతే ఏమవుతుంది? సామాజిక స్పృహకు అడ్డుపడే శక్తులు ఏమిటి? మొదలైన విషయాలు ఒక తాత్విక నేపథ్యంలో చర్చించుకోవాల్సినఅవసరం ఎంతైనా ఉంది.

'కలిసిమెలిసి జీవిస్తూ పరస్పరం ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఒక ప్రదేశంలో ఉన్న ప్రజల సమూహమే సమాజము'. సామాజిక స్పృహ అంటే సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే సోయి.సమాజం మారాలనే తండ్లాట. సామాజిక స్పృహ అంటే గతం కంటే వేయి రేట్లు మెరుగైన స్థితిలో ఉండాలని కోరుకోవడం. సామాజిక స్పృహ అంటే సమాజం పురోగమన దిశలో ఉండాలని కోరుకోవడం. సామాజిక స్పృహ అన్ని అంశాల్లో ఉండాలి. అది రాజకీయ, ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక అంశాల్లో ఉండాలి.సమాజంలో ఉన్నతమైన, ఉత్కృష్టమైన సామాజిక స్పృహ ఉన్నవాళ్లే సమాజాన్ని మార్చారు, చరిత్రలో నిలిచారు.

గొప్పనైన సామాజిక స్పృహతో చరిత్రలో నిలిచిన వారు ఏమన్నారో ఒక్కసారి చూద్దాం.

చిరునవ్వుతో ఉరికంబమెక్కిన విప్లవ వీరుడు కామ్రేడ్ భగత్ సింగ్ :'వాళ్ళు నన్ను చంపుతారేమో కానీ నా ఆలోచనలను చంపలేరు. వాళ్ళు నా శరీరాన్ని నుజ్జునుజ్జు చేయగలరేమో కానీ నా చైతన్యాన్ని నుజ్జునుజ్జు చేయలేరు. 'అంతే కాదు తను రచించిన' నేనెందుకు నాస్తికుడినయ్యాను' అనే గ్రంథంలో దేవుడు మతము అనేవి పాలక వర్గాల, దోపిడీ వర్గాల ప్రయోజనం కోసమేనని అంటాడు. అదేవిధంగా మహాత్మా జ్యోతిబా పూలె 'విద్యలేకపోవడం వల్లనే జ్ఞానం అందకుండా పోయింది.సంపద లేనందువల్లనే శూద్రులు నాశనం అయ్యారు' అని అంటారు. మహిళల అక్షర జ్ఞానం కోసం ఎంతగానే పోరుసలిపిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలె బాలికల కోసం నడిపిన ఒక పాఠశాల గోడ పైన రాసిన వాక్యం ఎంత గొప్పగా మనల్ని ఆలోచించేటట్లు ఉందొ చూడండి 'వేదాలను చదవడానికి హక్కులేని మాకు వేదంప్రకారమే నడుచుకోవాలనేది మాకు అనవసరమని' అన్నారు. ప్రపంచ మేధావుల్లో ఒకరుగా నిలిచిన భారత రాజ్యాంగ రచయిత డా. బి. ఆర్. అంబేడ్కర్ 'కులం మతం పునాదుల మీద ఒక జాతిని గాని ఒక నీతినిగాని నిర్మించలేమని' అన్నారు. విద్య అంటే ఏమిటో చాలా గొప్పనైన నిర్వచనము ఇచ్చిన మహనీయుడు డా. బి. ఆర్. అంబేడ్కర్ ఏమంటాడంటే ఏదైతే వ్యక్తిని భయం లేకుండా చేస్తుందో, ఏదైతే ఐక్యతా పాఠాన్ని బోధిస్తుందో, ఏదైతే అతని హక్కులేంటో తెలుసుకునేటట్లు చేస్తుందో, ఏదైతే అతని హక్కుల కోసం పోరాడటానికి అతనిని ప్రేరిపిస్తుందో అదే విద్య'ని అన్నారు. అత్యున్నతమైన సామాజిక స్పృహతోనే సమాజంలో శ్రమ దోపిడీ జరుగుతున్నదనే సత్యాన్ని మొట్టమొదటిసారిగా వెలికితీసి తన 'పెట్టుబడి' గ్రంథం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పి దానికి పరిష్కారాన్ని చూపిన మార్క్సిజం సిద్ధాంత కర్త మహనీయుడు కార్ల్ మార్క్స్ మతం గురించి మాట్లాడుతూ 'హృదయం లేని ప్రపంచ హృదయమే మతమని, భ్రమల్లో మునిగే ప్రజల ఆనందమే మతమని, మతం మత్తుమందని'మ అన్నారు. నిజానికి ప్రపంచంలో ఎక్కడా లేనట్టి దుర్మార్గమైన కులవ్యవస్థ భారతదేశంలోనే ఉంది. 1859లో 'అర్థ శాస్త్రంపై విమర్శ' అన్న ఒక వ్యాసంలో సమాజంలో అతికొద్ది మందికి భూయాజమాన్య హక్కులను కల్పిస్తే అత్యధికమందికి వారసత్వంగా శ్రమజేసి బతకాలనే శాసనం చేయబడిందని అన్నారు. కులవ్యవస్థ శ్రమ విభజనకు దారితీసిందని అంటారు. అంటే వర్గమే కులంగా మారిపోయింది. కులవ్యవస్థ కేవలం శ్రమ విభజనే కాదు అది శ్రామికుల విభజన కూడా అని అంబేడ్కర్ అన్నారు. దీన్నిబట్టి వర్గ –కుల లేబుళ్లతో మార్క్స్ అంబేడ్కర్‌లను ఎంతమాత్రమూ విడదీయలేమనే విషయం సుస్పష్టం. సామాజిక స్పృహతోనే కదా కామ్రేడ్ బర్దన్ 'కమ్యూనిజం' మాసపత్రికలో 'సామాజిక ప్రగతిని, అభివృద్ధిని కుంటుపరిచే విచ్ఛిన్నకరశక్తులలో కులతత్వం ఒకపెద్ద శక్తి అని, అది సమాజ అభివృద్ధికి గొడ్డలిపెట్టని 'అన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతగానే ఉపయోగపడుతున్న శక్తికి నిత్యత్వ నియమాన్నిచ్చిన నోబెల్ బహుమతి గ్రహీత సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త, ఆధునిక భౌతికశాస్త్రానికి పితామహుడైన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సామాజిక స్పృహతోనే కదా దేవుడు అనే పదం మానవుని బలహీనతల్లోంచి పుట్టుకొచ్చిందనిఅన్నారు. 'అంతేకాదు యుద్ధం ఎంతో ఖరీదైనది, శాంతి అమూల్యమైనది, యుద్ధం విధ్వంసాన్నిస్తే శాంతి ప్రేమనిస్తుంది, యుద్ధం ప్రజలను చంపితే శాంతి ప్రజలను రక్షిస్తుంది, యుద్ధం వద్దు శాంతి ముద్దు మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు, కానీ నాల్గవ ప్రపంచ యుద్ధం కర్రలు, రాళ్లతో జరుగుతుందని అన్నారు. ఏ మాత్రమూ కదలలేని, నడవలేని, నొసటి కదలికలతో కంటి చూపులతోనే మాట్లాడే సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త, కాస్మాలజిస్టు స్టీఫెన్ హాకింగ్ సామాజిక స్పృహతోనే కదా అంతా నొసటి రాత ప్రకారమే జరుగుతుందనే వాళ్ళుసైతం రోడ్‌ను అటు ఇటు చూసిన తర్వాతనే దాటుతారు. దేవుడు లేడు. మరణం తర్వాత జీవితం లేదు. స్వర్గ, నరకాలు బూటకం, చావంటే భయపడే వాళ్ళు సృష్టించుకున్న కట్టు కథలని అన్నారు.

సామాజిక స్పృహతోనే కదా మహా కవి శ్రీ శ్రీ మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందు కుపదండి తోసుకుపోదాంపై పైకి, కదం తొక్కుతు పదం పాడుతు, ఎముకలు కుళ్ళిన వయసు మళ్ళిన సోమరులారా చావండి, నెత్తురు మండే శక్తులు నిండే, సైనికులార రారండి అంటూ తన కవిత ద్వారా పిలుపునిచ్చాడు. రచయిత అలిశెట్టి ప్రభాకర్ సామాజిక స్పృహతోనే కదా 'జనారణ్యం లో పెంచి పోషించబడే పెద్దపులి మతం. దానికి ఆకలేసినప్పుడల్లా నువ్వో నేనో ఖథమని అన్నారు. సాహిత్య అకాడెమి అవార్డు గ్రహీత, కన్నడ రచయిత దేవనూరు మహదేవ సామాజిక స్పృహతోనే కదా 'మతోన్మాదం మొదట తన వాళ్ళ కళ్ళను పీకి దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా అంధులను చేస్తుంది, తర్వాత మెదడును పీకి అవివేకులను తయారు చేస్తుంది. ఆ తర్వాత హృదయాన్ని పీకి క్రూరులుగా తయారు చేస్తుంది. తర్వాత అది నరబలిని కోరుకుంటుందని అన్నారు. 'ప్రజాకవి కాళోజి సామాజిక స్పృహతోనే కదా ఆకలి మంటలు ఒక చోట అన్నపు రాసులు ఒక చోట అంతే కాదు 'దేవుళ్ళు లేరు దేవతలు లేరు రాక్షసులు లేరు ఉన్నది కేవలం మానవుడే వాడే అంతాను' అని అన్నారు.

1964 లో ఏర్పరిచిన సెకండరీ విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ దౌలత్ సింగ్ కొఠారి సామాజిక స్పృహతోనే కదా 'భారతదేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుచున్నది. అసమానతలతో నిండి ఉన్న భారత సమాజం పురోగమించాలంటే కామన్ స్కూల్ ఒక్కటే సరైన పరిష్కారమని అన్నారు. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమ కారుడు నెల్సన్ మండేలా సామాజిక స్పృహతోనే కదా 'ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అని అన్నాడు. అంతే కాదు భాష గురించి నెల్సన్ మండేలా మాట్లాడుతూ 'అతనికి తెలిసిన భాషలోనే మాట్లాడితే అది అతని తలను మాత్రమే తాకుతుంది. అతని భాషలోనే మాట్లాడితే అది అతని హృదయాన్ని తాకుతుందని' అంటాడు. అందుకే మాతృభాషకు మించిన భాషలేదు.

అన్నం ఉడికిందా లేదా అమ్మ ఒక మెతుకు పిసికి చెప్పినట్లు భారత దేశ భవిష్యత్తు ఎలా ఉండాలో గొప్పనైన సామాజిక స్పృహతో రాయబడ్డ భారత రాజ్యాంగ పీఠికను చూసినప్పుడు బుద్ధుని హృదయమే కనపడుతుంది. అందులో స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము, సాంఘీక న్యాయము అనే గొప్పనైన చతుర్ సూత్రాలు కనపడుతాయి. అంతే కాదు, గొప్పనైన ఐదు లక్ష్యాలు –సర్వసత్తాక, లౌకికవాద, సామ్యవాద, ప్రజాస్వామ్య, గణతంత్ర లక్ష్యాలు కనపడుతాయి. సామాజిక స్పృహతో విద్యను చూసినప్పుడు విద్య అనేది ఒక వస్తువు కాదు, అది మానవున్ని ఉన్నతంగా తీర్చి దిద్దే భావజాల ప్రక్రియగా కనపడుతుంది.సామాజిక స్పృహ ఉన్న నిజమైన పాలకుడు విద్యను గాని వైద్యాన్నిగాని ప్రయివేట్ పరంచేయాలని కోరుకోడు.

అనేక మంది గొప్పగొప్ప వాళ్ళ సామాజిక స్పృహతో దుర్మార్గపు మతోన్మాద టెర్రరిజం అంటే ఏమిటో చూసినప్పుడు మతోన్మాద టెర్రరిజం ఆఫ్ఘనిస్తాన్లోనే కాదు, పాకిస్తాన్లోనే కాదు, ఇరాన్లోనే కాదు సూడాన్లోనే కాదు, మారిటోనియాలోనే కాదు, ఇక్కడా ఉంది.

> నాణానికి బొమ్మ ఉంటుంది. బొరుసు ఉంటుంది. బొమ్మ చెరిగిపోయినా, బొరుసు చెరిగిపోయినా ఆ నాణెం చెల్లదు. సామాజిక వాస్తవికతను విశ్లేషించడానికి సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథం బొమ్మ బొరుసు లాంటివే. అందులో ఏ ఒక్కటి లోపించినా సమాజంలో చైతన్యాన్ని తీసుకరాలేవు. ఎప్పుడైతే సామాజిక చైతన్యాన్ని తీసుకరాలేవో సామాజిక ఉద్యమాలను సమర్థవంతంగా నడుపలేవు. సత్యాన్వేషణకై అవలంబించే తార్కిక దృష్టే శాస్త్రీయ దృక్పథం. అందుకే భారత రాజ్యాంగంలో అధికరణం 51ఏ (ఎచ్) భారతీయ పౌరుడు విధిగా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, పరిశీలన స్ఫూర్తిని, సంస్కరణ శీలాన్ని పెంపొందించుకోవాలని చెప్పింది. అందువల్ల సామాజిక ఉద్యమాలు విజయవంతం కావాలంటే సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు సామాజిక స్పృహను-శాస్త్రీయ దృక్పథాన్ని నిరంతరం సమాజంలోకి తీసుకెళ్లవల్సిన అవసరం ఎంతో ఉంది.

## సామాజిక స్పృహ లేకపోతె ఏమవుతుంది?

సామాజికి స్పృహ లేకపోతె సమాజం తిరోగమన దిశలో ప్రయాణిస్తుంది. వేల ఏళ్ళ నాటి జీవన విధానం పునరావృతమవుతుంది.సామాజిక స్పృహ లేనివాళ్లు చరిత్రను వక్రీకరించగలరు. వక్రీకరించిన చరిత్రను సామాజిక మాధ్యమాల్లో క్షణ క్షణం ప్రచారం చేస్తూనే ఉంటారు. సామాజిక స్పృహ లేనివాళ్లు కులవ్యవస్థ పదికాలాలపాటు ఉండాలని కోరుకుంటారు. సామాజిక స్పృహ లేనివాళ్లు సకల రంగాలు చివరకు విద్య వైద్యం కూడా ప్రయివేట్ రంగంలోనే ఉండాలని కోరుకుంటారు. సామాజిక స్పృహ లేనివాళ్లు దేశ సంపదంతా ఒక్కరో ఇద్దరి చేతుల్లో ఉండాలని కోరుకుంటారు. సామాజిక స్పృహ లేనివాళ్లు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనేవి పాశ్చాత్య దేశాలకు సంబంధించినవని, పరాయిదేశాలకు సంబంధించినవని, అవి మన దేశానికి అసలేపనికి రావని పతాకస్థాయిలో ప్రచారం చేస్తూ నిరంతరం మతం ముచ్చట్లతో మతోన్మాదాన్ని సమర్థిస్తారు. చిత్రమైన విషయం ఏమిటంటే ఇతర దేశాలు కనుగొన్న శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలను వినియోగించుకోవడంలో వీళ్ళే ముందుంటారు. దేశం ప్రజాస్వామ్య రాజ్యాంగంగా కాకుండా మతరాజ్యాంగంగా ఉండాలని ప్రగాఢంగా కోరుకుంటారు. చారిత్రక సత్యమేమిటంటే మతరాజ్యాంగంగా ప్రకటించుకున్న దేశాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. దేశంలో సామాజిక స్పృహ దిన దినం కరువుతున్నది కనుకనే మనువాద ఫాసిస్ట్ పాలన కొనసాగుతున్నదనేది నిర్వివాదాంశం.

## సామాజిక స్పృహకు అడ్డుపడే శక్తులు ఎవరు?

ఛాందసవాదులు, మతతత్వపు వాదులు, మతోన్మాదులు, ఫాసిస్ట్ పాలకులు, పెట్టుబడిదారీ విధానాన్ని పెంచిపోషించే పాలకులు అంతా సామాజిక స్పృహకు అడ్డుపడుతూనే ఉంటారు. ఫలితంగా శవాలు గంగా నదిలో తేలినా, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా, పాలకులే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అగ్వసగ్వవకే ప్రయివేటుకు అమ్మినా, నిరుద్యోగం విలియతాండవం చేసినా, నిత్యావసరవస్తువుల ధరలు నింగిని తాకినా నాకెందుకులే అనే స్వభావంపెరుగుతుంది. సమాజంలో ప్రశ్నించాలని స్వభావం సన్నగిల్లుతుంది.

## ముగింపు:

నాణానికి బొమ్మ ఉంటుంది. బొరుసు ఉంటుంది. బొమ్మ చెరిగిపోయినా, బొరుసు చెరిగిపోయినా ఆ నాణెం చెల్లదు. సామాజిక వాస్తవికతను విశ్లేషించడానికి సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథం బొమ్మ బొరుసు లాంటివే. అందులో ఏ ఒక్కటి లోపించినా సమాజంలో చైతన్యాన్ని తీసుకరాలేవు. ఎప్పుడైతే సామాజిక చైతన్యాన్ని తీసుకరాలేవో సామాజిక ఉద్యమాలను సమర్థవంతంగా నడుపలేవు. సత్యాన్వేషణకై అవలంబించే తార్కిక దృష్టే శాస్త్రీయ దృక్పథం. అందుకే భారత రాజ్యాంగంలో అధికరణం 51ఏ (ఎచ్) భారతీయ పౌరుడు విధిగా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, పరిశీలన స్ఫూర్తిని, సంస్కరణ శీలాన్ని పెంపొందించుకోవాలని చెప్పింది. అందువల్ల సామాజిక ఉద్యమాలు విజయవంతం కావాలంటే సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు సామాజిక స్పృహనుశాస్త్రీయ దృక్పథాన్ని నిరంతరం సమాజంలోకి తీసుకెళ్లవల్సిన అవసరం ఎంతో ఉంది.

# హెలెన్ కెల్లర్ అద్వితీయ జీవితం ఆదర్శప్రాయం!

(27 జూన్ దివ్యాంగురాలు హెలెన్ కెల్లర్ జన్మదినం సందర్భంగా)



అమెరికాకు చెందిన హెలెన్ కెల్లర్ ప్రఖ్యాత రచయిత, అంగ వైకల్య హక్కుల పరిరక్షకురాలు, న్యాయవాది, రాజకీయ కార్యకర్త, పౌర హక్కుల పరిరక్షకురాలు, శ్రామికవర్గ పక్షపాతి, ఉపన్యాసకురాలుగా తనదైన బహుముఖీయ ప్రజ్ఞాశాలి. చిరుప్రాయంలోనే బ్రేయిన్ ఫివర్ కారణంగా కంటి చూపును కోల్పోయి, చెవిటితనం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా కొనసాగించారు. లక్ష్య సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని, తను చీకట్లో నిలిచి ప్రపంచానికి దీపస్తంభంగా మార్గనిర్ధేశనం చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అద్వితీయం, అనన్యసామాన్యం, అనుసరణీయం.

**బహుముఖ ప్రజ్ఞాశాలి:** 27 జూన్ 1880న అమెరికా అలబామాలో కేట్ ఆడమ్స్, కల్నల్ ఆర్థర్ కెల్లర్ దంపతులకు జన్మించిన హెలెన్ కెల్లర్ రెండవ ఏటనే కంటి చూపును, వినికిడిని కోల్పోయారు. తన 7వ ఏట గురువు అన్నే సుల్లివన్ సహాయంతో చదవడం, వ్రాయడం నేర్చుకోవడం ప్రారంభించారు. వినికిడి సమస్యల పట్ల కృషి చేస్తున్న గ్రాహం బెల్, టెలిఫోన్ అవిష్కర్తను కలిసి సూచనలు, సలహాలు పొందారు. 1894లో 'రైట్‌హుమాసన్', 'హోరేస్ మన్' బధిరుల పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. 1896లో 'కేంబ్రిడ్జ్ స్కూల్ ఫర్ లేడీస్'లో చేరి విద్యార్జన కొనసాగించారు. 1904లో తన 24వ ఏట హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పొందిన ప్రథమ చెవిటి, కంటి చూపు లేని మహిళగా రికార్డు సాధించారు. తన గురువు అన్నా సుల్లివన్‌ను 1905లో వివాహమాడిన హెలెన్ 1924–68 కాలంలో 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' వేదికగా అమెరికాతో పాటు 35 దేశాలు పర్యటించి అంధుల సమస్యల పట్ల బహుళ ప్రచారాలు నిర్వహించారు. ప్రముఖ అమెరికన్ రచయిత్రిగా 14 పుస్తకాలు, వందల కొద్ది ఉపన్యాసాలు, 500లకు పైగా వ్యాసాలు రచించిన హెలెన్ కెల్లర్ జంతుజాలం నుంచి మహాత్మాగాంధీ వరకు అనేక అంశాలను లోతుగా స్పృశించారు. దివ్యాంగుల పక్షపాతిగా కెల్లర్ జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమిస్తూనే కార్మిక హక్కులు, మహిళా వికాసం, ప్రపంచ శాంతి విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు.

# మూడు దశాబ్దాల భాష పండితుల, పిఇటిల స్వప్నం సాకారం

లేఖలు

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మండల పరిషత్ పాఠశాలలలో, ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న భాష పండితులకు, పిఇటిలకు దాదాపు 10వేల వరకు పదోన్నతులు లభించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ ఇంత సంఖ్యలో పెద్ద ఎత్తున పదోన్నతులు లభించడం ఇదే మొదటిసారి అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తెలంగాణ రాష్ట్రంలోని భాష పండితులు, పిఇటిలు ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడీకి, వెట్టిచాకిరికి గురయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు భాష పండితులకు, పిఇటిలకు పదోన్నతులు కల్పించడానికి అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు సిద్ధం చేసుకున్న తర్వాత ప్రమాదవశాత్తు విమానం గల్లంతు కావడం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించడం భాష పండితుల పాలిట పెద్ద లోటుగా మారింది. తర్వాత ముఖ్యమంత్రులు, విద్యా శాఖ మంత్రులు, సంబంధిత అధికారులు భాష పండితుల, పిఇటిల పోస్టులను అప్ గ్రేడ్ చేయడానికి జి.ఒలు 2,3,11,12,110 తెచ్చిన ప్రతిసారి ఎస్జీటీ ఉపాధ్యాయ మిత్రులు తెలంగాణ ఉన్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించడంతో 'స్టే' తేవడం భాష పండితుల, పిఇటిల సమస్య అటుకు ఎక్కడం జరిగేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాష పండితులు తమ కవితల ద్వారా, పాటల ద్వారా, వ్యాసాల ద్వారా, ఉపన్యసాల ద్వారా వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలను జాగృతం చేసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఈ వ్యాస రచయిత డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ మరికొంత మంది వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలంగాణ టీచర్స్ ఫోరం (టిటిఎఫ్ ) ప్రారంభించి ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యేలా ఎంతో ప్రయత్నం చేశారు.

జూన్ 2,2014 నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం భాష పండితులకు ఆశలు చిగురించాయి. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పదవీ ప్రమాణం చేరడం జరిగింది. 2017 డిసెంబర్ నెలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో మన దేశ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రపంచ తెలుగు మహాసభల ప్రతినిధుల ముందు భాష పండితులను పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో భాష పండితుల కల నెరవేరుతుందని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. వారి అశలు అడియాసలుగా మారాయి. తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 10సంవత్సరాలు గడిచినా ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి ఐదు సంవత్సరాలు గడిచినా భాష పండితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గత ప్రభుత్వం భాష, సంస్కృతి, సంప్రదాయాలను అభివృద్ధి చేస్తామని చెప్పునే భాష, అభివృద్ధి చేయకుండా కుట్రలు, కుతంత్రాలు చేసింది.

డా. ఎస్. విజయ భాస్కర్
9290826988

# కార్మికుల నడ్డివిరుస్తున్న ఆర్‌టిసి యాజమాన్యం

భారతదేశంలో జన్మించిన మహాత్మా గాంధీ పరాయిదేశమైన దక్షిణాఫ్రికాకి వెళ్ళి నల్లజాతి వారి హక్కుల కోసం పోరాటం చేశారు. ఆ పోరాటాన్ని ప్రపంచమంతా పొగడ్తలతో ముంచెత్తింది. ఆ గాంధీ విగ్రహం సాక్షిగా హైదరాబాద్ లోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్లో తెలంగాణ ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల సాధన కోసం మౌన ప్రదర్శన చేస్తే ప్రభుత్వం, ఆర్టీసి మేనేజ్మెంట్ పోలీసు బలగాలను పెట్టి ఆ పోరాటాన్ని భగ్నం చేయడానికి లాఠీలతో కవాతు నడిపారు. ఇది సోషల్ మీడియాలో కార్మికులతో పాటు ప్రజలందరూ చూశారు. అక్కడ చేసేది మౌన ప్రదర్శన. ఈ ప్రదర్శనలో ప్రసంగాలు లేవు. ప్రభుత్వ, యాజమాన్య వ్యతిరేక స్లోగన్స్ లేవు. ప్రయాణీకులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించింది లేదు. కేవలం ప్లకార్డులను ప్రదర్శించి నల్లబట్ట మూతికి కట్టుకుని చేసే మౌన పోరాటం. ఈ మాత్రం దానికి మేనేజిమెంట్కి ఎందుకంత ఉలుకు? శాంతియుతంగా, ఎవరికీ ఆటంకం కలిగించకుండా యాజమాన్యం, ప్రభుత్వాలపై ఎటువంటి విమర్శలు లేకుండా, అసభ్య పదజాలం వాడకుండా చేస్తున్న మౌన ప్రదర్శనకి ఆంక్షలు ఎందుకు? ఆర్టీసి అధికారులు అవుట్ సోర్సింగ్లో నియమించుకున్న ప్రైవేటు సైన్యాన్ని సెక్యూరిటీ రూపంలో రంగంలోకి దించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఎంప్లాయిస్ యూనియన్ పోరాటం అంటే ఇంతలా భయపడటం దేనికి? మే మాసంలో జరిగిన చలో బస్భవన్ కార్యక్రమాన్ని కూడా ముష్కర పోలీసు బలగాలను ఉపయోగించి భగ్నం చేసే ప్రయత్నం యాజమాన్యం చేసినప్పటికీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపారు. అదీ ట్రేడ యూనియన్ పొటెన్సీ ప్రభుత్వ, యాజమాన్యాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తుంటే పోరాటాలు చేయడం, నిరసన వ్యక్తం చేయడం, ధర్నాలు చేయడం సహజం. కష్టపడి కార్మికవర్గం సంపాదించిన 8 గంటల పనిదినాల హక్కును యాజమాన్యం తిమింగలాల్లా మింగుతుంటే ట్రేడ యూనియన్ చూస్తూ ఊరుకుంటుందా? పనిభారాలతో కార్మికుల నడ్డి విరగ్గొడుతోంది మేనేజిమెంట్. ఆవేశం కట్టలు తెంచుకున్న మెదక్ డిపో కార్మికులు బస్ డిపోను బందు చేసి అష్టదిగ్బంధనం చేశారు. దీనికి కారణం ఏమిటి? ఒక డ్రైవర్ చేత ఒకరోజులో 400 నుండి 500 కిలోమీటర్లు డ్యూటీ చేయించడం. కార్పొరేషన్ విడుదల చేసిన ఆపరేషనల్ మాన్యువల్ ప్రకారం ఆర్డినరీ సర్వీస్ డ్యూటీ 150 కిలోమీటర్లు. ఎక్స్ ప్రెస్, సూపర్ లగ్జరీ, డే అవుట్ సర్వీస్ డ్యూటీ 8 గంటలలో 300 కిలోమీటర్లు చేయాలి. అదే నైటవుట్ సర్వీసుకు అయితే 250 కిలోమీటర్లు డ్యూటీ డ్రైవర్ కండక్టర్లు చేయాలి. ఆర్టీసి అధికారులు డ్రైవర్ కండక్టర్ల చేత 500 కిలోమీటర్ల వరకు డ్యూటీలు చేయించటం వారి నిరంకుత్వానికి నిదర్శనం. ఇది ఒక మెదక్ డిపో సమస్య కాదు. రాష్ట్రంలో ఉన్నటువంటి 94 డిపోలలో ఇదే పరిస్థితిని కార్మికులు ఎదుర్కొంటున్నారు. 4 గోడల మధ్య పిల్లిని బంధించి కొడితే తిరగబడి గుడ్లు పీకేస్తుంది. యాజమాన్య విధానాలకు విసుగెత్తిన కార్మిక వర్గం సలసల కాగే రక్తంతో తిరుగుబాటు చేయక ఏం చేస్తారు? ఇదిలా ఉంటే క్రిందిస్థాయి అధికారుల వేధింపులు మరీ తీవ్రతరం అయ్యాయి. అది ఎంతలా అంటే ఒక కార్మికుడు తన తల్లి చనిపోయిందని, కర్మకాండలు జరిపించడానికి లీవు కావాలని క్రిందిస్థాయి అధికారులను అడిగితే శవం వద్ద ఉండి ఫోటో పంపించమంటారు. ఇది ఆర్టీసి యాజమాన్య దుర్మార్గానికి పరాకాష్ఠ. 2013 వేతన సవరణ బాండ్ల బకాయిలు పదేళ్ళయినా ఇవ్వకపోతే కార్మికులకు కోపం రాకూడదు. సమ్మెలు, ధర్నాలు చేయకూడదు అని యాజమాన్యం అభిప్రాయం. 2017 వేతన సవరణ గత 7 ఏళ్ళుగా జరపకపోయినా కార్మికులు నోరు తెరిచి అడగకూడదు. మూడేళ్ళు గడుస్తున్నా 2021 వేతన సవరణ జరపకపోతే ఆవేశం కట్టలు తెంచుకున్నకార్మికులు మౌన ప్రదర్శన చేయటం తప్పెలా అవుతుంది? గత ప్రభుత్వం వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినా ఇంతవరకు విలీన ప్రక్రియ పూర్తి కాలేదంటే కార్మికులలో నరాల రక్తం పొంగి కరాళ నృత్యం చేయరా? ఈ.పి.కె. రాలేదని కండక్టర్ని, కెఎంపిఎల్ రాలేదని డ్రైవర్ని, సీటు డిఎం/ఆర్ఎం పేరుతో రోజుల తరబడి కార్మికుల చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ మేనేజిమెంట్ తిప్పించుకోవటం అత్యంత దుర్మార్గమైన చర్య. ఇది కార్మికవర్గం సహించదు. డిపో నష్టాలకు కారణం అధికారుల ఆపరేషన్ ప్లానింగ్ సరిగా లేకపోవడం. మరి డిపోలకు నష్టాలు వస్తున్నప్పుడు క్షేత్రస్థాయి లోని వాస్తవాలను చెబుతున్న డ్రైవర్ కండక్టర్ల సూచనలను అధికారులు ఎందుకు గమనంలోకి తీసుకోవడం లేదు? క్షేత్రస్థాయి నిజాలు చెబుతున్నా డూ వాట్ ఐ సే అని అధికారులు హుంకరించటం ఆనవాయితీగా మారింది. కార్మికుల జీతాలలో 12 శాతం పి.ఎఫ్ కాంట్రిబ్యూషన్ రికవరీ చేసి ఆ డబ్బు రీజనల్ ప్రావిడెంట్ ఫండ కమిషనర్కి పంపకుండా ఆర్టీసి సొంతానికి వాడుకోవడం ఆర్థిక పరమైన నేరం. కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎంఆర్డిఎఫ్ కోసం కార్మికుల జీతాలలో 6/4.5 శాతం రికవరీ చేసి ఆ డబ్బు సొసైటీకి పంపకుండా పట్టపగలే యాజమాన్యం దోచుకోవడం ఫైనాన్షియల్ క్రైమ్ కిందకే వస్తుంది. అందుకే సిసిఎస్ వారు మేనేజిమెంట్ కోర్టుకెళ్ళడం, డబ్బులు చెల్లించనందున కంటెప్ట్ ఆఫ్ కోర్ట్ వేయ డం జరిగింది. ఈపిఎఫ్ కమిషనర్ కూడా వారికి రావలసిన డబ్బు సుమారు 1250 కోట్లు పంపకపోవడం వల్ల సంస్థ యొక్క ప్రధాన బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేసింది. వారి డబ్బును వారు రాబట్టుకోవటానికి కంటెస్ట్ ఆఫ్ కోర్టు వేయడం, బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయడం తప్పు కానప్పుడు ఆర్టీసి కార్మికులు వారికి రావలసిన బాండ్ల బకాయిలు అడగటం, వేతన సవరణ చేయమనడం తప్పెలా అవుతుంది? శాంతియుతమైన పోరాటా లు కూడా చేయనీయకుండా అడ్డుపడే హక్కు యా జ మాన్యానికి లేదు. నిరసన, పోరాటాలు శాంతియుతంగా చేయడం తప్పుకాదని, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా రాజ్యాం గం కల్పించిన ఆర్టికల్ 19(1)(ఎ) పరిధిలో వాక్ స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకోవడాన్ని నేరంగా పరిగణించలేమని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతిస్తోంది. ఇకనైనా ఆర్టీసి మేనేజిమెంట్ మరియు ప్రభుత్వం ట్రేడ యూనియన్లను పునరుద్ధరించి కార్మికుల హక్కులను హననం చేయకుండా ఉంటే బాగుంటుంది. లేకపోతే అలుపెరుగని కార్మిక పోరాటాలను ఎదుర్కోవలసి వస్తుంది.

ఎస్.బాబు,
అధ్యక్షులు టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

## నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం



ప్రజాపక్షం/సూర్యాపేట: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి ఆసుపత్రులు నిర్వహిస్తే సీజ్ చేస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన డాక్టర్లు, అగ్నిమాపక భద్రత లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బస్టాండ్ సమీపంలోని శ్రీ చెస్ట్ ఆసుపత్రి, సాయి కీర్తన ప్రైవేట్ ఆసుపత్రి, నక్షత్ర హాస్పిటల్, శ్రీ సూర్య హాస్పిటల్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యుల పేరుతో రిజిస్ట్రేషన్ అయిన వాటిని రద్దు చేస్తామన్నారు. రెండు రోజుల్లో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిమాపక భద్రత సర్టిఫికెట్లు, బయో మెడికల్, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్లు సమర్పించాలని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు స్పందించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అంజయ్య గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## పిల్లలమర్రిని ఎంచుకోవాలి



ప్రజాపక్షం/సూర్యాపేట: ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఉపాధ్యాయుల బదిలీల్లో అంకితభావంతో ఇంగ్లీష్ మీడియంలో బోధించే ఉపాధ్యాయులే పిల్లలమర్రి ప్రాథమిక పాఠశాలను ఎంచుకోవాలని స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు మాదగోని ఉపేందర్, పల్స క్రాంతి అన్నారు. ఈ విషయమై బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో పిల్లలమర్రి ఉన్నందున ప్రిపరెన్షియల్ కేటగిరిలో ఉన్న ఉపాధ్యాయులు పిల్లలమర్రి పాఠశాలను ఎంచుకోవద్దన్నారు. సెక్టరియల్ ఆఫీసర్ దేవరశెట్టి జనార్థన్ ఉన్నారు.

## వెలిశాల స్వాతికి డాక్టరేట్



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: మండలంలోని బాలెంల గురుకుల కళాశాలలో కామర్స్ డిగ్రీ అధ్యాపకురాలుగా పని చేస్తున్న వెలిశాల స్వాతి ఉస్మానియా యూనివర్సిటి డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. స్వాతి కామర్స్ విభాగంలో ప్రైసింగ్ ఏఫిసియన్సీ ఆఫ్ ఐపిఓ ఎస్ ఎ స్టడీ ఆన్ బిఎస్ఈ లిస్టెడ్ ఎస్ఎంఈఎస్ అనే అంశంపై ప్రొపెసర్ డాక్టర్ శంకరయ్య ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామానికి చెందిన వెలిశాల వెంకటాచారిధనమ్మల కుమార్తె స్వాతికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. స్వాతి చిన్ననాటి నుండి పట్టుదలతో చదువుతుందని, తన భర్త ప్రోత్సాహంతో డాక్టరేట్ సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

## కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలి



ప్రజాపక్షం / గద్వాల : నూతన పిఆర్‌సి ప్రకానం కనీస వేతనం 26వేలు నిర్ణయించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ బి.ఎం.సంతోష్‌కు మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గట్టన్నతో కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కార్పోరేషన్లలో పని చేస్తున్న వారిని 2వ పిఆర్‌సిలో కనీస వేతనం 26 వేల ఇవ్వాలని థర్డ్ పార్టీకి అప్పజెప్పకుండా, ప్రస్తుతం పని చేస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్.మహేందర్ నాథ్, అయిజ టౌన్ ప్రసిడెంట్ నరేష్,కోశాధికారి ఆంజనేయులు,ఉపాధ్యక్షులు అడివెన్న, వీరేష్, సుధాకర్, సభ్యులు ప్రకాశ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌ను తరిమికొడదాం



ప్రజాపక్షం / అయిజ : డ్రగ్స్‌ను తరిమి కొడదాం యువతను కాపాడుకుందామని పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇంటర్‌నేషన్ డ్రగ్స్ డే సందర్భంగా ఆయన మండల తహసిల్దార్ ఎన్.జ్యోతితో కలసి విద్యార్థులతో పట్టణంలోని చౌరాస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ కూడలీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు మందుకు యువత, విద్యార్థులు బానిసలైతే చావును వెతుకుంటూ పోయినట్టేనని దానివల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని సూచించారు.
వార్తకు ఫోటోలున్నాయి

## స్వయం ఉపాధికి చేయూత



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ట్రాన్స్‌జెండర్లకు అన్ని విధాలా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ట్రాన్స్ జెండర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు, డ్రైవింగ్ నేర్చుకుంటే ప్రైవేట్ బస్సు డ్రైవర్లుగా ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు డ్రైవింగ్ శిక్షణ పొందాలని సూచించారు. ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తగిన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అదే విధంగా ట్రాన్స్‌జెండర్ల సంఘాలను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కోసం చేయూతనందిస్తామని తెలిపారు. రుణాలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ లక్ష్మి, ట్రాన్స్‌జెండర్లు తదితరులున్నారు.

# తాగునీటి సమస్యకు ఇక చెక్

రూ.124.48కోట్లతో మంచినీటి పథకం

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రులు

ఫలించిన కూనంనేని కృషి



ప్రజాపక్షం/ ఖమ్మం : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యకు ఇక శాశ్వత పరిష్కారం లభించనుంది. అనేక దశాబ్దాలుగా వేసవి వచ్చిందంటే చాలు కొత్తగూడెంలో నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పలు బస్తీలలో బోర్లు ఎండిపోయి ట్యాంకర్లపై ఆధారపడే వారు. 2009లో తొలిసారి కొత్తగూడెం శాసన సభ్యునిగా ఎన్నికైన కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అధికారుల సహకారంతో ప్రణాళికను రూపొందించారు. అప్పటి ప్రభుత్వం ఆమోదించిన నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ప్రాజెక్టు అలానే నిలిచిపోయింది.మధ్యలోపదేళ్లుగడిచినాఎవరు దీని గురించి పట్టించుకోలేదు. 2023లో కూనంనేని సాంబశివరావు తిరిగి కొత్తగూడెం శాసనసభ్యునిగా ఎన్నిక కాగానే ఈ ప్రాజెక్టుపైప్రత్యేక దృష్టిసారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల దృష్టికి తాగునీటి సమస్యను తీసుకెళ్లి అమృత స్కీమ్‌లో భాగంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో రూ. 124.48 కోట్లతో ప్రాజెక్టును మంజూరు చేయించారు. కిన్నెరసాని నుండి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధితో పాటు 150 కిలో మీటర్ల మేర నూతన పైపులైన్లు ఏర్పా టు చేసి తాగునీటిని అందించనున్నారు. ఈ పథకానికి 60 శాతం నిధులుకేంద్రం భరించనుండగా 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం మున్సిపల్ నిధులను వెచ్చించనున్నారు. 2.65 లక్షల లీటర్ల నీటిని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద నిర్మించే ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేస్తారు. అక్కడి నుంచి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తారు. పాత కొత్తగూడెం, విశ్వనాథకాలనీ,రామవరంలోఓవర్‌హెడ్‌ట్యాంకులు నిర్మించి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో నీటిని సరఫరా చేయనున్నారు. కూనంనేని మాట్లాడుతూ శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో ప్రతిపాదనలు పంపించామని, 2014, 2018లో ఎన్నికైన శాసనసభ్యులు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## మత్తు పదార్థాల నిర్మూలన సామాజిక బాధ్యత




ప్రజాపక్షం/కోదాడః మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని,గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రజలందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిఅన్నారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నందు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆర్డీవో సూర్యనారాయణ,డియస్పీ శ్రీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలసిఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో కళాశాల విద్యార్థులకు ఎల్ఈడి స్క్రీన్ ద్వారాడ్రగ్స్‌తీసుకుంటే కలిగే నష్టాలను వీడియోల రూపంలో చూపించారు.డియస్పీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌మత్తులోచిత్తుకావద్దని ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఆదిశగా అడుగులు వేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల,వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఎంపిపి మల్లెల రాణి,జడ్‌పిటిసికృష్ణకుమారి,సిఐలు రాము, రజితరెడ్డి, వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, ఎంఈవో సలీం షరీఫ్,ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వేముల వెంకటేశ్వర్లు, డాక్టర్‌దశరథ,ఎస్ఐలురంజిత్‌రెడ్డి,అనిల్‌రెడ్డి, నవీన్, రాంబాబు, న్యాయవాదులుపాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




ప్రజాపక్షం/హుజూర్‌నగర్ఃయువతమాదకద్ర వ్యాలకు,మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు.సిఐచరమంద రాజు,ఎస్ఐ ముత్తయ్య, బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు ఎంఎస్ రాఘవరావు, కుక్కడపు సైదులు, బానోతు శంకర్‌నాయక్,షేక్ సైదాహుస్సేన్, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ భీమార్జున్‌రెడ్డి,ప్రసాద్,శ్యాంకుమార్,సుశీల పాల్గొన్నారు.

## లయన్స్ సేవలు అపూర్వం




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించేలా సేవలు అందించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సూర్యాపేట 51వ కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. గత కార్యవర్గం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిందని అలాగే నూతన కార్యవర్గం కూడా రెట్టింపు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. నూతన అధ్యక్షులుగా కొంపెల్లి లక్ష్మారెడ్డి, సెక్రటరీగా వెంపటి శభరీనాథ్, కోశాధికారిగా మీలా వంశీలచే ప్రమాణస్వీకారం చేశారు. ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, గోలి అమరేందర్ రెడ్డి,గుడిపూరి వెంకటేశ్వర్‌రావు, గండూరి కృపాకర్, దేవిరెడ్డిరవీందర్‌రెడ్డి,దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## అక్రమ రవాణా వివరాలివ్వండి




జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట: యువత మత్తు పదార్థాలకు లోనవ్వకుండా దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహిళ శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుండి ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ర్యాలీని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఎవరైన డ్రగ్స్ అక్రమ రవాణ, వినియోగిస్తున్న వారి వివరాలను పోలీసులకు అందించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, డిఎస్‌పి రవి, జిల్లా వైద్యశాఖ అధికారి కోటాచలం, జిల్లా సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ, డిఐఈఓ కృష్ణయ్య, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి లక్ష్మణ్ నాయక్, డిపిఆర్ఓ రమేష్ కుమార్, విద్యార్థులు, యువకులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఈనెల 23న వ్యక్తి అదృశ్యం కాగా హత్యచేసిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం విజయపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సయ్యద్ రెహమాన్(35) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. అదే పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన సాయిశివారెడ్డి వచ్చి పెయింగ్ పనులు చేస్తుంటాడు. అయితే ఈనెల 22న రెహమాన్‌కు సాయిశివారెడ్డి మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. ఆ మరుసటి రోజు 23న రాత్రి పది గంటలకు సాయిశివారెడ్డి వచ్చి పెయింటింగ్ పనులు చేస్తుండగా రెహమాన్ బిల్డింగ్ ఓనర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆ ఓనర్ అతను పనులు చేసుకుంటాడునువు పడుకో అని చెప్పాడు. అదే రాత్రి 12గంటల సమయంలో రెహమాన్, సాయిశివారెడ్డిలు ఇద్దరు మరోసారి గొడవ పడడంతో సాయిశివారెడ్డి కోపోద్రిక్తుడై డ్రిల్లింగ్ మిషన్ బిట్టు రాడ్డుతో రెహమాన్ కుడి కన్నుపై తీవ్రంగా కొట్టడంతో మృతిచెందాడు. రెహమాన్ మృతదేహాన్ని సాయిశివారెడ్డి ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టి బిల్డింగ్ పై నుంచి కిందకు తీసుకెళ్లి పాఠశాల ఆవరణలో గుంత తీసి అందులో పాతిపెట్టాడు.రెహమాన్‌అదృశ్యమైనట్లు అతని కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. అయితే సాయిశివారెడ్డి బుధవారం పెద్దవూర వై జంక్షన్ వద్ద హైద్రాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో సాగర్ సీఐ బీసన్న అతన్ని పట్టుకోని విచారించగా హత్య ఉదాంతాన్ని ఒప్పుకున్నాడు. రెహమాన్‌ను హత్య చేయడానికి ఉపయోగించిన డ్రిల్లింగ్ మిషన్ బిట్టురాడ్డును, గడ్డపార, దుస్తులను స్వాదీనం చేసుకోని నిందితుడు సాయిశివారెడ్డిని కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. హత్య కేసును ఛేదించిన సీఐలు బీసన్న, జనార్ధన్, ఎస్ఐలు సంపత్, వీరబాబు, నారాయణరెడ్డిలను డీఎస్పీ అభినందించారు.

## ఆటో కార్మికులకు అన్యాయం జరిగితే సహించం



ప్రజాపక్షం/భద్రాచలం : సులాబ్ కాంప్లెక్స్ పనుల నిర్మాణం పేరుతో ఆటో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. భద్రాద్రి గ్రామీణ ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అడ్డా వద్ద బుధవారం ఆయన కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అడ్డా సమీపంలో సులాబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, అదే జరిగితే ఏళ్ల తరబడి ఇక్కడ జీవనంసాగిస్తున్న ఆటో కార్మికులు బ్రతుకు దెరువు కోల్పోతారని చెప్పారు. సులాబ్ కాంప్లెక్స్‌ను ఆర్టిసి గోడ లోపలని భాగంలో కూడా నిర్మించుకోవచ్చని, అధికారులు పరిశీలిన చేయాలన్నారు. ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్,సిపిఐనాయుకులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్,ముత్యాలవిశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, ఏపూరిబ్రహ్మం, పూర్ణచంద్రరావు, ఎల్లారెడ్డి, ఆటోయూనియన్ నాయకులు జల్లారపురమేష్, ఎస్‌కె అజీం, బోస్ లక్ష్మణ్, దేగల చంటి ఉన్నారు.

# విధులకు గైర్హాజరైతే సస్పెన్షన్ ఖాయం



ప్రజాపక్షం /నల్లగొండ ఃప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను మంచి స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలి పాఠశాల ద్వారా క్రమశిక్షణను అలవాటు చేయాలి ఉపాధ్యాయులు పాఠశాలలకు నిర్దేశించిన సమయం ప్రకారం హాజరుకావాలని, ముందస్తు సెలవు లేకుండా ఎట్టి పరిస్థితులలో విధులకు గైర్హాజరు కావద్దని ,ఒకవేళ గైర్హాజరైతే సస్పెండ్ చేస్తామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను జూలై 1 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుండి విద్యాశాఖ కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు . స్వయం సహాయక మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను అప్పజెప్పడం జరిగిందని ,రెండవ జత నాణ్యతతో ఒక పద్ధతి ప్రకారం స్వయం సహాయక సంఘాలు అప్పగించాలని అన్నారు. హెడ్మాస్టర్లు గ్రామ స్థాయిలో గ్రామపంచాయతీ బృందంతో కలిసి పని చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ,విద్యార్థుల హాజరు విద్యశాఖ సమీక్షలో మొదటి అంశంగా తీసుకోవడం జరుగుతుందని, అందువల్ల ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన, లేదా పాఠశాల సమయానికంటే ముందే వెళ్లిపోయినా సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులదే బాధ్యతని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలకమిటీలు దృష్టి సారించి జూలై 1 నాటికి పనులు పూర్తిచేసేవిధంగాచర్యలుతీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డిపి ఓ మురళి, మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమన్న, టీఎస్ ఎం ఐ డి సి ఇంజనీర్లు, తదితలు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం



ప్రజాపక్షం/తుంగతుర్తి: అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సిపిడిఓ వెంకటరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఈసిసిఈపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపులో ఆమె ప్రసంగించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక పాఠశాల(ప్రీ స్కూల్)ను ఏర్పాటు చేశామన్నారు. ప్లే స్కూల్ నిర్వహణపై దిశ నిర్ధేశం చేశామని చెప్పారు. గ్రామాల్లో 3నుండి6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి స్థాయిలో ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఆట, పాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, గణితంతో పాటు రంగుల బొమ్మలతో ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలు,కృత్యాలతో పిల్లలకు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు వివరించారు. పిల్లల్లో వచ్చిన మార్పు, అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.ఐసిడిఎస్‌సూపర్‌వైజర్లు ప్రమీల, లక్ష్మి, అనురాధాతో పాటు అంగన్వాడీ ఉపాధ్యాయురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌కే ప్రాధాన్యం

జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్

డాక్టర్ సౌమ్యామిశ్రా




ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్: వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలని జైల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యా మిశ్రా, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం వారు జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి మండలంలోని ఇమాంపేట వద్ద జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైళ్ళ శాఖ ద్వారా పెట్రోల్ బంక్ ఉమ్మడి రాష్ట్రంలో కడప జిల్లాలో మొదటి సారిగా ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాల్లో 30 పెట్రోల్ బంకులను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బంకును నిర్వహిస్తూ ఖైదీల ద్వారా బంకులను నిర్వహిస్తూ ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ, ఖైదీల్లో పరివర్తన తీసుకవస్తామన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. తప్పు చేసిన వారిని మంచి మార్గంలో నడపాలన్నదే లక్ష్యమన్నారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంకును వాహనదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైలు శాఖ ఐజీ ఎన్ మురళి బాబు, అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, డిఎస్‌పి రాములు, ఇంజన్ ఆయిల్ డివిజిల్ రిటైల్ సెల్స్ డిప్యూటి జనరల్ మేనేజర్ ఎస్ శ్రీకాంత్, జిల్లా సబ్ జైలు అధికారి శోభన్ బాబు, సబ్ జైల్ సూపరింటెండెంట్ బి సుధాకర్ రెడ్డి ఉన్నారు.

## నిషేధిత గంజాయి దగ్ధం



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : నిషేధిత గంజాయిని బాయిలర్‌లో వేసి దగ్ధం చేసినట్లు సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందన దీప్తి తెలిపారు. 2021 నుంచి 2023 వరకు కాలంలో వివిధ రైల్వే స్టేషన్లలో గంజాయి పట్టుబడిన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తౌక్కాపురంలో రొమా కంపెనీ వద్ద బుధవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. విడతల వారీగా సికింద్రాబాద్, వరంగల్, కాచిగూడ, కాజీపేట, నిజామాబాద్, నల్లగొండ, హైదరాబాద్, వికారాబాద్, రైల్వే స్టేషన్ల పరిధిలో 15 క్వింటాల 75 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారన్నారు. పంచనామా అనంతరం దహనం చేశామన్నారు. వివిధ రైల్వే పోలీస్ స్టేషన్ల పరిధిలో 52 గంజాయి కేసులు నమోదయ్యాయని రైల్వే ఎస్పీ చందన దీప్తి తెలిపారు. 15 క్వింటాల 75 కేజీల నిషేధిత గంజాయిని డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, రైల్వే ఎస్పీ చందన దీప్తి ఆధ్వర్యంలో రొమా పరిశ్రమ బాయిలర్‌లో వేసి దహనం చేశారు.




## సెస్‌ను అభివృద్ధి పథంలో నిలబెడతాం

### సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** ప్రతినిధులందరి సహకారంతో సెస్‌ను అభివృద్ధి పథంలో నిలబెడతామని చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం పద్మనాయక కళ్యాణ మండపంలో సహకార విద్యుత్ సంస్థ సెస్ 50వ వార్షిక మహాసభ సమావేశం చిక్కాల రామారావు అధ్యక్షతన జరిగింది. వరుసగా వచ్చిన ఎలక్షన్ కోడ్ ల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యం జరిగిందని అన్నారు. తమ పాలకవర్గం ఎన్నికైన తర్వాత సంస్థను అభివృద్ధి పదంలో నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 130కోట్లు బకాయిలు ఉన్నాయని గ్రామస్థాయిలో ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో బకాయిలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలువురు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చిక్కాల రామా రావు సమాధానం చెప్పారు. ఎండి ఎల్. శ్రీనివాస్ రెడ్డి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, రవీందర్ రెడ్డి, నారాయణరావు, సందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణారి, మాడుగుల మల్లేశం, శ్రీనివాస రావు, ఆకుల గంగారం, నామాల ఉమా, ఆకుల దేవరాజం, కొట్టేపల్లి సుధా కర్, తిరుపతి రెడ్డి, సేస్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ పనుల్లో రైతులు



**ప్రజాపక్షం/ముత్తారం :** గత రెండు మూడు రోజుల నుండి వర్షాలు కురవడంతో ముత్తారం మండలంలోని ఓడేడు, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, లక్కారం,ఖమ్మం పల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొంతకాలంగా రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ప్రారంభించి, పత్తి విత్తనాలు నాటుతున్నారు. ముందుగానే భూములను ట్రాక్టర్లతో దున్నుకొని సాగుకు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ భూములు సరైన పదును కానప్పటికీ మున్ముందు వర్షాలు పడతాయానే నమ్మకంతో, అంతేకాకుండా మున్ముందు కూలీల కొరత ఏర్పడుతుందనే భావనే కొంతమంది రైతులు విత్తనాలు నాటారు. వరి పంటలకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటిరవకు సుమారుగా 20% మంది రైతులు విత్తనాలు నాటినట్లు తెలుస్తోంది.

## మంచినీటి సమస్య ఉండొద్దు



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో మంచినీటి సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం నాడు జరిగిన గ్రామ సభకు కార్యదర్శి అంజయ్య అధ్యక్షత వహించగా ఎంపిడిఓ రమేష్,ఉపాధి హామీ ఏపిఓ జగదేరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఎంపిటిసి కుర్మె మహేందర్,విడిసి అధ్యక్షులు జి.గంగాధర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని మిషన్ భగీరథ ద్వారా వేసిన పైపులైన్‌లను మరమ్మత్తులు చేపట్టాలని పలువురు కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజన వాడలో ఉన్న పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలని అన్నా రు. వర్షాకాలం నీరు నిలుస్తుందని ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలో తిరిగే పశువులను కట్టడి చేయాలని కోరారు. గ్రామ పంచాయితీ వారు పశువులకు 2 వేల రూపాయలు జరిమానా విధించి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం బేగంపేట గ్రామ శివా రులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడుం బా స్థావ రాలపై రామ గిరి ఎస్సై కాట్రపు సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12000 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎస్ ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారుచేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నాటుసారా కాసే వారిపై పీడియాక్ట్ అమలు చేస్తామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్స్ సదానందం, రవి లు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగికి అంబేద్కర్ జాతీయ అవార్డు

**ప్రజాపక్షం/కాసిపేట:** మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త స్వరాజ్ రాష్ట్ర నాయకుడు సింగరేణి కార్మికుడు బన్న లక్ష్మ ందాస్ హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్‌ఎ) జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ బన్న లక్ష్మ ణ్ దాస్ పనిచేసిన ప్రతి పనిలో ఫలితం తీసుకురావడంలో నేర్పరని, ప్రజలకు దగ్గరగా ఉండి కష్టపడి పని చేయగలరని, అంబేద్కర్ నేషనల్ అవార్డు తెలంగాణ నుండి తీసుకోవడం అభినందించతగినదన్నారు. అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో ఉద్యమకారులు కవి, గాయకులు రచయిత దరువు ఎల్లన్న, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓయూ జెఎసి కన్వీనర్ దుర్గం భాస్కర్, ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, మాజీ ఎంపిటిసి బన్న స్వరూప, కుటుంబ సభ్యులు యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా పట్టివేత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** నిషేధిత గుట్కాను జిల్లాలో సమూలంగా రూపుమాపడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి సదయ్యతో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మంగళవారం ముందస్తు సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్, ఆసి ఫాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఆసిఫాబాద్ పట్టణంలోని ఫారెస్ట్ చెక్ పోస్టు ఆఫీసు వెనుకలగోదాంలో రూ.8లక్షల నిషేధిత గుట్కా నిల్వలు గు ర్తించి పట్టుకున్నట్లు తెలిపారు.వరకు ఉంటుందని, పట్టుబడిన గుట్కా మహరాష్ట్ర చంద్రాపూర్ తాలూకాకి చెందిన అమిత్ (36) అనే వ్యక్తివిగా గుర్తించి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించిన, పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేసిన, నిషేధిత పదార్థాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్‌పి , సిఐసతీష్, టాస్క్‌ఫోర్స్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

### అంబేద్కర్ విగ్రహం నుండి గట్టపల్లి క్రాసింగ్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** అధునాతన హంగులతో త్వరలో సుల్తానాబాద్ కు నూతన శోభ ఏర్పడబోతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 25 లక్షల రూపాయలు దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రాండ్ నుండి నిర్మించిన ఏడు వ్యాపార గదుల ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు మహిళ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గదులను పారదర్శకంగా వ్యాపారులకు అందించి కార్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామని షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా వ్యాపారులు లబ్ధి పొందడంతో పాటు కార్యాల యానికి నిధులు చేకూరుతాయని పేర్కొన్నారు. వ్యాపార సముదాయానికి మరో ఐదు లక్షలు మం జూరు చేయాలని ఎంపీపీ బాలాజీ రావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే 5 లక్షలు నిధులు అందిస్తానని పేర్కొన్నారు. అలాగే సుల్తానాబాద్ పట్టణాన్ని 11కోట్లలతో అధునాతన హంగులతో అంతర్గత రోడ్లను విస్తరింపజేసి అభివృద్ధి పరుస్తున్నామని ప్రజలందరూ సహకరించాలని రానున్న రోజుల్లో సుల్తానాబాద్‌కు నూతన శోభ సంతరించుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు జెడ్పిటిసి మినుపాల స్వరూప ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, జూపల్లి సందీప్ రావు, దేవరనేని మోహన్ రావు, గడ్డం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, సుల్తానాబాద్ మం డలం ఎంపిటీసీలు ఫకీర్ యాదవ్ , శీలం శంకర్, మం డల రమేష్, గుర్రం సంపత్, గట్టు శ్రీనివాస్, పొన్నాల అనిత అంజయ్య, కాంగ్రెస్ శ్రేణులు అంతటి అన్నయ్య గౌడ్, దన్నాయక్ దామోదర్ రావు, సాయిరీ మహేందర్,చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి లతోపాటు మండలంలోని మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు ౨పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/మంథని:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డి, కమీషనర్ గట్టు మల్లికార్జునస్వామి అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ కార్యాలయంలో వర్షా కాల సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ వర్షాకాలంలో వరద ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాం తాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బారీ వర్షాలకు వరదలు వచ్చే వార్డుల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ క్రమంలో వ్యాదులు ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దోమలు వృద్ధిచెందకుండా పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు నీటి నిల్వలులేకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సైతం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు జాగ్రత్తలు చెప్పాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ఇనుప పోల్స్, వేలాడుతున్న తీగలు, చెట్లపై ఉన్న తీగలను సరిచేయాలన్నారు. వార్డు ప్రత్యేక అధికారులు ప్రజల సమస్యలు వారి అవసరాలు తెలుసుకుని పరిష్కారం చేయాలని సూచించారు. వర్షాకాల సీజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

### సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ వారితో కలిసి సమిష్టిగా కృషి చేయాలని సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రవణ్ కుమార్ విద్యార్థులకు యువతకు సూచించారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలు డ్రగ్స్ కు అలవాటు పడి తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని వాటిని నిర్మూలించేందుకుఅందరూ సహకరించాలని మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యమని గ్రామాల్లో అనేకమంది యువత డ్రగ్స్ సేవించి చెడు మార్గం పడుతున్నారని అన్నారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా అవగాహన పెంపొందించే దిశగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సం దర్భంగా యువత డ్రగ్స్ మాయలో పడి తమ విలువైన జీవితాన్ని వృథా చేసుకోకూడదనిఒక్కసారి డ్రగ్స్ వాడినా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే దూరంగా ఉండేలా కృషి చేయడం మన బాధ్యత అన్నారు.ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం తమకు అందిస్తే చర్యలు తీసుకుం టామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. డ్రగ్స్‌పై నిర్వహించిన వ్యాసరచనము లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినిలు పలువురు పాల్గొన్నారు.

## డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

### పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభవాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ అన్నారు. బుధవారం పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సమీకృత జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ, డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ ఆసాంతం అధికారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కునారం రోడ్డు వద్ద అధికారులు, విద్యార్థులు డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ మానవహారం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ ఈ సందర్భంగా వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ డి.హేమంత్ కుమార్ మాట్లాడుతూ మాధక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులలో, ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. డ్రగ్స్ ను అరికట్టడంలో ప్రభుత్వానికి మనమంతా బాధ్యత గల పౌరులుగా పూర్తి స్థాయిలో సహకారం అందజేయాలని అన్నారు. మనమంతా యూనిఫామ్ వేయని పోలీసు లాగా డ్రగ్స్, మాదక ద్రవ్యాలు అరికట్టడానికి కృషి చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభవాల గురించి మనం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకు వివరించాలని, మనకు తెలిసిన వారిలో ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.శ్రీనివాస్, ఏ.సి.పి. క్రిష్ణ, సి.ఐ. క్రిష్ణ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్. మహిపాల్ రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్, జిల్లా న్యాయ సేవాధికార, పోలీస్, ఎక్సైజ్, సంబంధిత అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండంలో ఉన్న తబితా బాలల సంరక్షణ కేంద్రం, మనో చైతన్య మానసిక దివ్యాంగుల వృత్తివిద్య శిక్షణ ఉపాధి కేంద్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సందర్శించారు. తబితా బాలల సంరక్షణ కేంద్రం లోని పిల్లలతో ముచ్చ టిం చిన కలెక్టర్ వారు ఏం చదువుతున్నారు, పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్త కాలు అందించారా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్ బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం మనో చైతన్య మానసిక విక లాంగుల వృత్తి విద్యా శిక్షణ ఉపాధి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ మానసిక దివ్యాంగులకు అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. స్వీట్ బాక్స్ లు, టిఫిన్ ప్లేట్, ఫైల్ ప్యాడ్, క్లిప్ ఫైల్స్, పోస్టల్ కవర్లు, అరటి ఆకులు, నోట్ బుక్స్ తయారీ మొదలగు వివిధ పనుల గురించి మానసిక దివ్యాంగులకు శిక్షణ అందించి, వారికి ఉపాధి కల్పించడం జరుగుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత,మనో చైతన్య మానసిక వికలాంగుల కేంద్రం ప్రెసిడెంట్ డి.కృష్ణ కుమార్, సిడిపిఓ స్వరూప రాణి, తబితా అనాధాశ్రమం సిసి ఆర్గనైజర్ వీరేందర్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బైంసా మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/బైంసా:** మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు.బుధవారం ఎంపీపీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు.భారీ వర్షాలతో సిరాల ప్రాజెక్టు దెబ్బతిందని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో,ప్రస్తుత ఇరిగేషన్ మంత్రి దగ్గరికి పలుమార్లు వెళ్లడంతో 9 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని ఆరు నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో ప్రజలకు వ్యాధుల ప్రమలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామాల్లో పరిశుభ్రత,డ్రైనేజీ వ్యవస్థ,రోడ్ల వ్యవస్థ బాగుండేలా చూడాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు.అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో సభ్యులు పలు అంశాలను ప్రస్తావించగా ప్రమాదవశాత్తు ఉన్న విద్యుత్ తీగలను తక్షణమే సరి చేయాల్సిందిగా విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ కనెక్షన్లను ఇవ్వాలన్నారు.మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో తగునీటి సమ స్య రాకుండా చూడాలన్నారు. ఎంపీపీ, ఎంపిటిసిల పదవీకాలం ముగిస్తున్న తరుణంలో ఐదు సంవత్సరాల పాటు సేవలు అందించిన వారిని అభినందించడంతో పాటు, మరోసారి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై సేవలందించాలని ఆకాంక్షించారు. సమావేశంలో జడ్పిటిసి దీప సొలంకి భీమ్రావ్,తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, మండల విద్యాధికారి సుభాష్,పిఏసిఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి,వైస్ ఎంపిపి సర్సారెడ్డి,ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

## పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### పలు పనులపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి** పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు.కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వ పథకాల ద్వారా జిల్లాలో మం జూరైన పనుల వివరాలు ఇప్పటి దాకా ఎన్ని మం జూరు అయ్యాయి. ఎన్ని పూర్తి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పథకం కింద ఎన్ని గ్రామ పం చాయతీ భవనాలు నిర్మించారు. ఇంకా ఎన్ని పెం డింగ్ ఉన్నాయి?, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద విద్యాలయాల్లో ఎన్ని ప నులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్‌శాఖ కింద మొ దలు పెట్టిన , ఇతర నిర్మాణ పనులలో వేగం పెంచి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో పంచాయతీరాజ్ శాఖ ఈఈ సూర్య ప్రకాష్, డీ.ఈ.లు.శ్రీనివాస్, సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, పవన కుమారి, ఏఈలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

### బోథ్ సిఐ రమేష్



**ప్రజాపక్షం/బోథ్ :** మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోథ్ సిఐ రమేష్ పిలుపు నిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం పై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గాను బుధవారం బోథ్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్ళిన యువకులు అనేక మంది మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని అన్నారు. గంజాయి సాగు చేసే వారికి శిక్ష తప్ప క ఉంటుందని కొంత మంది తమ పంట చేలలో గంజాయిని సాగు చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. గంజాయి సాగు చేసినట్లయితే కేసుల్లో ఇరుక్కొని కోర్టులో తిరగాల్సి వస్తుందని అంతేగాకుండా ప్రభుత్వ పరంగా వివిధ పథకాలు అందకుండా పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎస్ఐ బి.రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్, విడిసి చైర్మన్ జి. గంగాధర్, సామాజిక సేవకులు మాసం అనిల్, ఎంపిడిఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి :** నిర్మల్ జిల్లాను మా దకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్య లు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జా నకి షర్మిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ,నిర్మల్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అన్నారు.మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని,దీని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.డ్రగ్స్ సరఫరా చేసే వారిని గుర్తించి బాధ్యతగా పోలీసులకు సమాచారం అం దించాలని సూచించారు.డ్రగ్స్ బారిన పడకుండా యువతకు కుటుంబ సభ్యులు అవగాహనా కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలకు యువత బానిసై జీవితాలను కోల్పోతున్న తరుణంలో మాదక ద్ర వ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు,వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రా మీణ, పట్టణ ప్రాంతాలు,ఉన్నత పాఠశాలలు,కళాశాలలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత మత్తు పానీయాలు,సిగరెట్లు,గుట్కాలు,గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,పౌరులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మదకద్రవ్యాల అమ్మకం, రవాణా,వాటి మూలాలు ఎక్కడున్నాయనే వాటి పైన ఉక్కుపాదం మోపుతామన్నారు. అవి అమ్మిన,సరఫరా చేసినవెంటనే పోలీస్ శాఖ నెం.8712671111లేదాటోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ 14446కుసమాచారం అందించాలని కోరారు. యువత మత్తుకు బానిస కావద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు,రెవెన్యూ అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలన మన బాధ్యత

**రామగిరి :** మాదక ద్రవ్యాల నిర్ముల న లో ప్రతి ఒక్కరు భాగస్వా ములు కావాలని ఇది మన ందరి భాధ్యతగా గుర్తించాలని కమాన్‌పూర్ ఎస్.ఐ చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కమాన్ పూర్ మం డల కేంద్రంలో బుధవారం కమాన్ పూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోకమాన్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహిం చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కమాన్ పూర్‌ఉన్నత పాఠశాల నుండి స్థానిక బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం చుట్టూ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యల నిర్ములనకై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే అగ్నిపథ్ రద్దుచేయాలి



ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగేందర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** నిరుద్యోగ యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక బస్టాండ్ చౌరస్తాలో ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా యుగేందర్ మాట్లాడుతూ దేశంలో అత్యంత కీలకమైన రక్షణ వ్యవస్థకు తూట్లు పొడిచేందుకే మోదీ ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో ఇప్పటికే కుటుంబసభ్యులను విడిచి దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవానుల ఆత్మలు గోషిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నయవంచన చేయడంలో కేంద్ర భారత రక్షణ వ్యవస్థ పటిష్టం కోసం, త్యాగాలతో కూడిన ఆర్మీ కావడం కోసం అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దుచేసి జాతీయ స్థాయిలో సమగ్ర జాతీయ యువజన విధానం ప్రకటించాలని యుగేందర్ డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచల మురళి, భాస్కర్, వంశీ, శేఖర్, ఫిరోజ్ భాయ్, నరేందర్, వినయ్, నగేష్, శ్రీమాన్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి హైర్ బస్‌డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** టిజి ఆర్‌టిసి హైర్ బస్ డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం డిపో ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భం గా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అప్పటి వరకు హైర్ బస్ డ్రైవర్ అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిజి ఆర్‌టిసి ప్రైవేట్ బస్ డ్రైవర్స్ యూనియన్ ఎఐటియుసి ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫీ, కోశాధికారి సాయికృష్ణ, కార్మికులు అంజి, నానాజీ, సంతోష్, విజయ్, కృష్ణ, మొండి, వినోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజ్‌పై విచారణ జరపండి

కేంద్రమంత్రి రాజీనామా చేయాలని ఎఐవైఎఫ్ నిరసన



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రప్రభుత్వ పరిధిలో నిర్వహించిన నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి కారకులైన వారిని శిక్షించాలని, ఆ ఫలితాలను రద్దు చేసి, తిరగి పరీక్షలు నిర్వహించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తీరుపారి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు పాల్గొన్న విద్యార్థుల భవితవ్యం లీకేజీతో మంట కలిపారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీట్ అర్హత పరీక్షలను ఆయా రాష్ట్రాలకి అప్పగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి షరీఫ్, ఉపాధ్యక్షులు గద్దం నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పులికరం ఆంజనేయులు, రాజు, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

## ఆపరేటర్ల బదిలీలను యాజమాన్యం ఉపసంహరించుకోవాలి : ఎఐటియుసి



**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :** ఉపరితల గనులలో పని చేసే ఇపి ఆపరేటర్లను డిప్యూటేషన్‌పై మణుగూరుకు బదిలీ చేయాలని జారీ చేసిన సర్క్యులర్‌ను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒసిపి ప్రాజెక్ట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్ నుండి ఐదుగురు చొప్పున ఆరు నెలలు డిప్యుటేషన్ పేరుతో మణుగూరు ప్రాంతానికి బదిలీ చేయడానికి ఏకపక్షంగా జారీ చేసిన సర్క్యులర్ ను వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని ఏరియాల నుంచి ఇపి ఆపరేటర్లను బదిలీ చేయడం పట్ల కార్మికులు అసంతృప్తిగా ఉన్నారని, కార్మికులు వారి పిల్లలకు స్కూల్స్, కాలేజీలలో అడ్మిషన్స్ తీసుకున్నారని, ఉన్న పలంగా బదిలీలు చేయడం మూలంగా చదువుల పైన ప్రభావం పడుతుందని అన్నారు. గతంలో శ్రీరాంపూర్ ఒపెన్ కాస్ట్‌లో యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఇపి ఆపరేటర్లు చేసిన కృషిని యాజమాన్యం మరువద్దని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శి మోతే లచ్చన్న, నాయకులు బుచ్చయ్య, సతీష్, శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరుంధతిరాయ్‌పై 'ఉపా' కేసు ఎత్తివేయాలి

ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రఖ్యాత సామాజిక కార్యకర్త అరుంధతి రాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్‌షౌకత్ హుస్సేన్‌లపై ఢిల్లీ పోలీసులు పెట్టిన ఉపా కేసులు తక్షణం ఎత్తి వేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ సెమినార్ హాలులో 'అరుంధతి రాయ్‌పై ఉపా కేసు– వాస్తవాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. విద్యార్థి నాయకుడు, రీసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్యవక్తగా హాజరై మాట్లాడుతూ అరుంధతిరాయ్ రచయిత్రిగా దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలపైన నిరంతరం తన కలం గళంతో దేశీయ అంతర్జాతీయ వేదికలపైన పాల్గొన్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడి అసాధారణమైన రచయిత్రిగా పాల్గొనమే కాకుండా ఆమె రచనలను ప్రపంచంలో 45దేశాల భాషలకు అనువదించారని.. దేశంలోనే 'బుకర్ ప్రైజ్' పొందిన మొట్టమొదటి మహిళా రచయిత్రిగా చరిత్ర సృష్టించారని హరగోపాల్ అన్నారు. వాకింగ్ విత్ కామ్రేడ్స్, బ్రోకెన్ రిపబ్లిక్ లాంటి రచనలు చేసి బడా పెట్టుబడిదారుల దోపిడీని ప్రశ్నించిందన్నారు. 'నర్మదా బచావో' ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదాన్ని తన రచనల ద్వారా తీవ్రంగా విమర్శించిందని తెలిపారు. ఈ క్రమంలోనే 2010 అక్టోబర్ 21వ తేదీన ఢిల్లీలో జరిగిన 'ఆజాదిది ఓన్లీ వే' అనే సదస్సులో జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి ఉన్న స్వయంప్రతిపత్తి అక్కడ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై ఆమె ఆ సదస్సులో విస్తృతంగా చర్చించిన కారణంగానే పలు కేసులు నమోదయ్యాయన్నారు. ముఖ్యంగా ఆమెపై రూట్స్ ఇన్ కాశ్మీర్ సంస్థ సభ్యుడు సుశీల్ పండిట్ ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు అరుంధతి రాయ్‌ని ప్రశ్నించి ఆ సదస్సులో ఎందుకు పాల్గొన్నావంటూ ఆమె పైనా, ఇతరులపై ఉపా కేసు నమోదు చేశారని, మళ్లీ 14 సంవత్సరాల అనంతరం అలాంటి ఉపాకేసుతో ఇప్పుడు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణ కు అనుమతి ఇవ్వడం ఏంటని విమర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్, విద్యార్థి నాయకుడు రీసర్చ్ స్కాలర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ అరుంధతిరాయ్ ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుతుందని కాబట్టి ఆమెపైన ఉపా కేసు కేంద్రప్రభుత్వం పెట్టిందని దానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీధర్, విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పెంచాల సతీష్, వలిగొండ నరసింహ, తాళ్ల అజయ్, రవినాయక్, సుమంత్, శ్రీనివాస్, అజయ్, భగత్, పవన్, అశ్వన్, రమేష్, కోటి, రుక్మత్ పాషా, వికాస్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణికే తెలంగాణ బొగ్గు బ్లాక్‌లు

ఎఐటియుసి వినతి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం వేయడాన్ని విరమించుకోవాలని, తెలంగాణ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతర సతీష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మోటపలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బొగ్గు గనుల ప్రైవేటీకరణ, బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే 60 సింగరేణి బ్లాకులను వేలం వేయడానికి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో శ్రావనపల్లి ఓసిని వేలం వేయడానికి సిద్ధపడిందని ప్రైవేటీకరణ సింగరేణి మనుగడకు గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ చేయడం వల్ల అనేకమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడతారన్నారు. రాష్ట్రం నుండి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ప్రైవేటీకరణ అడ్డుకోవడం లేదని విమర్శించారు. బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు పరం చేస్తే సింగరేణిలో ప్రమాదంలో పడబోతుందన్నారు. ఎంతోమందికి జీవనోపాధిని కల్పిస్తున్న సింగరేణి సంస్థను రక్షించుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మకు అందించారు. ధర్నాలో సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, మాతంగి రామచందర్, నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్, ఎండి ఆసిఫ్ పాషా, రవి కుమార్, నూకల చంద్రమౌళి, ఎల్ శంకర్, పి.శ్రీనివాస్, దోర్నాల తిరుపతి, ఎంరమేష్ ఎండి కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.




# సామాన్యులకు కూర'గాయాలు'



## నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలి

సిపిఐ ఆధ్వర్యంలో నిరసనలు

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం హన్మకొండ అంబేద్కర్ జంక్షన్‌లో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన నెలరోజులుగా సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు నిత్యావసరాలు, కూరగాయాల ధరలతో అల్లాడుతున్నారన్నారు. ధరలు ఆకాశన్నంటి సామాన్యులు ఇబ్బందులు పడుతున్న పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారం అవుతున్నదన్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని, టమాట, పచ్చి మిర్చి కిలో రూ.100కు చేరుకున్నాయని, ఉల్లిగడ్డ కిలో రూ.50కి చేరిందన్నారు. గడిచిన వారం పది రోజులలోనే ధరలు అమాంతం పెరిగినా పాలకులు చోద్యం చూస్తున్నారన్నారు, పేదలు, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగినా ప్రభుత్వాలు ధరలను నియంత్రించే చర్యలు చేపట్టడం లేదన్నారు. పెరిగిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. బ్లాక్‌మార్కెట్ దారులు, దళారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ధరలు పెరిగేందుకు కారణమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మద్దెల ఎల్లేష్, కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, కామెర వెంకటరమణ,కండె నర్సయ్య,పూర్ణ చందర్ పాల్గొన్నారు.




**వరంగల్ ప్రతినిధి :** పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐజిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో పెంచిన నిత్యాసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయాలు, ఉప్పులు, పప్పులు, నూనె ధరలు రోజు రోజుకు ఆకాశానికి అంటుతున్నాయని, రెక్కాడుతూడోకాడని నిరుపేదలు వాటిని కొనలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు నిత్యావసర వస్తువులు ధరలు తక్షణమే తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, నాయకులు కాశీం పరికరాల రమేష్, జన్ను రవి, మేడిది అశోక్, రాయల, బచ్చల స్వప్న, కోయడ మనోహర్, బొల్లెస్వామిల్, రాజేష్, విక్టోరియా, రేణుక, నజీమా, వసంతలక్ష్మి పాల్గొన్నారు. వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ వద్ద పెరిగిన ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి షేక్ బాషామియా, ఖిలా వరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, తాళ్లపల్లి జాన్‌పాల్, ఎండి అక్బర్ పాష, సువర్ణ, రాజేందర్,జన్ను రాజు, రమేష్ కుమార్, శంషోద్దిన్, ఎడ్ల రాజు, భిక్షపతి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు

జూలై 8న రైతు సంఘం జిల్లా మహాసభ
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాచలం :** రైతాంగ సమస్యల పరిష్కానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పేర్కొన్నారు. జూలై 8న దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో జరిగే రైతు సంఘం జిల్లా రెండవ మహాసభల సన్నాహక సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ అధికారం దర్పంతో బిజెపి దేశంలో ఇష్టానుసారంగా వ్యవహరింస్తుందన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతుల నెత్తిమీద నల్ల చట్టాలను రుద్ది వారి మనుగడును తుడిచిపెట్టేందుకు కుట్రలు చేస్తుందన్నారు. హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న రైతులను దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో అనేకమంది రైతులు బిజెపి మూలంగా ప్రాణాలు కోల్పోయారన్నారు. ఫలితంగా మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా రైతులు బిజెపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. తిరుగులేని శక్తిగా ఉన్నామంటూ విర్రవీగిన వారు సొంతగా ప్రభుత్వానికి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితికి దిగజారారని చెప్పారు. మతతత్వాన్ని ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నించిన ఎవ్వరికైనా గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్రంలో తమకు ఎదురులేదని చెప్పిన బిఆర్‌ఎస్ నేడు మనుగడ కోల్పోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయిందన్నారు. కొన్ని పరిస్థితుల్లో ఐఖ్యతను కోల్పోవడం వల్ల ఇండియా కూటమికి సీట్లు తగ్గాయని, అయినప్పటికీ పార్లమెంట్ లోపట, బయట బలమైనశక్తిగా మారిందని చెప్పారు. డిసెంబర్ 25 నాటికి సిపిఐ ఆవిర్భవించి వందేళ్లవుతుదని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి త్యాగాలతో కూడిన పోరాటాలు చేసినట్లు చెప్పారు. పదవులు ఉన్నా లేకున్నా... ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండాలు నిరంతరం సజీవంగా ఉంటాయని చెప్పారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 8న తల పెట్టిన జిల్లా రైతు సంఘం మహా సభను జయప్రదం చేయాలన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి బ్రహ్మం మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు పాలకులు కృషి చేయాలన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ రైతుకు మేలు చేయాలని, కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బ్యాంకుల్లో రూ.2 లక్షల రుణం ఉన్న ప్రతీ ఒక్కరికీ మాఫీ వర్తింపజేయాలన్నారు. పోడుభూముల సమస్యలు పరిష్కరించి గిరిజన రైతులను ఆదుకోవాలని, రైతుభరోసా పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్ర నరేంద్ర, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్,సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్, రైతుసంఘం గౌరవఅధ్యక్షులు సరెడ్డి పుల్లారెడ్డి, బికెఎంయు జిల్లా సహాయ కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కిలిమి ఎల్లారెడ్డి, మందపాటి సుధాకర్ రెడ్డి, ఏపూరి వెంకటేశ్వరరావు, చిరుమామిడి వెంకటేశ్వరరావు, నూపా తిరుపతి, నూపాపోతయ్య, పాలంచ రామారావు, కుంజా నూకరత్నం, పొడియం ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



## లింక్ కాలువను పూర్తి చేయండి

సిపిఐ బృందం వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సీతారామ ప్రాజెక్టు పరిధిలోని ఏన్కూరు వద్ద నుంచి నాగార్జున సాగర్ ఎడమ కాలువను కలిపే లింక్ కెనాల్‌ను త్వరగా పూర్తి చేయాలని సిపిఐ ప్రతినిధి బృందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం సిపిఐ ప్రతినిధులు లింక్ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ లింక్ కాలువను త్వరితగతిన పూర్తి చేస్తే సాగర్ రెండవ జోన్ ఆయకట్టుతో పాటు మధ్యతరహా ప్రాజెక్టులైనా వైరా, లంకా సాగర్, ఇతర చెరువులు, కుంటల కింద సాగు భూములకు నీటి ఇబ్బంది తప్పుతుందని ఆయన తెలిపారు. సాగర్ ఎడమ కాలువ రెండవ జోన్ పరిధిలో రైతులు నీటి ఎద్దడి కారణంగా ప్రతి యేటా నష్టపోతున్నారని ఆయన తెలిపారు. కృష్ణా నది పై ఎగువన ప్రాజెక్టులు కట్టడం నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీరందించే విషయంలో ఆశలు సన్నగిల్లుతున్నాయని హేమంతరావు తెలిపారు. గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్న కారణంగా సీతారామ ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేస్తే ఉమ్మడి ఖమ్మంజిల్లాకు ఉపయోగం జరుగుతుందని ఆయన తెలిపారు. బృందంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, నాయకులు శింగు నర్సింహారావు, ఏపూరి బ్రహ్మం తదితరులు ఉన్నారు.



## పలుజిల్లాల్లో భారీవర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, భువనగిరి, హైదరాబాద్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూలు జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు వీస్తాయన్నారు. గురువారం నుంచి శుక్రవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయన్నారు. పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

## కొంప ముంచుతున్న అత్యాశ..!

(మొదటి పేజీ తరువాయి)

వేలాది మంది బాధితుల నుంచి వందల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి వీరంతా ఇటీవలే బిచాణా ఎత్తివేశారు. ఈ సంస్థలు సుమారు నాలుగు వందల కోట్ల మేర టోకరా వేశారు.

**బాధితుల్లో పించన్‌దారులే ఎక్కువ..** ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో, వచ్చిన పించన్ డబ్బులను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఆయా సంస్థల్లో రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకు డిపాజిట్లు చేశారు. నెలనెల వచ్చేవడ్డీతో ఇల్లు గడపవచ్చని కొందరు. పిల్లల పెళ్లిల కోసం, పిల్లల ఉన్నత చదువులు కోసం, ఇల్లు ఖరీదు చేసేందుకు, వ్యాపారం పెట్టుకునేందుకు ఇలా పలు కారణాలతో ఆశపడి డిపాజిట్లు చేస్తున్నారు. డిపాజిట్లు చేసేవారంతా విద్యావంతులే. బిచాణా ఎత్తివేసిన ఆయా కంపెనీల గురించి విన్న వారే. అయినా అధిక వడ్డీ అనే సరికి అత్యాశకు వెళ్లి నిండా మునిగిపోతున్నారు.

**రీకవరీ నామమాత్రమే..** నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి డబ్బులు రికవరీ చేయడం తలకు మించిన భారంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే ప్రసక్తె లేదు. పోలీసులు నిందులను ఎన్నిసార్లు ప్రశ్నించినా.. జల్సాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేశామని, తమ వద్ద డబ్బులు లేవని, తాము కూడా ఇతర కంపెనీలు, ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయామంటూ నిందితులు చెబుతున్న మాటలు. రివకరీలో నిందితులు ఇలా పలు కారణాలు చెప్పి చేతులెత్తేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు.

**ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష: సిసిఎస్ డిసిపి శ్వేత**

ఇలాంటి కేసుల్లో బాధితులంతా విద్యావంతులు, సమాజం పట్ల అవగాహన కలిగిన వారే ఎక్కువగా ఉన్నారని సిసిఎస్ డిసిపి ఎన్.శ్వేతరెడ్డి అన్నారు. ఎవరైనా అధిక వడ్డీ ఇస్తామంటే నమ్మవద్దని, అత్యాశకు వెళ్లకూడదని, ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులలోనే డిపాజిట్లు చేయాలని సూచించారు. ప్రైయివేటు సంస్థల్లో డిపాజిట్లు పెట్టుముందు వాటి నిజస్వరూపాలు తెలుసుకోవాలన్నారు.అధిక వడ్డీ ఆశ చూపే సంస్థల గురించి తమకు ముందుగానే సమాచారం ఇస్తే పరిశీలిస్తామన్నారు. డిపాజిట్ దారులు ఎవరికి వారు ముందు జాగ్రత్త వహించడం శ్రీరామ రక్ష అని తెలిపారు. తీర నష్టపోయాక రికవరీ కోసం పోలీసులపై లేనిపోని అభాండాలు వేయడం సరికాదన్నారు. బాధితులకు నూటికి నూరు శాతం న్యాయం చేయాలనే ఆలోచన ఉంటుందని, ఏదిఏమైనా చట్టపరిధిలోనే చేస్తామన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిగా జీవన్‌రెడ్డి?

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ పదవీకి రాజీనామా చేయాలని పెద్దాయన డిసైడ్ కావడం సంచలనం సృష్టించింది. తన ప్రత్యర్థి ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకుని తనను అగౌరపరిచారని విలువలు లేని రాజకీయాలు అవసరం లేదని పార్టీలో కొనసాగుతూనే గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూస్తానని పేర్కొనడంతో కాంగ్రెస్ అధిష్టానం జీవన్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించి చర్చలు జరిపింది. జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కేసి వేణుగోపాల్, ఢిల్లీలో ఉన్న సియం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌లను జీవన్‌రెడ్డితో పాటు పిలిపించింది. సోనియాగాంధీ ఈవిషయంలో జోక్యం చేసుకుని రాష్ట్ర కాంగ్రెస్‌నేతలతో కలిసి జీవన్‌రెడ్డి విషయమై చర్చించి ఆయనకు టిపిసిసి అధ్యక్ష పదవీ కట్టబెట్టాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని టిపిసిసి అధ్యక్షుడిగా నియమించి ప్రభుత్వపరంగా ఆయన సేవలను వినియోగించుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతొంది. అన్నిశాఖలపై పూర్తిస్థాయిలో పట్టున్న నేపథ్యం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి విషయంలో జీవన్‌రెడ్డి సూచనలు, సలహాలు ప్రభుత్వానికి చాలా అవసరమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డి పరాజయం చెందిన నిత్యం ప్రజా జీవితంలో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ముందుంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దృష్టిని ఆకర్శించారు. సిఎంకు సన్నిహితంగా ఉండడం, ఎమ్మెల్సీ గా కొనసాగుతుండడం మంత్రి పదవికి అర్హతలు ఉన్నా, ఎమ్మెల్యే, ఎంపిగా ఓడిపోవడం, రెడ్డి సామాజికవర్గంలో కేబినేట్ బెర్తుల కోసం తీవ్ర పోటీ ఉన్న నేపథ్యం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు మంత్రి వర్గంలో ఉండడం జీవన్‌రెడ్డికి ప్రతికూల అంశాలుగా మారాయన్న అభిప్రాయాలు పార్టీలో వ్యక్తం అవుతున్నాయి. జీవన్‌రెడ్డి రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ పదవీ లేదా ఆయన హోదాకు తగ్గ ఉన్నత పదవీ కట్టబెట్టి ప్రభుత్వ పార్టీ అంతరంగిక విషయల్లో ఆయన సేవలను వినియోగించుకోవాలని సోనియాగాంధీ ఆలోచన చేస్తున్నట్లు, ఈవిషయంపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు జరిపారని కాంగ్రెస్‌వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## కల్కి.. ఒక్కో టికెట్ రూ.2,300



ప్రజాపక్షం/హైదరాబాద్: పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఎడి' నేడు విడుదల కానుంది. ఆన్లైన్లో టికెట్లు పెట్టిన క్షణాల్లోనే అమ్ముడయ్యాయి. ఏపీ, తెలంగాణలోనే కాదు ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచుస్తున్నారు. అయితే ముంబైలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మైసన్ ఐనోక్స్‌లోని జియో వరల్ ప్లాజా ఒక్కో టికెట్ రూ.2,300కి విక్రయిస్తోంది. మరికొన్ని థియేటర్లలో ఫ్యాన్స్ రూ.1,760, రూ.1,560 వెచ్చించి మరీ టికెట్లు కొంటున్నారు.

## రాహుల్‌ను ప్రధాని చేసిఉంటే ఐటిఐఆర్‌ను తెచ్చే వాళ్లం

### కాంగ్రెస్ నేతలు విహెచ్, జగ్గారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాహుల్ గాంధీని ప్రధాని చేసి ఉంటే..తామే ఐటిఐఆర్‌ను తెచ్చే వాళ్లమని కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ ఎంపి వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఐటిఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటామన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి..బండి సంజయ్‌లను కలిసి వినతిపత్రం ఇస్తామని వెల్లడించారు. కేంద్రంలో ప్రతిపక్ష పార్టీగా మా బాధ్యత మేము నిర్వహిస్తామని, అధికార పార్టీగా ఐటిఐఆర్ మంజూరు చేయండని నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐటిఐఆర్ మంజూరు చేసినప్పుడు రఘునందన్‌రావు అప్పట్లో బిఆర్ఎస్‌లో ఉన్నారన్నారు.

## కిరాణషాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు : సిఐ కాంతారెడ్డి



ప్రజాపక్షం/షాబాద్ : కిరాణషాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని షాబాద్ సిఐ కాంతారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని నాంన్‌ధార్‌ఖాన్ పేట్ గ్రామానికి చెందిన గంగాపురం మల్లేష్ కిరాణషాపుల్లో మద్యం అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తన పోలీస్ సిబ్బందితో వచ్చి షాపును తనిఖీ చేశారు. షాపులో 21 బీరు బాటిళ్లు ఉన్నట్లు తెలిపారు. షాపు యజమాని మల్లేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిరాణషాపులు నిర్వహిస్తు అక్రమంగా మద్యం విక్రహించడం చట్టరీత్యా నేరం అన్నారు. కిరాణషాపుల్లో మద్యం అమ్మితే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ప్రజాపక్షం/యాచారం : మండల సహకారసంఘం అభివృద్ధికి నిధులు కేటాయించి ఆదుకోవాలని మండల సహకార సంఘం చైర్మన్ తోటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి జిల్లా సహకార సంఘం చైర్మేన్ కొత్తకుర్మ సత్తయ్యను కోరారు. బుధవారం యంజాల్ లోని తులిఫ్స్ గ్రాండ్ హోటల్‌లో సహకార సంఘం చైర్మేన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాజేంధర్‌రెడ్డి మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు స్వల్ప కాలిక, ధీర్ఘకాలిక ఋణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. యాచారం మండల సహకార సంఘాన్ని లాబాల బాటలో నడిపించడానికి కృషి చేస్తున్నామని చైర్మన్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో సహకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో సమస్యలకు పరిష్కారం



ప్రజాపక్షం/నార్సింగి: నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్ 5వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్,వైస్ చైర్మన్ జి.విజయ్ బాబు, కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి,కౌన్సిలర్లు శివారెడ్డి, దుర్గేష్ యాదవ్‌లతో కలిసి బుధవారం పర్యవేక్షించి స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.ఆయా విభాగాల అధికారితో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటైజర్ ఇంచార్జ్ లచ్చిరాం, సానిటేషన్ సూపర్వైజర్ మైపాల్, శేఖర్, అనిల్, సంజయ్, సంప్రిత్ పాల్గొన్నారు.

## రోడ్లతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి



ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామీణ ప్రాంతాల రోడ్లతోనే పల్లెసీమలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని కొత్తూరు ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లాపూర్ ఎస్సీవాడ, మల్లాపూర్ తండాలో నూతనంగా వేసిన సిసిరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. సిసి రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేయడంతోపాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, మాజీ ఉప సర్పంచులు దశరథ్‌నాయక్, నర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్, జయేందర్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూళ్ళు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: అధిక ఫీజులు వసూళ్ళు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎబివిపి శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్లెం సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలలు ఒక్కొక్క విద్యార్థిపై వేల రూపాయల ఫీజులను పెంచడమే కాకుండా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అంటూ అక్రమంగా వసూళ్ళు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సర్కారు బడుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో భాను, జగదీష్, నవీన్, మహేందర్, సాయి, ఓంప్రకాష్, శ్రీధర్, అక్షయ్, ప్రణీత్, అమరేందర్, శరత్ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకు కృషి



### తెలంగాణ ఉద్యమంలో.. బల్దియా కార్మికుల పాత్ర మారువలేనిది

### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమంలో జిహెచ్ఎంసి ఉద్యోగుల పాత్ర మారువలేనిదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జిహెచ్ఎంసి ఉద్యోగులు, కార్మికులకు అమలు కావాల్సిన హక్కులు అమలు కాలేదన్నారు. మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ 75 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాటాల ద్వారా కృషి చేయడం అభినందనీయమని ప్రసంశించారు. (ఐఎన్‌టియుసి అనుబంధం) ప్లాటినం జూబ్లీ(75వ) వేడుకలు జూబ్లీ వేడుకలు బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో భారీ బహిరంగసభ జరిపారు. ఐఎన్‌టియుసి ఆల్‌ఇండియా సెక్రటరీ, మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కోదండరామ్‌తో పాటు తెలంగాణ ప్రాణాళిక సంఘం వైస్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, మాజీ ఎంఎల్‌సి రాములునాయక్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ్‌రెడ్డి, ఐఎన్‌టియుసి ఉపాధ్యాక్షులు జనక్ ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ పదేళ్లకాలంలో కనీసం కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపనపోలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిహెచ్ఎంసి ఉద్యోగుల సమస్యలను వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ప్రస్తావించారు. యూనియన్ ఎన్నికల అంశం కార్మిక శాఖ పెండింగ్‌లో ఉందని తెలిపారు. కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందచేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులతో సమానంగా 125 చదరపు గజాల స్థలం ఇవ్వాలని కోరారు. సకాలంలో పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, 1 జనవరి 2024న లేదా ఆ తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆదిల్ షరీఫ్ కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి సీనియర్ సెక్రటరీ బాబర్ సలీమ్ బాషా, ఉపాధ్యాక్షుడు విజయ్ కుమార్ యాదవ్, కె.శివ కుమార్, మెర్సీ, టిపిసిసి లేబర్ చైర్మన్ ప్రకాష్ గౌడ్, ఎఐఎల్ఎల్‌సి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.నర్సింహాన్, మోజెస్, ఎవిఎస్ గాంధీ, జి.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం దొంగల పట్టివేత

ప్రజాపక్షం/కేశంపేట: బంగారు ఆభరణాలు దొంగించిన దొంగలను పట్టుకున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు. ఈనెల 19న జయమ్మ తన పొలంలో పనులు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడును తెంపుకుని పారిపోయాడు. భాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సోమ నరేష్ అతని భార్య బైండల్ల బిందుగా గుర్తించించారు. నరేష్, బిందులను అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు తెలిపారు.

## నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరానికి నీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్2లోని కోదండాపూర్ పంప్ హౌజ్‌లో రెండో పంపు ఎన్‌ఆర్‌వి వాల్వ్ మరమ్మతులకు గురైంది. దాంతో నీటి సరఫరా అత్యవసరంగా నిలిపి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో అటు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే, యథావిధిగా నీటి సరఫరాను జలమండలి అధికారులు పునరుద్ధరించనున్నారు. మరమ్మతు పనుల కారణంగా జలమండలి ఓ అండ్ ఎం డివిజన్లు 2, 3, 4, 5, 7, 9, 10(ఎ), 10(బి), 13, 14, 16, 20 పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం, శుక్రవారం తాగునీటి సరఫరాలో కొన్నిచోట్ల పూర్తి అంతరాయం ఏర్పడుతుందని, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షిక అంతరాయం ఏర్పడుతుంది. ఇక పలు ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీరు సరఫరా కానుంది. దీంతో ఎన్‌పిఏ, మిరాలం, బాలాపూర్, మైసారం, బార్కాస్ భోజగుట్ట, ఆళ్లబండ, మేకలమండి, భోలక్‌పూర్, చిలకలగూడ, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎమ్ఈఎస్, కంటోన్మెంట్, ప్రకాష్ నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట్, ఫిరోజ్‌గూడ, గౌతమ్ నగర్, వైశాలి నగర్, బి.ఎన్.రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కపురి కాలనీ, మహీంద్ర హిల్స్, ఏలుగుట్ట, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిల్కానగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్ తదిరత ప్రాంతాలకు నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుంది.

## జిహెచ్ఎంసి అధికారులను దుర్భాషలాడిన ఎంఐఎం ఎమ్మెల్యే

ప్రజాపక్షం/హైదరాబాద్ : బల్దియా అధికారులతో బహదూర్‌పుర ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ దురుసుగా ప్రవర్తించారు. స్థానికంగా ఉన్న ఓ ప్రార్థనా మందిరం సమీపంలో రోడ్డుపనులు ఆలస్యం కావడంపై తీవ్రంగా స్పందించారు. సంబంధిత అధికారి ఇక్కడికి వచ్చి పనులు చూసే తీరిక లేదా అంటూ నోటికి వచ్చినట్లు తూలనాడారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ తెలిపారు.బుధవారం నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో శ్రీకోట మైసమ్మ దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రంగాపూర్ గ్రామంలో ఉన్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవాలయానికి తనకు ఎంతో అనుబంధం ఉందని, దాంతో నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండేందుకు కృషి చేయాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ రామేష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, జింకల చంద్ర, తులసిరామ్, జటావత్ రాజునాయక్, మండల అధ్యక్షుడు జంగ నర్సింలు, ఎంపిటిసిలు కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, జ్ఞానేశ్వర్, రాధాకృష్ణ, తోట మహేందర్, కల్వకోల్ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆమ్రపాలి కాట బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆమ్రపాలి కాట బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఐఎఎస్‌ల బదిలీల నేపథ్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను ప్రభుత్వం ఇంధ న శాఖ కార్యదర్శిగా బదిలీ చేసిన విషయం తెల్సిందే. ఆయన స్థానంలో ఆమ్రపాలి కాటకు జిహెచ్ఎంసి కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం నియమించింది. రోనాల్డ్‌రోస్ నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు.

### జిహెచ్ఎంసి ఇవిడిఎం డైరెక్టర్‌గా ఎవి రంగనాథ్



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిహెచ్ఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా నియమించిన ఎవి రంగనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌ను మార్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు.

### రోనాల్డ్ రాస్ బాధ్యతల స్వీకరణ



ఇంధన శాఖ కార్యదర్శిగా రోనాల్డ్ రోస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంధనశాఖ కార్యదర్శితో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్ బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియచేసింది. అభినందనలు తెలిపిన వారిలో స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఇంచార్జి ప్రెసిడెంట్ ఏ.వెంకట్ నారాయణరెడ్డి, సెక్రటరీ జనరల్ పి.సదానందం, కే.కిరణ్‌కుమార్, గోపాల్‌క్రిష్ణ, శ్యామ్ సుందర్‌రెడ్డి, పివీ రావు, మల్లయ్య, విద్య సాగర్, కే. వెంకటేష్, ప్రశాంత్, రాజు ఉన్నారు.

### జలమండలి ఎండిగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌రెడ్డి



జలమండలి ఎండిగా అశోక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సుదర్శన్‌రెడ్డి నుండి బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఎండిగా కొనసాగిన సుదర్శన్ రెడ్డి సాధారణ పరిపాలన శాఖకు బదిలీ అయిన విషయం తెల్సిందే. సుదర్శన్ రెడ్డి గతేడాది డిసెంబరు 18న జలమండలి ఎండిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు 7 నెలల పాటు ఆయన పనిచేశారు.

# సెంట్రల్ జైల్‌గా సెంట్రల్ యూనివర్సిటీ

### విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపణ




ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/శేరిలింగంపల్లి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కొద్దికాలంగా సెంట్రల్ జైల్‌గా మారిందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం హెచ్‌సియు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు అతీక్ అహ్మద్. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఇంటి ముందు ధర్నా చేశారని, న్యూసెన్స్ క్రియేట్ చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఐదుగురు విద్యార్థులను 6 నెలల పాటు సస్పెండ్ చేసి, మరో ఐదుగురు విద్యార్థులకు పదివేల రూపాయల చొప్పున ఫైన్ విధించారు. మరి కొంతమంది విద్యార్థుల మీద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పట్టారు. వారికి మద్దతుగా హెచ్‌సియూ ప్రధాన గేట్ వద్ద ఆందోళనకు దిగిన విద్యార్థులు విసికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐహెచ్ సియు ఎలక్టెడ్ ప్రెసిడెంట్ అతీక్ అహ్మద్ మెయిన్ గేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బిజెపి,ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలకు అడ్డాగా మారిందని విమర్శించారు. బిజెపి దాని అనుబంధ సంఘాల నాయకులు ఏది చెబితే ఇక్కడ అదే జరుగుతుందని ఆరోపించారు. అందులో భాగంగానే మా మీద కేసులు, వెలివేతలు జరుగుతున్నాయని చెప్పారు. అడ్మినిస్ట్రేషన్ అక్రమాలను ప్రశ్నిస్తున్న తమను టార్గెట్ చేసి కేసులు పెడుతున్నారని, వాక్ స్వాతంత్రాని కాలరాస్తున్నారని మండిపడ్డారు. రోహిత్ వేముల మరణం తర్వాత మరోసారి ఇక్కడ వెలివాడ వెలిసిందని, హెచ్‌సియూ విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న తమను వెలివేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఎఫ్ఐ సెక్రటరీ కృపా మరియా మాట్లాడుతూ ఎబివిపి విద్యార్థి సంఘం నాయకుల ఒత్తిడి వల్లనే మాపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. హెచ్‌సియూ ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ ధీరజ్ మాట్లాడుతూ సుకూన్ యానవల్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తే విద్యార్థి నాయకులను సస్పెండ్ చేశారని, కానీ ఎబివిపి ఆధ్వర్యంలో ఫెస్టివల్ చేస్తే విసి వారికి అన్ని విధాలా సహకరించారని, ఎబివిపి కి ఓ న్యాయం..మిగతా విద్యార్థి సంఘాలకు మరొక న్యాయమా అని అన్నారు. యూనివర్సిటీలోకి ఎబివిపి కార్యకర్తలు వచ్చి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా పట్టించుకోలేదని, కానీ శాంతియుతంగా ఫస్ట్ చేసుకునేందుకు అనుమతులు అడిగిన విద్యార్థులపై కేసులు పెట్టి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని ధీరజ్ అన్నారు. విసి బిజెపి దాని అనుబంధ సంఘాల ఒత్తిడి మేరకే పనిచేస్తున్నారని, పక్షపాత వైఖరి వల్ల విద్యార్థులు నష్ట పోతున్నారన్నారు.విసి ని వెంటనే తొలగించాలని, అలాగే నీట్ లో ఉన్న మెంబర్స్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సస్పెన్షన్ ను ఎత్తివేయాలని అన్నారు.ఈ ఆందోళనలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా యువత

### యాచారం సిఐ శంకర్‌కుమార్

ప్రజాపక్షం/యాచారం : యువత విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిషత్తును నాశనం చేసుకోవద్దని యాచారం సిఐ శంకర్ కుమార్ అన్నారు. బుధవారం యాచారం పోలీస్‌స్టేషన్ నుండి యాచారం వరకు విద్యార్థులు, పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా సిఐ శంకర్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఎక్కడా విక్రయించిన సమాచారం ఇస్తే తమ పోలీసులు అందుబాటులో ఉండి పట్టుకుంటారన్నారు. సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య మాట్లాడుతూ తమ పిల్లల బంగారు భవిషత్‌పై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. వారి ఆశలను వమ్ము చేయకుండా బుద్ధిగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, గోపాల్, వెంకట నారాయణ, కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





### డ్రగ్స్ వాడకం ఆరోగ్యానికి హానికరం

షాబాద్ : డ్రగ్స్ వాడకం ఆరోగ్యానికి హానికరమని షాబా సిఐ కాంతారెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ వెల్స్పన్ కంపెనీ అవరణలో డ్రగ్స్ డే సందర్భంగా వివిధ రాష్ట్రాల కార్మిక సిబ్బందితో డ్రగ్స్‌ను నిర్మూళిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండలంలో పని చేస్తున్న వివిధ రాష్ట్రాల ప్రజలు షాబాద్ మండల ప్రజలు తప్పని సరిగా డ్రగ్స్ దూరం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్వర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాశ్రేయస్సుకు పనిచేస్తా

### ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రజా శ్రేయస్సు కోసం, వారి అంచనాలకు అనుగుణంగా పని చేసేందుకు సిద్దంగా ఉన్నట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం బైర్‌ఖాన్‌పల్లి గ్రామస్తులు, బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా చూస్తానని పేర్కొన్నారు. రంగాపూర్‌లోని శ్రీ కోట మైసమ్మ దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలతోనే ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందని, దాంతో గ్రామీణ ప్రాంతాల ప్రజల సుఖ సంతోషాలతో ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పివైస్ చైర్మెన్ ఈట గణేష్, మాజీ సర్పంచులు క్రిష్ణయ్య, యాదగిరి రావు, వెంకటయ్య, గ్రామస్తులు యాదయ్య, నర్సింహ్మా, బాబు, శివ, వహిద్ పాషా, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.





## పెండింగ్ ప్రాజెక్టులు తీసుకురావాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధిగా ఢిల్లీలో పదవి బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎపి జితేందర్‌రెడ్డి ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన జితేందర్ రెడ్డి తో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా చాలా రంగాల్లో వెనుకబడి ఉన్నదని, అందుకోసం జిల్లా ను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు సహకారం అందించాలని, కేంద్రం నుంచి రావాల్సిన పెండింగు ప్రాజెక్టులు తీసుకురావాలని, మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కోసం అధిక నిధులను తేచ్చేందుకు దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి, వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ , వెంకట స్వామి, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లో గల ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవిఎం , వివి ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి అనుమతించారని అధికారులను, సెక్యూరిటీ గార్డుకు తెలిపారు. జిల్లా కలెక్టర్ తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, డిఆర్‌డిఓ నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికలు డిటి జాఫర్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆర్ఐ వెంకట్‌రెడ్డిపై లోతైన దర్యాప్తు

**ప్రజాపక్షం/బాలానగర్ :** బాలానగర్ ఆర్ఐ వెంకట్‌రెడ్డి పై లోతైన దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికార దుర్వినియోగానికి పాల్పడే అధికారులను సస్పెండ్ చేయడం సమంజసమేనని హేమాజీపూర్ గ్రామ నివాసి రాఘవేందర్ సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు బాలానగర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హేమాజీపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 113 లో తన తండ్రికి సంబంధించిన భూమి వివాదంలో ఉండగానే? ఆర్ఐ కావాలని జోక్యం చేసుకుని ఎకరం భూమిని ఇతరుల పేరు పైన మార్పిడి చేయించారని ఆరోపించారు. వివాదం ఉన్న నేపథ్యంలో తాహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని అలాగే అప్పటి జిల్లా కలెక్టర్ రవి నాయక్‌కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. అలాగే జడ్చర్ల కోర్టులో కూడా పిటిషన్ వేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇదేమి పట్టించుకోని ఆర్ఐ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ? ఎకరం భూమిని ఇతరుల పేరుపై ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందని తెలిపారు. ఇదే విషయాన్ని పలువురు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. అంతలోనే ఆర్ఐ సస్పెండ్ కావడం మంచి పరిణామం అని అడ్డు అదుపు లేకుండా చట్టాన్ని చేతిలోకి తీసుకుని ఆర్ఐ వ్యవహరించారని ఆరోపించారు. ఆర్ఐ వెంకట్‌రెడ్డి చేతిలో ఎంతో మంది బాధితులు మోసపోయారని, వారందరిని కలుపుకుని ఆర్ఐ పై మూకుమ్మడి చర్యలకు పూనుకుంటామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశ అనంతరం ఆయన బాలానగర్ పోలీస్ స్టేషన్లో ఆర్ఐ వెంకట్‌రెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

## సెల్ ఫోన్ అప్పగింత

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** బస్సులో జారవిడుచుకున్న సెల్ ఫోన్ ఆధార్ కార్డును జార విడుచుకున్న వ్యక్తికి అప్పగించి బస్ డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ భగవాన్ దాస్ కొల్లాపూర్ వెళ్లే బస్సు కు డ్రైవర్‌గా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అదే బస్సులో కొల్లాపూర్ నుంచి వీపనగండ్ల గ్రామానికి చెందిన కురువ బాల కృష్ణ ప్రయాణించి మొబైల్ ఫోన్ ఆదార్ కార్డును జురవిడుచుకొని వీపన గండ్లలో బస్సు దిగి వెళ్లాడు. బస్సులో పోగొట్టుకున్న ఫోన్ ఆధార్ కార్డు లోని అడ్రస్‌తో వీపనగండ్ల సంబంధించిన వ్యక్తిని గుర్తించి బస్ డ్రైవర్ భగవాన్ దాస్ కురువ బాలకృష్ణకి అందజేశారు. డ్రైవర్ నిజాయితీని చాటుకోవటానికి గ్రామస్తులు అభినందించారు.

## మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** మాదక ద్రవ్యాల బారిన పడి యువత జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జూన్ 26న ప్రపంచ మాదక ద్రవ్యాలు , అక్రమ రవాణా దినోత్సవాన్ని పోలీస్ , జిల్లా సంక్షేమ దాఖలు సంయుక్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన భారీ ర్యాలీలో జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణ మూర్తి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆర్. లోక్‌నాథ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలను ఒక్కసారి వాడి చూద్దామని ఒక్కసారి వాడటం వల్ల బానిస అయిపోనని అనుకొని మొదటి సారి వాడతారన్నారు. యువత ఆ ఒక్కసారి కూడా సిగరేట్ , గుట్కా, పాన్ మసాలా, గంజాయి వంటి వాటి జోలికి పోవద్దని పిలుపునిచ్చారు. యువత గొప్ప కలలు కాని వాటి సాకారానికి పాటు పడాలని కోరారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ కమిటి ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్కడైనా మత్తు పదార్థాలు వాడినట్లు తెలిసిన, ఉత్పత్తి చేసిన పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతకు ముందు జిల్లా సాంస్కృతిక శాఖ కళాకారులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను తమ పాటల రూపంలో వినిపించి ఆకట్టుకున్నారు. అనంతరం బాలుర కళాశాల మైదానం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు సాగిన విద్యార్థుల భారీ ర్యాలిని కలెక్టర్ , ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు.

## మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ప్రజాపక్షం/మల్దకల్ : మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల రాజశేఖర్ రెడ్డి ,పెద్దొడ్డి రామకృష్ణ ,యు గోపాల్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేస్తూ ,మాదకద్రవ్యాలు గంజాయి ,వంటి మత్తు పదార్ధాలకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలన్నారు .వీటిపై ప్రభుత్వం కూడా దృష్టి సారించి ,వీటిని అంతం చేసి రూపుమాపాలన్నారు .మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు వీటి జోలికి పోకూడదు అన్నారు .ముందు ముందు భవిష్యత్తులో మనమందరం ఆరోగ్యమే మహాభాగ్యం అనే వినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలి అన్నారు .

# ఫిరాయింపులపై కెటిఆర్ మొసలి కన్నీరు

### ఆది శ్రీనివాస్ , మక్కాన్ సింగ్ ఠాగూర్ ఎద్దేవా



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపులపైన కెటిఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నాడని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను కెసిఆర్ హీనాతిహీనంగా చూశారన్నారు. టిడిపి నుండి వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చేసినప్పుడు మాజీ సిఎం కెసిఆర్‌ను మాజీ మంత్రి కెటిఆర్ అప్పట్లో ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కెటిఆర్ చెప్పాలన్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్‌తో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాలకు ఆకర్షితులై బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కెసిఆర్ బంతి భోజనాలు చేయడంపై వారు స్పందిస్తూ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారనే కెసిఆర్ తన ఫామ్ హౌస్‌కు పిలిపించి వీడ్కోలు పార్టీలు ఇస్తున్నాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు ప్రగతి భవన్ గేట్లు ఎందుకు తెరుచుకోలేదు..? చెప్పాలన్నారు. టిఆర్‌ఎస్ నుంచి బిఆర్‌ఎస్ గా పార్టీ పేరు మార్చుకున్నప్పుడే తెలంగాణ తో పేగు బంధం తెగిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి తుఫాన్‌లో బిఆర్‌ఎస్ కొట్టుకుపోయిందన్నారు. బిఆర్‌ఎస్ మునిగిపోతున్న నావ...అని ఆ నావలో ఎవరూ ఉండరన్నారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ప్రజాప్రతినిధులకు గౌరవం ఇస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్‌లో ఇక మిగిలేది ఆ నలుగురు మాత్రమేనని, త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పైన ఉన్న గౌరవం తోనే తమ సిఎం రేవంత్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లారన్నారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ ఫామ్ హౌస్ లో విందు పేరుతో కెసిఆర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పైన కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. ఇంత కాలం ఎమ్మెల్యేలకు కెసిఆర్ కనీస గౌరవం ఇవ్వలేదన్నారు. కెసిఆర్ విందు భోజనాల పేరిట ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేస్తున్నట్లుందన్నారు. పదేళ్లలో రాజ్యాంగం, అన్యాయం, అక్రమం అన్న మాటలు కెటిఆర్‌కు గుర్తు రాలేదా..? అని నిలదీశారు. ప్రగతి భవన్ కంచెలు తాకకుండా దుర్మార్గమైన పాలన చేశారని, మళ్లీ గడిలనుకట్టడానికి కెసిఆర్ ప్లాన్ చేస్తున్నట్లుందన్నారు. బిజెపితో కలిసి కెసిఆర్ అనేక కుట్రలు చేశారని మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు గట్టి బుద్ధి చెప్పారని, కుట్రలు, కుతంత్రాలు చేస్తే రేవంత్ రెడ్డి తుఫాన్ లో కొట్టుకుపోతారని హెచ్చరిస్తున్నామన్నారు. గతంలో కెసిఆర్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కొనుగోలు చేశారని, తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చేరుతున్నారన్నారు. ప్రతిపక్షాలను తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌరవిస్తున్నారని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివాదం మా అంతర్గతం అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జీవన్ రెడ్డి సీనియర్ నేత, గొప్ప నాయకుడు.. ఆయన పైన సిఎం రేవంత్ రెడ్డి కి అమిత గౌరవం ఉంది అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్ అన్నారు.

## న్యూక్లియర్ పవర్ రంగంలోకి ఎంఇఐఎల్

### ఎన్‌పిసిఐఎల్ నుంచి రూ.13 వేల కోట్ల ఇపిసి కాంట్రాక్ట్ దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 14 వందల మెగావాట్ ఎలక్ట్రికల్ (ఎం డబ్ల్యూ ఈ )అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (ఎన్ పిసిఐఎల్ ) ఆహ్వానించిన టెండర్‌లలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అగ్రస్థానంలో నిలిచింది. ఈపిసి పద్ధతిలో నిర్మించె ఈ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణం భారీ కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అణు ఇంధనశాఖ పరిధిలోని ఎన్‌పిసిఐఎల్ ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపిసి) పద్ధతిలో ఈ రియాక్టర్‌ల నిర్మాణానికి గత ఏడాది మే నెలలో టెండర్‌లు ఆహ్వానించింది. అదే ఏడాది అక్టోబర్ 4న టెండర్‌ల దాఖలుకు తుది గడువుగా నిర్ణయించారు. ఆ తరువాత రోజు అక్టోబర్ ఐదున సాంకేతిక బిడ్‌లను తెరిచారు. ఈ ఏడాది జూన్ 26న ప్రైస్ బిడ్‌లను తెరిచారు. ఈ బిడ్‌లో తక్కువ ధరను కోట్ చేసి ఎంఈఐఎల్ తొలి స్థానంలో నిలిచినట్లు సంస్థ డైరెక్టర్ సి.హెచ్. సుబ్బయ్య తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో ఎల్ అండ్ టి, బిహెచ్‌ఈఎల్ కూడా పాల్గొన్నాయి. ఈ రెండు సంస్థలు ఎక్కువ ధరను కోట్ చేసి, రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఎంఈఐఎల్ రూ. 12,799. 92 కోట్ల ధరను కోట్ చేసి, మొదటి స్థానంలో నిలిచింది. టెండర్‌ల విధానంలో ఎన్‌పిసిఐఎల్ క్వాలిటీ కం కాస్ట్ బేస్డ్ (క్యూసిబిఎస్) విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సంస్థ ఆహ్వానించిన ఇదే పెద్దది. టెండర్ ఖరారుకు ముందు ఎన్‌పిసిఐఎల్ నాణ్యతా ప్రమాణాలు, ఖర్చు నియంత్రణ ఇతర అంశాలపై అంచనాలు వేసింది. రూ. 13 వేల కోట్ల విలువ కలిగిన కాంట్రాక్టును ఎంఈఐఎల్ తొలిసారిగా దక్కించుకుని, అణు ఇంధన రంగంలోకి ప్రవేశించిందని సుబ్బయ్య చెప్పారు. ఇది తమ సంస్థ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

## బాల కార్మికులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః బాల కార్మికులు , కౌమార బాల కార్మికులపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి బాలకార్మికులు పనిచేసే ప్రాంతాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో 14 నుండి 18 సంవత్సరంలలోపు వయస్సు మధ్య గల కౌమార దశ బాల కార్మికులు, 0 నుండి 14 సంవత్సరముల లోపు వయస్సు బాల కార్మికులపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాల కార్మికులు , కౌమార దశ పనిచేసే ప్రాంతాల్లో వారిని గుర్తించి తీసుకున్న పునరావాస చర్యలపై సమీక్షించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని వివిధ మండలంలలో హోటళ్లు, నిర్మాణ రంగంలో భిక్షాటన ఇటుక, బట్టీలు, ఇతర చోట్ల ప్రమాదకర పనిచేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు కార్మిక శాఖ అధికారులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో కలిసి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో బాల కార్మికులను , కౌమార దశలో ఉన్న బాల కార్మికులను గుర్తిస్తే వారిని పనిలో నియమించిన వారిపై బాల కార్మిక నిర్మూలన చట్టం 2016 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాల కార్మికులు కౌమార దశ పిల్లలను బాలల సంరక్షణ కమిటీకి అప్పగించి వారి సంక్షేమంకు చర్యలు తీసుకోవాలని బాల కార్మికులు కౌమార దశ పిల్లలకు బాలల సంరక్షణ కమిటీకి అప్పగించి వారి సంక్షేమంకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల కార్మికులు, కౌమార వయస్సు బాల కార్మికులు పాఠశాల, కళాశాలలో ఉండాలని పనిలో ఉండవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. జులై 1 నుండి జులై 31 వరకు వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్‌లో తప్పి పోయిన, నిరాదరణకు గురైన, పనిలో ఉన్న బాల కార్మికులను గుర్తించాలని అన్నారు. ఆపరేషన్, స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ తో పాటు కార్మిక శాఖ రెగ్యులర్ గా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గుర్తించిన బాల కార్మికుల సంరక్షణ, వారికి విద్య అందించి సాధారణ జీవనంలో ఉన్నారా కేసు వారీగా వచ్చే సమావేశంలో సమీక్ష చేస్తానని అన్నారు. సమావేశం కు పూర్తి సమాచారం తో హాజరు కావాలని అధికారులకు ఆమె సూచించారు. టాస్కు ఫోర్స్ కమిటీ సభ్యులు పరిశ్రమల శాఖ జి.ఎం.బాబూ రావు మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే బాల కార్మికులను గుర్తించే వీలు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ స్వామి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ, షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ డిడి పాండు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు బానిస అయితే జీవితం నాశనం

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తమ పిల్లలు మాదకద్రవ్యాల బారినపడకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జూన్ 26న ప్రపంచ మాదకద్రవ్యాలు, అక్రమరవాణ దినోత్సవాన్ని జిల్లాపోలీస్, జిల్లా సంక్షేమశాఖలు సంయుక్తంగా నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌మైదానంలో నిర్వహించిన భారీ ర్యాలీని జిల్లా ఎస్పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్, అదనపు ఎస్పి రామేశ్వర్, నాగర్‌కర్నూల్ మున్సిపల్‌చైర్మన్ కల్పన, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారిణి గాయత్రీ, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారిని రాజేశ్వరి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణతోకలిసి మాదకద్రవ్యాల వాడకం అనర్థాలపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ర్యాలీని పోలీస్‌స్టేషన్‌నుండి శ్రీపురం చౌరస్తామీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించి పాల్గొన్నారు. అధికారులు, సిబ్బందితో నిర్వహించిన ఈర్యాలీ మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత, డ్రగ్స్‌తో స్నేహం చేయొద్దు ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు, డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం డ్రగ్స్‌రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం అనే నినాదాలతో సాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువత ఒక్కసారికూడా సిగరేట్, గుట్కా, పాన్‌మసాల, గంజాయివంటివాటికి జోలికి పోవద్దని అన్నారు యువత గొప్పకలలుకనివాటి సాకారినికిపాటుపడాలని కోరారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్‌కమిటి ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్కడైన మత్తుపదార్థాలు వాడినట్లుతెలిసిన , ఉత్పత్తిచేసిన పోలీసుశాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జీవితాన్ని మలుచుకునే ఈవయసులో మాదకద్రవ్యాలకు బానిసకావడం వల్ల జీవితంనాశనం అవుతుందన్నారు. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో యువత మాదకద్రవ్యాలకు అలవాటుకావద్దని, ఒకవేళవాటికి బానిస అయితే జీవితానికి అర్థమే ఉండదని అన్నారు. యువత కుటుంబానికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్ , డిఎస్పి శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు, పోలీసుశాఖ అధికారులు, సఖికోఆర్డినేటర్ సునీత, శ్వేత,విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ నివారణకు పటిష్టచర్యలు తీసుకోవాలని, ప్రతిశుక్రవారం డ్రైడేగా మార్చాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, డిఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌తోకలిసి సమావేశమందిరంలో సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధితశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలుపెరిగి డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా,, టైఫాయిడ్, డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈసమయంలో దోమలు, ఈగలు, వైరస్‌బ్యాక్టీరియా వ్యాప్తిచెంది సీజనల్ వ్యాధులుప్రబలే బెడద ఎక్కువ ప్రజలపై ప్రతాపం చూపుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను నిరోధించవచ్చు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు వాటి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. జిల్లానుండి గ్రామస్థాయివరకు పారిశుద్ధ్య కార్మికులు, వైద్య, అంగన్‌వాడి వర్కర్లు , ఎఎన్‌ఎంలు, ఆశప్రతి ఇంటికివెళ్లివారి ఆరోగ్యపరిస్థితిగురించి వారిఇంటి పరిసరాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తూ ఉండాలని, ఇంటిపరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా నీటితొట్టిలలో, టైర్‌లలో మురికినీరు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇంటివారు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులు, డ్రైనేజి వ్యవస్థలు ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు ఒక ప్రణాళికలు రూపొంచుకోవాలిఅని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు ఇంటింటికితిరిగి ప్రతిరోజు సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో డిపిఓ కృష్ణ, పిడి డిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, వివిధశాఖల జిల్లా అధికారులు, నాలుగుమున్సిపాలిటిల కమీషనర్లు పాల్గొన్నారు.



## ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపి ఎ.పి.జితేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసిన సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఆ సమయంలో విభజన చట్టంలో పొందుపర్చిన అంశాల అమలుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కృష్ణా నది నుంచి న్యాయంగా రావాల్సిన నీటి వాటా ఇప్పటికీ రాలేదని, సాగునీరు, త్రాగు నీరు సాధించేందుకు రాజీలేని పోరాటం చేస్తానన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో కూడా కేంద్రం చాలా అంశాలను పెండింగ్ లో పెట్టిందని, కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన వాటిని సాధించుకునేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వారధిగా ఉంటాయని, తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఢిల్లీలో తెలంగాణభవన్ నిర్మాణం కోసం కసరత్తు మొదలైందని, త్వరలోనే కొత్త భవనం నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. తనను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడమే కాకుండా ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా అవకాశం కల్పించి, క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చారన్నారు.

**జితేందర్‌రెడ్డికి పలువురు నాయకుల అభినందనలు**

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌రెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘురామిరెడ్డి, బలరామ్ నాయక్, చామల కిరణ్ కమార్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు వివేక్, యన్నం శ్రీనివాస్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కడియం శ్రీహరి, జితేందర్ రెడ్డికి పూష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## రూ.4 కోట్ల గంజాయి ధ్వంసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** "మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వయతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవంప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక ఇనోత్సవం" సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రూ.4 కోట్ల విలువచేసే గంజాయిని ధ్వంసం చేశారు. 52 కేసులలో స్వాధీనం చేసుకున్న సుమారు 1,575 కిలోల గంజాయిని ధ్వంసం చేశారు. సికింద్రాబాద్ అర్బన్‌లో 22 కేసుల్లో 579 కిలోలు, సికింద్రాబాద్ రూరల్‌లో ఐదు కేసుల్లో 98 కిలోలు, ఖాజీపేట డివిజన్‌లో 25 కేసుల్లో 896 కిలోలు ధ్వంసం చేసిన వాటిలో ఉన్నాయి. భువనగిరి తుర్కపూర్ గ్రామంలోని రోమో ఇండస్ట్రీస్‌లో ఈ ధ్వంసం ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అదనపు డిజి మహేష్ భగవత్, నోడల్ అధికారి చందన దీప్తితో పాటు అధికారులు ఎస్.ఎన్.జావేద్, టి.కృపాకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వెల్దండ ఎస్ఐ అరెస్టు



**ప్రజాపక్షం/వెల్దండ :** మైనింగ్‌కు సంబంధించిన సామాగ్రి దొంగతనంకేసులో కల్వకుర్తికి చెందిన ఓనిందితుడిని తప్పించేందుకు మధ్యవర్తి విక్రమ్‌ద్వారా రూ.50వేలు ఎస్ఐ రవి డిమాండ్‌చేశాడని బాధితుడు వెంకటేష్ ఏసిబిని ఆశ్రయించారు. దీంతోరంగంలోకిదిగిన ఎసిబి డిఎస్పి శ్రీకృష్ణగౌడ్ ఒక్కసారిగా పిఎస్‌పైదాడులు జరిపి ఎస్ఐరవిని అరెస్టుచేశారు. మండలకేంద్రంలోని ఓక్రషర్‌మిషన్‌లో చోరికిగురైన జిలెటిన్‌స్టిక్స్ కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఇంట్లో పట్టుబడ్డాయి. కేసు నమోదుచేయకుండా ఉండాలంటే రూ.50వేలు లంచం ఇవ్వాలని వెల్దండ ఎస్ఐ రవి డిమాండ్ చేశాడని లంచం ఇవ్వడానికి వెంకటేష్ ససేమిరా అనడంతో వెంకటేష్‌కు ఫోన్ ఎస్ఐ నేరుగా మాట్లడకుండా అతని డ్రైవర్ విక్రమ్‌తో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి విసిగించాడని అందుకు లంచం ఇచ్చేందుకు అంగీకరించాడు. ఎస్ఐ సూచన మేరకు మధ్యవర్తి కల్వకుర్తి పట్టణంలో విక్రమ్‌కు రాత్రి 10గంటలకు ఇచ్చాడు. అక్కడనే విక్రమ్‌ను అదుపులోకి తీసుకొని వెల్దండ పిఎస్‌కు తీసుకొచ్చారు. అక్కడే క్వార్టర్స్‌లో ఉన్న ఎస్ఐని పట్టుకున్నారు. అక్కడే విచారించి తెల్లవారుజామున అరెస్టుచేసి మహబూబ్‌నగర్‌లోని ఏసిబి కార్యాలయంకు తరలించారు. కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించనున్నట్లు తెలిసింది. కొంతమంది స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిళ్లవల్ల అధికారులు బలవుతున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వారికినచ్చితే ఒకటి నచ్చకపోతే ఇలాంటివాటిని ప్రేరేపించి అధికారులు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.



## ఎలాంటి సమస్య లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వర్షాకాలంలో పట్టణంలో ఎలాంటి సమస్యలేకుండా చూడాలని ఎంఎల్‌ఎ రాజేష్‌రెడ్డి, ఎంఎల్‌సి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ డెవలప్‌మెంట్ వర్క్ గురించి అడిగి తెలుసుకున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ, రోడ్లమరమ్మత్తుల ఫుట్‌పాత్‌గురించి ఎలాంటి సమస్యరాకూడదన్నారు. ఈసమావేశంలో పట్టణ మున్సిపల్ కమీషనర్ , అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
మహబూబ్‌నగర్ | గురువారం | 27 జూన్, 2024 | 11

## వాటర్ వర్క్స్ అధికారులతో చైర్మన్ సమావేశం



**ప్రజాపక్షం/నాగారం:** సిసి,బిటి రోడ్లు పాడుకా కుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.బుధవారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్‌బి అధికారులు, వాటర్ లైన్‌మెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వాటర్ లైన్లు, ఇంటి నల్ల కనెక్షన్లు ఇచ్చేటప్పు డు రోడ్లు పాడుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సతీష్, డిజిఎం నాగరాజు,కమిషనర్,డిఈఈ, మేనేజర్ ,సానిటేషన్, వర్క్స్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాల బారిన పడొద్దు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సిఐ రవీందర్ అన్నారు.బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో ధర్మసేవా ఆధ్వర్యంలో న్యూక్లియానిక్స్ కంపెనీలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా అందమైన జీవితాలను నిర్మించుకోవాలని, వాటికి బానిసలు కాకుండా ఉండాలంటే యోగ, ధ్యానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఖలీల్,సంస్థ కోఆర్డినేటర్లు ఉమాగుప్తా,వి నరేష్,మనోహర్‌రావు, రాములు, సౌజన్య,సునీల్, నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌కె పురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమాంతర బ్రిడ్జి కావాలి

### మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నిత్యం ప్రయాణీకుల రాకపోకల తీవ్రత దృష్ట్యా ఆర్‌కె పురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమాంతర బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు రైల్వే, జిహెచ్ఎంసి అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. బుధవారం ఆయన నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, రైల్వే అధికారి సుధాకర్, జిహెచ్ఎంసి ఈఈ రాజు, డిఈ రేణుక, బిఆర్ఎస్ పార్టీకి చెందిన జికె హన్మంతరావు, రావుల అంజయ్య, చిందం అంజయ్య, మేకల రాము యాదవ్, వెంకన్న శ్యామ్, రాజేష్, పాపిరెడ్డి, సాయి గౌడ్, సుధీర్, నరేష్,రాజేష్, రవీంద్ర, నవీన్,బాలకృష్ణ,శంకర్‌రావు, నర్సింహ, శోభ, ఉమాదేవి,రమాదేవి, పరిమళ తదితరులతో కల్సి నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్‌కె పురం ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఆర్‌కె పురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై తెల్లవారు జాము నుండి అర్థరాత్రి వరకు వేలాది వాహనాలు సంచరిస్తుంటాయని, ఇక్కడి రద్దీ కారణంగా తరచు ట్రాఫిక్ జామ్ ఏర్పడటమే కాక ప్రమాదాలకు సైతం దారి తీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో మరో సమాంతర ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపాదన రైల్వే అధికారులకు పంపామని, వెంటనే దీని కోసం ప్రణాళిక రూపొందించి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అవసరమున్న మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

## భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం

### 'కడ' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం / కొడంగల్ :** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ నిర్మణంలో బాగంగా భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అప్పాయిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 19 అసైన్డ్ భూమిలో దాదాపు 45 మంది రైతులు ఉన్నారు. వీరితో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌డివో శ్రీనివాస్, తహశీల్దార్ విజయ్‌కుమార్‌లు మాట్లాడుతు భూమి కోల్పోతున్న వారందరికి ప్రభుత్వ ధరకు కాకుండా ప్రత్యేకంగా రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎకరాకు 10 లక్షలు కేటాయించడంతో పాటు విద్యార్హతను బట్టి ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి రైతులు ససేమీరా అంటు మార్కెట్ వ్యాలు ప్రకారం భూములకు రెట్లు కట్టిస్తే భూములు లేని నిరుపేదలు ఎక్కడికి పోవాలని, ఎలా బ్రతకాలని అధికారులను నిలదీశారు. మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, వెటినరీ కాలేజ్‌లు మన ప్రాంతానికి వస్తే మన ప్రాంత అభివృద్దితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే విధంగా ఉంటాయని అన్నారు. వీరితో పాటు గ్రామ రైతులు తదితరులున్నారు.

## సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సింగరేణి రిటైర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కాప్రా ఇసీఐఎల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు దండంరాజ్ అధ్యక్ష్యత వహించారు.ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య,ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్‌లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి సింగరేణి యాజమాన్యంకు కార్మిక సంఘ నాయకులకు పలుసార్లు వినతి పత్రాలు సమర్పించామని ఎటువంటి ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణి విశ్రాంత ఉద్యోగులను సీనియర్ సిటిజన్లుగా గుర్తించి వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని,తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని,పెన్షన్ వర్తింపచేయాలని,త్వరంలో సిఎంకు ఉత్తరాలు వ్రాసి ఉద్యమం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సామంతుల నర్సింగ్‌రావు, ఉమాకర్,విజయబాబు,లింగయ్య,పార్థ సారథి,రామచంద్రరెడ్డి,ప్రసాద్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మాజి సిఎం కేసీఆర్‌ను కలువడానికి మాజి మంత్రి మేడ్చల్ ఎంఎల్‌ఏ చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంఎల్‌ఏ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌బినగర్ ఎంఎల్‌ఏ సుదీర్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు బుధవారం తరలివెళ్లారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. ఇందులో ఎంపిపి ఎల్లుబాయిబాబు, జడ్‌పిటిసి అనితలాలి, రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, మాజి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఉత్తమ సొసైటీగా శామీర్‌పేట



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ సంఘంగా ఎన్నికైంది. రైతులకు ఉత్తమ సేవలను, రుణాలు అందించిన సంఘంగా గుర్తించింది. బుధవారం రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభలో శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డికి రంగారెడ్డి జిల్లా కేంద్ర బ్యాంకు సంఘ చైర్మన్ కె సత్తయ్య మెమోంటోను అందజేశారు.శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డితో పాటు సంఘం సిబ్బందిని అభినందించారు. సంఘం సిఈవో నర్సింలు, పాల్గొన్నారు.

### విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు

# ఎఐవైఎఫ్ నిరంతర పోరు

### రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలమానిని ప్రకటించాలి

### ఎఐవైఎఫ్ మేడిపల్లి మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**ప్రజాపక్షం/బోడుప్పల్:** నిర్మాణం, పోరాటంతో పాలకుల యువజన వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలమానిని ప్రకటించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ మేడిపల్లి మండల సమితి సమావేశం బొడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ కాలనీ లోని ఇందిరా నగర్ సంక్షేమ సంఘం హాల్లో నాగరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని అన్నారు. యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పాదుకొల్పడానికి ఎఐవైఎఫ్ నిరంతరం కృషి సల్పుతున్నదని అన్నారు. దేశంకోసం ప్రాణార్పణ చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు లాంటి అమరవీరుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని, స్వాతంత్రోద్యమంలో యువకులను సమీకరించి వీరోచితమైన పోరాటం చేసిన ఏకైక యువజన సంఘం ఏఐవైఎఫ్ అని కొనియాడారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న తెల్లదొరలను తరిమింది. పొత్తిళ్ళలోనే ఎన్నో ఉద్యమ ఆటుపోట్లను ఎదుర్కొని యువజన హక్కుల సాధనకోసం, సామాజికాభివృద్ధికి పాటుపడుతూ యువజనోద్యమాల వేదికగా ముందుకు సాగుతున్నది ఏఐవైఎఫ్ విద్య, వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, సమగ్ర యువజన విధానం కోసం, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను రూపొందించి, అమలు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ పోరాటాలు చేస్తుందన్నారు. సామాజిక, న్యాయం, లౌకిక వాదన పరిరక్షణ, శాస్త్రీయ సోషలిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం, మాధకద్రవ్యాల కు వ్యతిరేకంగా, అశ్లీల సాహిత్యం, అశ్లీల సినిమాల నిషేధం కోసం, దేశాన్ని చీల్చడానికి కుట్రలు చేసే వచ్చిన్నకర శక్తులకు వ్యతిరేకంగా, దేశ ఐక్యత, సమైక్యత కోసం ఎఐవైఎఫ్ కృషి చేస్తున్నదన్నారు. అదేవిధంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో ఆకాంక్షలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, ఏఐవైఎఫ్ నేతలు నాగరాజు, మనిదీప్, కౌశిక్, సాత్విక్, కార్తీన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎఐవైఎఫ్ మేడిపల్లి మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక:** అధ్యక్షుడు డి.మనిదీప్, కార్యదర్శి జీ. నాగరాజు, ఉపాధ్యక్షుడు దినేష్, ఇషాక్ సహాయ కార్యదర్శి కౌశిక్, ఏడుకొండలు కోశాధికారి ఖాదర్, కౌన్సిల్ సభ్యులు సాత్విక్, కార్తిక్, సాయి రాజ్, భాస్కర్, ఒమర్,భాను, ప్రణయ్, ఉదయ్ కుమార్, అజయ్, వాసు, దినేష్ లను ఎన్నుకోవడం జరిగింది.

## జిల్లా పరిషత్ నూతన కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** జిల్లా పరిషత్ నూతన కార్యాలయాని బుధవారం హ్యాట్రిక్ జడ్పి చైర్ పర్సన్ పట్నం సునితమహేందర్ తో కలిసి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. అనంతరం సునిత మహేందర్ రెడ్డి తన కుర్చీలో ఆసీనులు అయ్యారు. అలాగే సీఈఓ ఛాంబర్ ను జడ్పి చైర్ పర్సన్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వికారాబాద్ జడ్పి కార్యాలయం మొదటిదన్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. జడ్పి చైర్ పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి రూ.5 కోట్లు ఖర్చుపెట్టి నూతన భవనం నిర్మించిందని అన్నారు. మిగతా పనులకు మహిళ శిశుసంక్షేమం నిధులు ఖర్చుపెట్టి బిల్డింగ్ పూర్తి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. పనులు చేసిన జడ్పిటీసీ లకు బిల్లులు చెల్లించాలని సీఈఓ సుధీర్ కు ఆదేశించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ 6 నెలల్లో జడ్పి భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. సునీతా మహేందర్ రెడ్డి కృషివలన రాష్ట్రంలోనే మొదటి బిల్డింగ్ సాధ్యమైందని అన్నారు. రాబోయే రోజుల్లో సునితమ్మకు మంచి పదవి వస్తుందని, దానికి తను బాధ్యత తీసుకొని సీఎంకు కోరుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక జైన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, జడ్పిటీసీలు శ్రీనివాస్ రెడ్డి, దారాసింగ్, సంతోష, ఎంపీపీలు కరుణ అజయ్ ప్రసాద్, అనసూయ, శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కోటిపల్లి మండల కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను జడ్పి చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి జడ్పిటీసీలు ధారాసింగ్, సంతోష, మాజీ జడ్పిటీసీ అంజయ్య, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, శివానంద్, నారాయణ రెడ్డి, రాజు, నరేందర్ రెడ్డి, చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దాం

### రూ.20, 50లక్షలతో కమ్యూనిటీ హాలు ప్రారంభం

### జిల్లా పరిష్యత్తు చైర్పసన్ సునీతారెడ్డి



**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** వికారాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరుచడంతో అధిక ప్రాధన్యతనిస్తు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ దశకు తీసుకోచ్చిన ఘనత మాదేనని జిల్లా పరిష్యత్తు చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.20లక్షల 50వేలతో నిర్మించిన కమ్యునిటీ హాల్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలకు అధిక నిధులను కేటాయించి మంచి అభివృద్ధిని అందించడం జరిగిందని అ న్నారు. ఇచ్చిన పనులను నాణ్యతగా చేస్తె మనను అందరు గుర్తిస్తారని , ఇచ్చిన నిధులు మరిచినా చేసిన పనులను గుర్తించుకుంటారని అన్నారు. అనంతరం తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన మీకు ఒత అభివృద్ధినైనా చేస్తానని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సిద్దంగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్, పెద్దేమల్ జడ్పీటీసీ ధారాసింగ్, బంట్వారం జడ్పీటీసీ సంతోష, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచులు నక్కల విజయలక్ష్మీ, బాలమణి, జ్ఞానేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ సంగయ్య స్వామీ, తదితరులు ఉన్నారు.

## బషీరాబాద్‌లో విద్యారంగ అభివృద్ధికి కృషి

### కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

### సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి




**ప్రజాపక్షం/తాండూరు :** విద్య పరంగా బషీరాబాద్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపిపి కరుణ అజయ్‌ప్రసాద్ ఆధ్యక్షతన జరిగిన బషీరాబాద్ మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅథితులుగా ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన సునితా మహేందర్‌రెడ్డిలు హజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీరాబాద్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.ఈ విద్య సంవత్సరం నుంచి ఇక్కడ నూతన జూనియర్ కళాశాల అకాడామిక్ ఇయర్ ప్రారంభించండం జరుగుతుందని,విద్యార్థులు ఎవ్వరు ఇబ్బందులు పడవద్దని సూచించారు.బషీరాబాద్‌ను విద్యరంగంలో అభివృద్ధి పర్చాలనే ఉద్దేశ్యంతోనే గత వారం రోజుల క్రితమే ఉన్నత విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరిని కలిసి కళాశాలకు పూర్తి స్థాయిలో టీచింగ్ ,నాన్ టీచింగ్ పోస్టులను భర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. అనంతరం 60మందికి కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్, చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఎంపిడిఒ, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులు ఎమ్మెల్యే కెపి వివేక్‌ని కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. వివేక్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూ మ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, దొంగల బెడ ద వంటి సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని పే ర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవం సొంతింటి కళ అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ మానస పుత్రిక రెండు పడకల గదుల ఇళ్లు అని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నెలకొన్న సమస్యలన్నింటిని సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అశోక్ కుమార్, సత్యనారాయణ, కిషన్, డేవిడ్, ప్రశాంత్ మోహన్, దుర్గాప్రసాద్, జయరాజు, శ్యామ్, ఝాన్సీ పాల్గొన్నారు.

**ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదం...**

ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానందకు స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా వారు బ్లాక్ బెల్ట్ అండ్ గ్రాండ్ మాస్టర్ చ్యూచూ సూట్ మెమోరియల్ సేవా అవార్డుని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ తనని స్పాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా వారు బ్లాక్ బెల్ట్ అండ్ గ్రాండ్ మాస్టర్ చ్యూచూ సూట్ మెమోరియల్ సేవా అవార్డుతో సన్మానించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. కరాటే సాధనతో ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యవంతంగా ఉండవచ్చని, శరీర ధృఢత్వం లభిస్తుందని తెలిపారు. నేటి యాంత్రిక జీవనంలో ప్రతిఒక్కరు వ్యాయామం చేయాలని సూచించారు. గ్రాండ్ మాస్టర్ సలీమ్ జావీద్, మాస్టర్ మీర్జా రషీద్ బేగ్, ఖాజా పశ, షోయబ్, బషీర్, సమీర్, నేతలు విజయ రాంరెడ్డి, అశోక్, భాస్కర్, బాలరాజు, మక్సూద్, ఇబ్రహీమ్ ఖాన్, ఫెరోజ్ ఖాన్, సిద్ధిక్, మోయిజ్, యూసుఫ్ పాల్గొన్నారు. .

## ఎంఎల్ఏ యాదయ్య, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మధ్య వాగ్వాదం




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా పరిషత్ భవనం ప్రారంభోత్సవ సందర్భంగా ఎమ్మెల్యేయాదయ్య, ఎమ్మెల్సి మహేందర్‌మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదని అన్నారు. డబ్బులు ఇ్వకుంటే ఇంత బిల్డింగ్ ఎలా సాధ్యంఅయింది అని అన్నారు. కాన్‌ట్రాక్టర్ మీరే నాయకులు మిరే కాద ఇన్ని రోజులు ఎందుకు మాట్లాడలేరు గత పది సంవత్సరాలు మిరే పాలించినారు అని ఎమ్మెల్యే అనాగా ఎమ్మెల్సీ వెంటనే ఎం మాట్లాడుతూన్నావు అని ఎమ్మెలే యాదయ్యవైపు చేయి చూయించరు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్ భవనం పనులు పూర్తి కాక ముందే ప్రారంభించడం ఎందుకు అడవుడిగా ప్రారంభించారు అని అన్నారు. భవనం పూర్తి కాకుండానే ప్రారంభిరు అని జిల్లాలో చర్చనియంగా మరింది. అవిశ్వసంతో పదవి పోతుంది అని ఈ ప్రారంభోత్సవం చేయించారు అని చర్చించుకుంటున్నారు

## దళితులపై దాడులు అరికట్టాలి

### ఎఎస్‌పికి ఫిర్యాదు చేసిన దళిత సంఘాల నాయకులు



**ప్రజాపక్షం/నవాబుపేట్ :**వికారాబాద్ జిల్లాలో దళితులపై దాడులు రోజు రోజుకు ఎక్కువ అయితున్నాయని జిల్లా దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నవాబుపేట మండలం గంగ్యాడ గ్రామానికి చెందిన బేగరి మల్లయ్య ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన భానూరి ఉపేందర్ రెడ్డి గత నెల 20న సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో మల్లయ్య ఇంటి ముందు (ఇంటికి ఎదురుగా) మలవిసర్జన చేస్తున్నాడు. అదే సమయంలో ఇంటి యజమాని అయిన బేగరి మల్లయ్య అన్న ఇంటి ముందు ఎందుకు మూత్రం పోస్తున్నావని ప్రశ్నించాడు. దాంతో ఆగ్రహంతో ఊగిపోయినా ఉపేందర్ రెడ్డి లంజా కొడకా నా ఇష్టం రా... మాల మాదిగ లంజా కొడుకులారా.. ఏడ అయినా మూత్రం పోస్తా మీరు ఏం చేస్తారు రా... అని పరుష పదజాలంతో మల్లయ్య పై దూషించాడు. ఈ విషయమై బేకరీ మల్లయ్య మరుసటి రోజు తేదీ 21 మే రోజు నవాబుపేట పోలీసులకు ఉపేందర్ రెడ్డి పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఇదిలా ఉండగా నవాబుపేట పో లీసులు బాధ్యుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బాధ్యుతుడైన మల్లయ్య గతంలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డికి, డిఎస్‌పి శ్రీనివాస రెడ్డికి ఫిర్యాదు చేయడంతో జూన్ 8న ఉపేందర్ రెడ్డి పై కేసు నమోదు చేశారు. కానీ ఇప్పటివరకు నిందితున్ని రిమాండ్ కు పంపించకపోవడంతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులకు బాధితుడైన మల్లయ్య ఈనెల 24న ఫిర్యాదు చేశాడు. అయినా ఎవరు స్పందించకపోవడంతో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి కి బుధవారం బాధ్యతుడైన మల్లయ్య జిల్లాలోని దళిత సంఘాల నాయకులతో కలిసి (ఏఎస్‌పి) రవీందర్ రెడ్డి కి ఫిర్యాదు చేయడం జరిగింది. స్పందించిన ఏ.ఎస్.పి రవీందర్ రెడ్డి నిందితుడి పై కేసు నమోదు చేయడం జరిగింది. త్వరలోనే పూర్తి విచారణచేసి రిమాండుకు పంపుతామని బాధితులకు హామీ ఇచ్చారు. మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరాజు, జిల్లా అధ్యక్షుడు గాలయ్య, ప్రగతిశీల జిల్లా కన్వీనర్ గీత, జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జగదీష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఆనందం, వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు శ్రీను, జాన్, అర్జున్, మల్లేశం, విట్టల్, పాండు, జంగయ్య, శ్రీశైలం, రామచందర్, ప్రభాకర్, శ్రీనివాస్, అంజయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

### మాజీ మంత్రి మల్లారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యాపార ఉద్యోగ రం గాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని మాజి మంత్రి మేడ్చల్ ఎంఎల్‌ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలో ఎస్‌సి కార్పొరేషన్ (టిఎస్‌సిసిడిసి), ప్రోఫ్యాషన్ ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో కుట్టుశిక్షణలో బాగంగా 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లతో పాటు సర్టిఫికెట్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన మాజి మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ మహిళలు దైర్య సాహసాలతో మం చి విద్యా నైపుణ్యాలను పెంచుకుని అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ప్రతి సంవత్సరం 300 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఎస్‌సి మహిళలకు సూయింగ్ మిషన్స్ అందజేసిన ప్రోఫ్యాషన్ సంస్థ అధ్యక్షురాలు ఉషను అభినందించారు. కుట్టుశిక్షణ కేంద్రానికి మొదటి నుంచి సహకరించిన జడ్‌పిటిసి అనితలాలిని అభినందించారు.ఎంపిపి ఎ ల్లుబాయిబాబు, జడ్‌పిటిసి అనితలాలి, ఎంపిటిసి ఇందిర రాజిరెడ్డి, కోఆప్షన్ జహీర్‌ఖాన్, కోఆర్డినేటర్ షకీలా, టీచర్ సరిత, మాజి సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ రెడ్డి, గుర్క కుమార్, నాయకులు లాలి, జగదీష్ గౌడ్, సతీష్‌రెడ్డి, బిఎన్ఆర్, యూసుఫ్, వంగ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సైనిక్‌పురి జలమండలి జిఎంగా అశోక్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సైనిక్‌పురి ప రిధి ప్రాంతాల్లో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూస్తానని జలమండలి జనరల్ మేనేజర్ అశోక్ అన్నారు.ఇప్పటి వరకు ఇక్కడ జిఎంగా విధులు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్ బోడుప్పల్ జలమండలి కార్యాలయానికి బదిలీ అవటంతో ఆయన స్థానంలో శామీర్‌పేట క్యాంపు కార్యాలయం నుండి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ నీటి విషయంలో కానీ డ్రైనేజి విషయంలో కానీ ప్రజలకు ఏవైనాసమస్యలుంటేతనను నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

క్రీడ



# దెబ్బకు దెబ్బ కొట్టాల్సిందే!

## ఇంగ్లాండతో తేల్చుకోవాల్సిన లెక్కలెన్నో

టీ20 ప్రపంచకప్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమ్‌ఇండియా సెమీఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది.గత దశాబ్ద కాలంగా నాకౌట్ మ్యాచ్‌ల్లో తడబడుతున్న భారత జట్టు ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని భావిస్తోంది. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 10 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిన టీమ్‌ఇండియా ఈసారి సెమీస్‌లో గెలిచి అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుత టీ20ప్రపంచకప్‌లో భారత జట్టు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు. గతంలో అనుసరించిన సంప్రదాయ విధానాన్ని పక్కనబెట్టి దూకుడైన ఆటతీరుతో టీమిండియా ఈ టోర్నీలో దుమ్మురేపుతోంది. ఆస్ట్రేలియాతో జరిగిన చివరి సూపర్ 8 మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ 41 బంతుల్లోనే 92 రన్స్ చేసి ఆకాశమే హద్దుగా చెలరేగగా రిషభ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, హర్దిక్ పాండ్య కూడా ఫామ్‌లో ఉండటం భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఐతే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఈ టోర్నీలో పేలవమైన ఫామ్‌తో సతమతమౌతుండటం రోహిత్ సేనను కలవరపెడుతోంది. ఓపెనర్‌గా వస్తున్న విరాట్ కోహ్లి తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. దాదాపుగా రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లికి ఇదే చివరి టీ20 ప్రపంచకప్ కావడంతో భారత్‌కు ట్రోఫీ అందించి తమదైన మార్క్ వేయాలని ఇరువురు క్రికెట్ దిగ్గజాలు కోరుకుంటున్నారు. వ్యక్తిగత మైలురాళ్లను పట్టించుకోకుండా ఇప్పటికే రోహిత్ శర్మ చెలరేగి ఆడుతున్నాడు. మిడిల్‌ఆర్డర్‌లో శివమ్ దూబే స్థాయికి తగ్గట్లు రాణించలేకపోతున్నాడు. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చేందుకు రోహిత్ ఇష్టపడకపోతే అదేజట్టుతో ఇంగ్లాండ్‌పై మ్యాచ్‌లో కూడా భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. స్పిన్ విభాగంలో ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్‌పటేల్‌తో పాటు స్పెషలిస్ట్ స్పిన్నర్ కులదీప్ యాదవ్ జట్టుకు అండగా నిలుస్తున్నారు. పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ సత్తా చాటుతుండటం టీమిండియాకు కలిసి వచ్చే అంశం. హర్దిక్ పాండ్యా తన ఆల్‌రౌండ్ ప్రతిభను కొనసాగించాలని భారత జట్టు కోరుకుంటోంది. మరోవైపు ఈ టోర్నీలో ఇంగ్లాండ్ ప్రదర్శన అంత అద్భుతంగా లేదు. గ్రూప్ దశలో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన ఇంగ్లాండ్ సూపర్8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. అమెరికాపై మ్యాచ్‌లో సత్తా చాటడం ద్వారా ఇంగ్లాండ్ కెప్టెన్ బట్లర్ తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. మ్యాచ్ స్వరూపాన్ని ఒక్కసారిగా మార్చివేయగల మరో ఓపెనర్ ఫిల్‌సాల్ట్‌ను భారత్ పవర్‌ప్లే ఓవర్లలోనే అవుట్ చేయాల్సి ఉంటుంది. బెయిర్‌స్టో, మెయిన్ అలీ నుంచి కూడా ఇంగ్లాండ్ భారీ స్కోర్ ఆశిస్తోంది. స్పిన్నర్ అదిల్ రషీద్ వేసే 4 ఓవర్లు ఆ జట్టుకు కీలకంగా మారనున్నాయి. పేసర్ జోఫ్రా ఆర్చర్ ఈ టోర్నీలోని ఏడు మ్యాచ్‌ల్లోనూ మెరుగ్గా రాణించాడు. అమెరికాపై హ్యాట్రిక్‌తో సత్తా చాటి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్న జోర్డాన్ కొత్త బంతితో రోహిత్, కోహ్లిని ఇబ్బంది పెట్టాలని భావిస్తున్నాడు. మ్యాచ్ వేదికైన గయానాలో వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. రెండో సెమీఫైనల్‌కు రిజర్వ్ డే లేదు. కానీ 250 నిమిషాల అదనపు సమయం కేటాయించారు. సెమీస్‌లో ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది. అసలు వర్షం కారణంగా మ్యాచ్ జరగకపోతే అధిక ర్యాంక్ జట్టు ఫైనల్‌కు వెళుతుంది. అంటే భారత్ నేరుగా ఫైనల్‌కు చేరుతుంది.

## కొత్త బాధ్యతల్లోకి వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్..



టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సరికొత్త బాధ్యతల్లోకి అడుగు పెట్టబోతున్నారు. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హెచ్‌ఆర్ శ్రీనివాసన్ స్థానంలో కపిల్ దేవ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.'పిజిటిఐ ప్రెసిడెంట్ కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా.కొన్నేళ్లుగా ఆర్గనైజేషన్‌తో కలిసి పనిచేస్తున్నా. ఇది ప్లేయర్లకు మద్దతుగా నిలిచే సంఘం. చాలా ఏళ్లుగా నేనూ గోల్ఫ్ ఆడుతున్నా.తప్పకుండా నావంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నా. ఇంకాస్త అదనంగా నా స్నేహితులతోగోల్ఫ్ ఆడే అవకాశం వచ్చిందనుకుంటు న్నా' అని కపిల్ తెలిపారు. పారిస్ ఒలింపిక్స్‌లో తలపడేందుకు హాకీజట్టు సిద్ధమవుతోంది. తాజా గా జట్టును హాకీ సంఘం ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో జట్టు తలపడనుంది. ఐదుగురు అరంగేట్రం చేయనున్నట్లు భారత హాకీ సంఘం వెల్లడించింది. పూల్‌బిలో బెల్జి యం, ఆస్ట్రేలి యా, అర్జెంటీనా, న్యూజిలాం డ ఐర్లాండ్ గ్రూప్‌లో భారత్ ఆడనుంది.

**జట్టు ఇదే:** శ్రీజేష్ పరట్టు రవీంద్రన్, జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదస్, హర్మన్‌ప్రీత్ సింగ్, సుమిత్, సంజయ్, రాజ్‌కుమార్ పాల్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, మన్‌దీప్ సింంగ్, గుర్జత్ సింగ్, నీలాకాంత్ శర్మ, జగ్‌రాజ్ సింగ్, కృష్ణన్ బహదూర్ పాఠక్.

## ఒకే ఓవర్లో 43 పరుగులు

### 134ఏళ్ల చరిత్రలో రికార్డ్

ఇంగ్లాండ డొమెస్టిక్ క్రికెట్‌లో సంచలనం నమోదైంది. ఒకే ఓవర్‌లో 43 పరుగులు వచ్చాయి. ఇంగ్లాండ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో బుధవారం జరిగిన లాసెస్టర్‌షైర్ ససెక్స్ మ్యాచ్‌లో ఈ ఫీట్ నమోదైంది. ఇది 134 ఏళ్ల ఇంగ్లాండ కౌంటీ క్రికెట్‌లో అత్యంత ఖరీదైన ఓవర్. ససెక్స్ బౌలర్ ఒలీ రాబిన్సన్ బౌలింగ్‌లో లాసెస్టర్‌షైర్ బ్యాటర్ లూయిస్ కింబర్ ఏకంగా 43 పరుగులు (3 నోబాల్స్) పిండుకున్నాడు. వరుసగా 6, 6nb, 4, 6, 4, 6nb, 4, 6nb, 1 (5 సిక్స్‌లు, 3 ఫోర్లు) బాది ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యంత ఖరీదైన ఓవర్‌గా మలిచాడు. ఈ క్రమంలో 27ఏళ్ల ఫస్ట్ క్లాస్ రికార్డు (36 పరుగులు)ను కింబర్ బ్రేక్ చేశాడు. గతంలో ఇది గార్ఫిల్డ్ (నొటింగమ్‌షైర్), రవి శాస్త్రి (ముంబయి) పేరిట ఉండేది. ఈ ఇద్దరు కూడా ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాది అప్పట్లో ఈ రికార్డు సాధించారు.

## కల్కి సీక్వెల్ ఉంటుందా?ఉండదా?

రీల్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో రెడీ అయిన కల్కి 2898 ఏడీ మూవీ మరికొద్ది గంటల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ గా రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. సినీ ప్రియులతో పాటు ప్రభాస్ ఫ్యాన్స్ అంతా సినిమా చూసేందుకు సిద్ధం గా ఉన్నారు. నాగ్ అశ్విన్ క్రియేట్ చేసిన అద్భుతమైన ప్రపంచం ఎలా ఉంటుందోనని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా సినిమా మాత్రం హాలీవుడ్ రేంజ్ లో ఉం డడం గ్యారెంటీ! అయితే మరికొద్ది గంట ల్లో మూవీ రిలీజ్ అవుతుందనగా.. సోషల్ మీడియాలో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా? ఉండదా? లేకుంటే అంతా ఒక్కసారే చూపిస్తా రా? ఇప్పుడు అంతా దీని గురించే డిస్కస్ చేసుకుంటున్నారు. ఎందుకంటే ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ నడుస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్ ను ఇంట్రెస్ట్ గా ఆ పేసి.. రెండు పార్ట్ లో ముగిస్తున్నారు. కానీ కల్కి విషయంలో ఇప్పటి వరకు మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు.చాలా మంది మాత్రం.. కల్కికి సీక్వెల్ కచ్చితంగా ఉంటుందని బల్లగుద్ది చెబుతున్నారు. కల్కి లాంటి పెద్ద సినిమా కథలు ఒక్క పార్ట్ లో ఎవరూ చెప్పలేరని అంటున్నారు. ముఖ్య ంగా నాగ్ అశ్విన్.. ఈ సినిమాలో మూడు ప్రపంచాలను క్రియేట్ చేసినట్లు చెప్పిన విషయం తెలిసిందే. పురాణాల కాన్సెప్ట్ ను తీసుకున్నట్లు కూడా చెప్పారు. కాబట్టి ఒక్క పార్ట్ లో సినిమా అంతా క్లారిటీగా చెప్పలేరని, అందుకే సీక్వెల్ పక్కా ఉంటుందని చెబుతున్నారు నెటిజన్లు.అయితే ఇంతకుముందు సీక్వెల్ కోసం చర్చ జరిగిన సమయంలో.. కమల్ హాసన్ తొలి భాగంలో కనిపించరని వార్తలు వచ్చాయి. మొత్తం ఆయన పార్ట్ సీక్వెల్ లోనే ఉంటుందనే టాక్ వినిపించింది. కమల్, ప్రభాస్ మధ్య యుద్ధం జరుగుతుందని ఇప్పటికే ట్రైలర్ ద్వారా లైట్ గా క్లారిటీ వచ్చింది. ఆ సీక్వెన్స్ సెకండ పార్ట్ లోనే ఉంటుందని చెబుతున్నారు నెటిజన్లు. ఫస్ట్ పార్ట్ లో కమల్ కాసేపు మాత్రమే కనిపిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. సినిమా అంతా అయ్యాక.. చివరలో సెకండ పార్ట్ కోసం మేక ర్స్ చెప్పే అవకాశం ఉందని సినీ ప్రియులు అం చనా వేస్తున్నారు. ఏది ఏమైనా ప్రేక్షకుల్లో ఎక్కు వ మంది మాత్రం సీక్వెల్ ఉంటుందనే అంటున్నారు. మరికొన్ని గంటల్లో యూఎస్ లో ప్రీమియర్స్ పడబోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉదయం 5.30 గంటలకు బెనిఫిట్ షోస్ ఉన్నాయి. దీంతో సీక్వెల్ కు సంబంధించి మరికొన్ని గంటల్లో ఒక క్లారిటీ వచ్చేయనుంది. మరి నాగ్ అశ్విన్ ఏం ప్లాన్ చేశారో వేచి చూడాలి.

## స్వయంభూ నిఖిల్ ఏం చేస్తున్నాడు...!



'కార్తికేయ 2', '18 పేజెస్', 'స్పై' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ నిఖిల్ హిట్స్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం ఈయన భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో 'స్వయంభూ' అనే సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా ను భారీ బడ్జెట్ తో ఠాగూర్ మధు నిర్మిస్తున్నాడు. కొన్ని కారణాల వల్ల ఆలస్యంగా సాగుతున్న స్వయంభూ సినిమా షూటింగ్ ప్రస్తుతం మారేడుమిల్లి ప్రాంతంలో జరుగుతుంది. అట వీ ప్రాంతంకు సంబంధించిన షూటిం గ్‌ను నిర్వహిస్తున్నారు అంటూ యూ నిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. నాగార్జున, నిఖి ల్ తో పాటు ఇతర చిత్ర యూనిట్ స భ్యులు ఈ షెడ్యూల్ లో పాల్గొంటున్నారట. ఈ షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్ నిర్మాణం జరిగిందట. రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమా కోసం ఎమ్ ప్రభాకరన్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ సినిమాలో నిఖిల్‌కు జోడీగా సంయుక్త మీనన్ నటిస్తున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ విభిన్నమైన కాన్సెప్ట్ తో ఈ సినిమాను దర్శకుడు భరత్ రూపొందిస్తున్నాడు. నిఖిల్ గత సినిమాల ఫలితాల నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. నిఖిల్ ఈ సినిమాతో ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు రావాలని భావించినప్పటికి కూడా షూటింగ్ ఆలస్యం అవుతున్న కారణంగా ఈ ఏడాది విడుదల సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విడుదల విషయంలో త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## దళపతి గోట్ సైలెన్స్‌కి రీజన్ ఏంటి..?



కోలీవుడ్‌స్టార్ హీరో దళపతి విజయ్ సిని మా రిలీజ్ అంటే ఆ హీరో ఫ్యాన్స్ చేసే హంగామా ఒక రేంజ్‌లో ఉం టు ంది. తమిళ్‌లో నెంబర్1 స్టార్‌గా తిరుగులేని క్రేజ్ తెచ్చుకున్న విజ య్ ఆ ఇమేజ్ కి తగినట్టుగానే సినిమా సక్సెస్‌లు అందుకుం టున్నా డు. దళపతి విజయ్ సిని మా అంటే చాలు ఫ్యాన్స్ కి పూనకాలు వచ్చేస్తాయి. ప్రస్తుతం విజయ్ వెంకట్ ప్రభు కాంబినేషన్ లో వస్తున్న సినిమా జి.ఓ.ఏ.టి. సినిమాలో విజయ్ డ్యుయల్ రోల్ లో నటిస్తున్నారని తెలిసిందే. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో త్రిష కూడా ఇంపార్టెంట్ రోల్‌లో ఛాన్స్ దక్కించుకుంది. సెప్టెంబర్ 5న రిలీజ్ లాక్ చేసుకున్న ఈ సినిమా విషయంలో మేకర్స్ అంతా కూడా చాలాసైలెంట్‌గా ఉన్నారు. సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ వదిలిన చిత్ర యూనిట్ లేటెస్ట్‌గా సాంగ్‌ని వదిలారు. దళపతి గోట్ సినిమా మరోసారి ఫ్యాన్స్ తో పాటుగా ఆడియన్స్‌కు మంచి మాస్ ట్రీట్ అందిస్తుందని అంటున్నారు.ఐతే తెలుగులో ఈసా రైనా విజయ్‌వచ్చి ప్రమోషన్స్ చేస్తాడా లేదా అని తెలుగు ఆడి యన్స్ డౌట్ పడుతున్నారు.విజయ్‌గోట్ సినిమాకు యువన్ శం కర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. ఇటీవలే యువన్ శంకర్ రాజా విశ్వక్‌సేన్ నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాకు మ్యూజిక్ అందించారు.విజయ్‌గోట్ సినిమాకు మ్యూజిక్ పరం గాకూడా యువన్ తన మార్క్ మ్యూజిక్‌తో అందించారని తెలుస్తుంది.

## కేజ్రీవాల్ పట్ల కేంద్రం వివక్ష

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ పట్ల కేంద్ర ప్రభుత్వం అత్యంత వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని సమాజ్‌వాద్ పార్టీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. ఆయనపై సిబిఐని ప్రయోగించి ఆప్‌ను పని చేయకుండా కేంద్రం చూస్తోందని మండిపడ్డారు. నిరవధిక దీక్షను భగ్నం చేసి ఆసుపత్రికి తరలించిన ఢిల్లీ మంత్రి ఆతిశీని ఆయన బుధవారం నాడు పరామర్శించారు. ఆతిశీ ధైర్యంగా ప్రజల తరు పున పోరాడుతున్నారని, ఢిల్లీ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్య మంత్రులకు కష్టాలు పెరిగాయని అఖిలేశ్ అన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలను అభివృద్ధి చేసిందని, కాని కేంద్ర ప్రభుత్వం మా త్రం ఆటంకాలు సృష్టిస్తోందన్నారు. బిజెపికి ముప్పు ఉన్నారని భావిస్తున్న వారిపై సిబిఐ వివిధ కేసులను బనాయిస్తుందన్నారు. కేజ్రీవాల్ జైలు నుండి బైటికి వస్తాడని కేంద్రానికి తెలిసి ఉంటుందని, ఆయనను బైటికి రానివ్వద్దని, ఢిల్లీ ప్రభుత్వం పనిచేయవద్దనే ఉద్దేశ్యంతో సిబిఐ కేసులు పెడుతోందన్నారు. ఒకరిపై సిబిఐ కేసులు పెట్టడం ఇదే మొదటిసారి కాదని, సిబిఐ, ఇతర సంస్థల దుర్వినియోగం ఫలితంగానే ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఓట్లు వేసారని అన్నారు. ఆతిశీని ఆసుపత్రిలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారాట్ కూడా పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్‌లు వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఆతిశీ పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానని, ఆమె తిరిగి పోరాట మార్గంలోకి వెళ్ళేందుకు సిద్ధపడుతున్నారని మీడియాకు చెప్పారు.

## టిఎంసి ఎంఎల్‌ఏల ప్రమాణస్వీకారానికి ఆదేశాలు ఇవ్వని గవర్నర్

**కోల్‌కతా:** ఇటీవల పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఇద్దరు తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంఎల్‌ఏలు) తమను అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయించేందుకు నిరాకరించిన గవర్నర్ సి.వి.ఆనంద్‌బోస్ తీరుకు నిరసనగా బుధవారం అసెంబ్లీ ఆవరణలో నిరసనకు దిగారు. ఎంఎల్‌ఏలు సయాంతికా బంద్యోపాధ్యాయ, రయత్ హొస్సేన్ సర్కార్‌లు సాయంత్రం 4 గంటల వరకు గవర్నర్ కెసం ఎదురు చూశారు. ప్రమాణస్వీకారం కోసం రావాల్సిందిగా తొలుత వారిరువురికి రాజ్‌భవన్ నుండి ఆహ్వానం అందింది. అయితే, ఉప ఎన్నికల్లో విజేతల చేత ప్రమాణ స్వీకారం చేయించాలని స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌లను గవర్నర్ ఆదేశించడం ఆనవాయితీ అని టిఎంసి పేర్కొంది. అదే విధంగా తాము కూడా అసెంబ్లీకి వచ్చి తమతో ప్రమాణస్వీకారం చేయించాలని, లేదా స్పీకర్‌కు ఆ బాధ్యత ఇవ్వాలని గవర్నర్‌ను కోరామని, కాని గవర్నర్ తిరస్కరించారని టిఎంసి నేత సర్కార్ తెలిపారు. ప్రమాణస్వీకారం అనేది రాజ్యాంగపరమైన నిబంధన అని, కాని ఇలాంటి పరిస్థితిని ఎదర్కొనడం దురదృష్టకరమని స్పీకర్ బిమన్ బెనర్జీ వ్యాక్యానించారు. ఒకవేళ స్వయంగా గవర్నరే ప్రమాణ స్వీకారం చేయించాలని భావిస్తే, తాము అందుకు ఏర్పాటు చేస్తామని, కాని ప్రతిష్ఠంభన కొనసాగకూడదని అభిప్రాయపడ్డారు.

## గుండెపోటు బ్యాంకు ఉద్యోగి మృతి!

**లక్నో :** తాజాగా విధులు నిర్వర్తిస్తున్న ఓ బ్యాంకు ఉద్యోగి హఠాత్తుగా సీటులోనే కుప్పకూలాడు. కొద్ది నిమిషాల్లోనే ప్రాణాలు కోల్పోయాడు. గుండెపోటుతోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళితే.. రాజేశ్ కుమార్ శిందే స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వ్యవసాయ విభాగానికి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. రోజులాగానే ఆఫీస్‌కు వెళ్లిన ఆయన విధులు నిర్వర్తిస్తు ండగా.. ఒక్కసారిగా సీటులో కుప్పకూలారు. గమనించిన సహోద్యోగులు సిపిఆర్ చేసి కాపాడేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపో యింది. ఆయన పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడకపోవడంతో హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఉద్యోగి ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు వెల్లడించారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. 30 ఏళ్ల వయసులో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.

# కేజ్రీవాల్‌కు 3రోజుల సిబిఐ కస్టడీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి అవినీతి ఆరోపణలపై విచారణ జరుపుతోన్న కేంద్ర దర్యాప్తు సంస్థ.. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను మూడు రోజుల కస్టడీకి తీసుకుంది. ఐదు రోజుల కస్టడీని సిబిఐ కోరినప్పటికీ న్యాయస్థానం అందుకు నిరాకరించింది. మద్యం కుంభకోణానికి సంబంధించి విచారణ నేపథ్యంలో కేజ్రీవాల్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో బుధవారం ఉదయం హాజరు పరిచారు. అదే సమయంలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని సిబిఐ కోరడంతో అందుకు న్యాయస్థానం అంగీకరించింది. న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఆదేశాలతో ఆయన్ను అరెస్టు చేసింది. అనంతరం ఐదురోజుల కస్టడీ కోరినప్పటికీ మూడు రోజులకు అనుమతించింది.

**సిసోడియా పేరు నేను చెప్పలేదు..**

కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరు పరిచిన సమయంలో కేసుకు సంబంధించిన సిఎం తన వాదనలను స్వయంగా వినిపించారు. ఈ కేసులో మనీశ్ సిసోదియా పేరు తానే చెప్పినట్లు వస్తున్న వార్తలను ఖండించారు. 'లిక్కర్ పాలసీ కుంభకోణంలో మొత్తం పాత్ర మనీశ్ సిసోదియాదే అంటూ వాంగ్మూలం ఇచ్చానని సిబిఐ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. దీనిపై మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం.సిసోడియాపై గానీ, ఇతర వ్యక్తులపై గానీ నేను ఎలాంటి నిందలు వే యలేదు. నేను, సిసోడి యా, ఆమ్‌ఆద్మీ పార్టీ అం తా అమాయకులం. మీడియాలో మాపై దుష్ప్రచారం చేయాలని సిబిఐ ప్లాన్ చేస్తోంది. అందుకే విశ్వసనీయ వర్గాల పేరుతో నకిలీ సమాచారాన్ని వ్యాప్తి చేసి సంచలనం సృష్టించాలని చూస్తోంది. దీనిపై స్పష్టత రావాలి' అని కేజ్రీవాల్ వాదించారు. ఇదిలా ఉండగా, మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కుబెయిల్ మంజూరుచేస్తూ ట్రయల్ కోర్టు గతగురువారం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, ట్రయల్ కోర్టు తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపిస్తూ ఇడి.. ఢిల్లీ హైకోర్టుకు వెళ్లింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై గతశుక్రవారం హైకోర్టు మధ్యంతర స్టే విధించింది.



దీనిపై మంగళవారం పూర్తి విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయి ల్ అమలును నిలిపివేస్తూ తీర్పు వెలువరించిం ది. ఇడి సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకోవడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని, బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని పేర్కొంది.

**సుప్రీంలో పిటిషన్ వెనక్కి..**

మరోవైపు హైకోర్టు స్టేను సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీనిపై హైకోర్టు నిర్ణయం వెలువడ్డాకే తమ తీర్పు ఉంటుందని.. సర్వోన్నత న్యాయస్థానం సోమవారం సూచించింది. దీనిపై బుధవారం విచారణ చేపట్టింది. కాగా స్టేను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా.. అందుకు కోర్టు అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఆదేశాలు, సిబిఐ అరెస్టు వంటి కొత్త పరిణామాల నేపథ్యంలో సమగ్ర పటిషన్‌ను దాఖలు చేస్తామని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టీతో కూడిన సెలవుకాల ధర్మాసనం అందుకు అనుమతించింది.

**వ్యవస్థలన్నీ అడ్డుకుంటున్నాయ్ : సునీత**

మరోవైపు కేజ్రీవాల్‌ను బెయిల్‌పై బయటకు రాకుండా వ్యవస్థలన్నీ అడ్డుకుంటున్నాయని సునీత కేజ్రీవాల్ ఆరోపించారు. ఇది నియంతృత్వం మాదిరిగానే కనిపిస్తోందన్నారు. ట్రయల్ కోర్టులో బెయిల్ వచ్చిన వెంటనే దాన్ని ఈడీ అడ్డుకుందని.. తాజాగా సీబీఐ ఆయన్ను అరెస్టు చేసిన తీరు ఇందుకు అద్దం పడుతోందన్నారు. మరోవైపు కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్టు చేయడంపై ఆమ్‌ఆద్మీపార్టీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బెయిల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేసే సమయంలోనే సిబిఐ ఆయన్ను అదుపులోకి తీసుకోవడం దారుణమని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ పేర్కొన్నారు. ఇంతకంటే అత్యయిక స్థితి ఉండదని, ఈ విషయంలో భాజపా ప్రతీకార రాజకీయాలు చేస్తోందని విరుచుకుపడ్డారు.

# విద్యార్థి సంఘాల ధర్నా

**న్యూఢిల్లీ :** నీట్ – యుజి వైఫల్యానికి వ్యతిరేకంగా జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నా జరిగింది. ధర్నాకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చారు. ఎఐఎస్‌ఎ, కాంత్రికారి యువ సంఘటన్ తదితర సంఘాలు కూడా ఇందులో పాల్గొన్నాయి. తక్షణమే నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, నీట్‌లో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 'ధర్మేంద్ర ప్రధాన్ ఇస్తీఫా దో' , 'స్క్రాప్ ఎన్‌టి' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. తక్షణమే నీట్–యుజి పరీక్షలను రద్దు చేసి, తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరారు. జెఎన్‌యులో పిహెచ్‌డి ప్రవేశాల కోసం ఎన్‌టిఎ నిర్వహించి పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఎ నిర్వహించిన యుజిసి–నెట్, నెట్ పిజి తదితర పరీక్షలు రద్దయిన విషయాన్ని జెఎన్‌యుఎస్‌యు గుర్తు చేసింది. దీంతోఎన్‌టిఎ




సామర్థ్యాన్ని, నైతిక ప్రశ్నార్థకమైందని పేర్కొంది. రాత్రంతా నిరసనను కొనసాగించేందుకు విద్యార్థులు టెంట్లు వేస్తుండగా, సాయంత్రం 5 గంటల సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి వారిని అరెస్టు చేశారు. ఈ నెల ఆరంభంలోనే పాత పద్ధతిలోనే జెఎన్‌యుఇఇ నిర్వహించాలని కోరుతూ జెఎన్‌యు వైస్‌ఛాన్సలర్ శాంతిశ్రీ డి.పండిట్‌కు జెఎన్‌యు విద్యార్థి సంఘం వినతిపత్రం సమర్పించింది.

# జమ్ముకశ్మీర్‌లో కాల్పులు ..

## ముగ్గురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలు కలకలం రేపాయి. దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ముష్కరులకు, భద్రతా సిబ్బందికి మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. డోడా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఉగ్రవాదులే ఇటీవల భారత సైన్యంపై కాల్పులు జరిపి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి భారీ స్థాయిలో మందుగుండు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు ఇటీవల వరుస దాడులకు పాల్పడుతున్నారు. దీంతో డోడా, రాజౌరీ, పూంచ్ ప్రాంతాల్లో వీరిని ఏరివేసే ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఆపరేషన్ మొదలుపెట్టిన భద్రతా దళాలకు.. అక్కడ ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారం వచ్చింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వారిపై కాల్పులు జరిపాయి. ఇందులో ముగ్గురు కుట్రదారులు హతమయ్యారు. భద్రతా దళాలపై జూన్ 11న ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులతో పాటు ఓ పోలీసు అధికారి తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఘటనలో పోలీస్ క్యాంపుపైనా దాడులు చేశారు. మరోవైపు భారత వాయుసేన కీలక స్థావరం ఉన్న పఠాన్ కోట్ జిల్లాలోనూ భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అక్కడా హైఅలర్ట్ ప్రకటించారు.

## ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారికైనా శిక్షతప్పదు :ఇసి

**అమరావతి:** ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని భారత ఎన్నికల సంఘం హెచ్చరించింది. మాచర్ల వైసిపి నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు ఘటనే నిదర్శనమని తెలిపింది. ఇవిఎంను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ముందస్తు బెయిల్ పిటిషన్ ఎపి హైకోర్టు కొట్టివేయడంతో పిన్నెల్లి అరెస్టు నేపథ్యంలో ఇసి స్పందించింది. రాజ్యాంగ బద్ధంగా శాంతియుతంగా నిర్వహించే ఎన్నికలు విషయంలో భవిష్యత్తులో భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి దుశ్చర్యలకు సాహసం చేయరని ఇసి వ్యాఖ్యానించింది. మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయడంతో ఇవిఎం ధ్వంసం ఘటనకు ముగింపు లభించిందని ఇసి పేర్కొంది. హోదాతో సంబంధం లేకుండా ఎవరూ చట్టానికి అతీతులు కాదన్న విషయం నిరూపితమైందని తెలిపింది. ప్రజాస్వామ్యాన్ని బెదిరించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అందుకు అనుగుణంగా ఈ అరెస్టు జరిగిందని స్పష్టం చేసింది. మే 13న జరిగిన పోలింగ్ సందర్భంగా మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని రెంటచింతల మండల పాల్వాయి గేటు పోలింగ్ స్టేషన్ నెం.202 లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి ఇవిఎంను ధ్వంసం చేసిన ఘటనను భారత ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. శాసనసభలో సిట్టింగ్ సభ్యుడు ఉద్దేశపూర్వకంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ధ్వంసం చేయడం నేరపూరిత చర్యగా.. ప్రజాస్వామ్య ప్రక్రియపై జరిగిన ఘోరమైన దాడిగా ఈసీ పేర్కొంది. వీడియో ఫుటేజ్ లను పరిశీలించిన తర్వాత, ఎమ్మెల్యేను తక్షణమే అరెస్టు చేయాలని మే 21న ఆదేశించినట్టు ఈసీఐ వెల్లడించింది.

